
2



# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - ఆదివారం 12 ఏప్రిల్ 2026 | సంపుటి: 10 | సంచిక: 96 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA




2

# శాంతి చర్చలు షురూ

## 5గంటలు ఆలస్యం కావడంపై ట్రంప్ అసహనం

## చర్చలు విఫలమైతే ఇరాన్‌కు అరిగోసే..

వాషింగ్టన్, ఏప్రిల్ 11: పాకిస్తాన్‌లోని ఇస్లామాబాద్‌లో పశ్చిమాసియా యుద్ధ చర్చలు నిర్ణీత సమయం కన్నా 5 గంటలు ఆలస్యంగా మొదలైనాయి. ఈ ఇరాన్-అమెరికా చర్చలు ఆలస్యమవడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. ఇరాన్ ముందస్తు షరతుల కారణంగా శాంతి చర్చలు 5 గంటలు ఆలస్యంగా ప్రారంభమైనట్టు ఆయన తెలిపారు. అవి ఎలా సాగుతాయో తనకు ఏమాత్రం అవగాహన లేదని.. చాలా తక్కువ సమయంలోనే ఇరాన్ చిత్తశుద్ధిని అంచనా వేస్తామని పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధి త్వరలోనే తిరిగి తెరుచుకుంటుందని..

...మిగతా 2లో




## 11 గంటలకు ఇంటర్ రీజల్ట్స్

### వాట్సాప్ ద్వారా మార్కులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

హైదరాబాద్, ఏప్రిల్ 11, ( మనం బ్యూరో): ఇంటర్ ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఆదివారం ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు

...మిగతా 2లో



# ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం

## జూన్ 20 నుంచి అమలయ్యే ఈ కొత్త పథకం ద్వారా 20 లక్షల మంది పేద బాలలకు ప్రయోజనం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఏప్రిల్ 11, మనం బ్యూరో: రాష్ట్ర అవతరణ దినోత్సవం నుండి ప్రభుత్వం మరో కొత్త పథకానికి శ్రీకారం చుట్టనుంది. జూన్ 2 నుండి ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం పథకాన్ని ప్రారంభించనుంది. ఈ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 20 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. శనివారం రవీంద్రభారతిలో జరిగిన మహాత్మా జ్యోతిబా పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునరిభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. దక్షిణాది రాష్ట్రాలను బలహీనపరిచేందుకు కేంద్రం ద్రవిడ రాష్ట్రాలకు పన్నుల రూపంలో వచ్చే వాటాను తగ్గించిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఫ్యూడల్ శక్తుల పునరేకీకరణ ప్రయత్నం జరుగుతోందనీ, బహుజనులు ఏకం కావాలి, ప్రజా ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలని

...మిగతా 2లో



## మహాత్మా పూలేకు సీఎం నివాళులు

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి పుష్పాలు సమర్పించి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మల్లు రవి, రోహిణ్ రెడ్డిలున్నారు.



## ఆశా భోస్లేకు గుండెపోటు?

### బ్రీచ్‌క్యాండీ ఆస్పత్రిలో చికిత్స

ముంబై, ఏప్రిల్ 11: ప్రముఖ గాయని ఆశా భోస్లే ఆస్పత్రిలో చేరారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబ సభ్యులు ముంబయిలోని బ్రీచ్‌క్యాండీ హాస్పిటల్ లో చేర్చారు. ఆమెకు గుండెపోటు వచ్చినట్లు తెలుస్తోంది. ఎమర్జెన్సీ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు.

## జీవన్ రెడ్డి అంటే మాకిప్పటికీ గౌరవమే

- ఆయన నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలె
- పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 11, (మనం బ్యూరో): కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన జీవన్ రెడ్డి అంటే మాకిప్పటికీ గౌరవమేనని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. అయితే, ఆయన బీఆర్ఎస్‌లో చేరాలని తీసుకున్న నిర్ణయం సరికాదనీ, అంతటి పెద్ద నేత పార్టీని వదిలి వెళతారని ఊహించలేదని పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ జీవన్ రెడ్డికి ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం లభించిందనీ,

...మిగతా 2లో



# హైడ్రా...‘అదుర్స్’

## అమీన్‌పూర్‌లో భారీగా కూల్చివేతలు

- రూ. 15 వేల కోట్లకు పైగా విలువైన 861 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
- ముఖీం గెస్టు హౌస్‌తో పాటు ఫామ్ హౌస్ కూల్చివేత
- కబ్జాలకు ఆస్కారం లేకుండా చుట్టూ ఫెన్సింగ్
- హర్షం వ్యక్తం చేసున్న ముఖీం బాధితులు

హైదరాబాద్, ఏప్రిల్ 11(మనం న్యూస్):

భాగ్యనగర చరిత్రలో నిలిచిపోయే భారీ ఆపరేషన్‌ను హైడ్రా శనివారం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో నిర్వహించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా 861 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడింది. ఈ భూమి విలువ బహిరంగ మార్కెట్లో రూ. 15 వేల కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య హైడ్రా, రెవెన్యూ, మున్సిపల్ శాఖలతో పాటు ఇతర విభాగాలు ఈ ఆపరేషన్‌ను సంయుక్తంగా నిర్వహించాయి. ఇప్పటికే ఇల్లు కట్టుకుని ఉన్న వారిని మినహాయించి ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడి చుట్టు కంచె

...మిగతా 2లో

## ఎక్సైజ్ శాఖలో బదిలీల లొల్లి

### కమిషనర్‌తో వివాదం.. నిజామాబాద్ డీసీ రాజీనామా

హైదరాబాద్, ఏప్రిల్ 11 (మనం బ్యూరో): రాష్ట్ర ఎక్సైజ్ శాఖలో కమిషనర్, నిజామాబాద్ డీసీ మధ్య వివాదం చర్చనీయాంశంగా మారింది. ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యపై గంజాయి బ్యాచ్ దాడి తదనంతర పరిణామాల నేపథ్యంలో గత మూడు నెలలుగా వీరిద్దరి మధ్య విభేదాలు నెలకొన్నట్లు ఆ శాఖలో ప్రచారం జరుగుతోంది. తాజాగా శుక్రవారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల బదిలీల సందర్భంగా మరోమారు ఇద్దరి మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. చివరకు అదే రోజు నిజామాబాద్ డీసీ సోమిరెడ్డి అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరడం, శనివారం రాజీనామా చేయడం వంటి పరిణామాలకు దారి తీసింది. ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి దూషిస్తున్నారని తన 30 ఏళ్ల సేవలను వదులుకుంటూ ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. శుక్రవారం జరిగిన బదిలీల్లో మానవతాధృక్పదంతో వ్యవహరించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేయగా, లోయర్ క్యాడర్ ఉద్యోగుల ముందు ఇష్టానుసారం మాట్లాడటం బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మాభిమానాన్ని చంపుకుని

...మిగతా 2లో

# దారి..తప్పితే...ఇంటి దారే

## ఎస్‌హెచ్‌ఓల పనితీరుపై నిఘా

- ఇక పోలీసు పంచాయతీలకు చెక్
- లా అండ్ ఆర్డర్ పోలీసులపై ఎస్‌బీ నివేదికలు
- ప్రతీ ఆరోపణపై ప్రత్యేక విచారణ



హైదరాబాద్, ఏప్రిల్ 11(మనం,ప్రత్యేక ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల పనితీరును మెరుగుపరిచేందుకు పోలీసు బాసులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. సివిల్ పంచాయతీలు, రియల్ మాఫియాలో దలదూర్చే పోలీసుల పట్ల మరింత కఠినంగా వ్యవహరించనున్నారు. విధులను దుర్వినియోగం చేస్తూ అక్రమార్జనకు పాల్పడే పోలీసులపై నిఘా అధికం చేయనున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ప్రతీ పోలీస్ స్టేషన్‌లో పోలీసుల పనితీరును పర్యవేక్షించేందు క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఇకపై పోలీసులపై వచ్చే ప్రతీ ఆరోపణపై విచారణ చేపట్టి వారిపై తగు చర్యలు తీసుకోనున్నారు. ముఖ్యంగా తీవ్ర నేరాలలో నిందితులకు సహకరించే పోలీసులకు పదవీ విరమణ పొందే వరకు ప్రాధాన్యత లేని పోస్టులకు బదిలీ చేసేందుకు పోలీసు బాసులు నిర్ణయం తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక జీవో రూపొందించేందుకు కసరత్తు ప్రారంభమైనట్లు పోలీసు

...మిగతా 2లో

## రేషన్ పంపిణీలో ‘సర్వర్’ పరేషాన్

- మూడు వేలి ముద్రలతో ముచ్చెమటలు
- గంటల తరబడి వేచి చూస్తున్న లబ్ధిదారులు
- కార్డుల రద్దుకు రంగం సిద్ధం!



హైదరాబాద్ ఏప్రిల్ 11(మనం న్యూస్): రాష్ట్రవ్యాప్తంగా రేషన్ బియ్యం పంపిణీలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. మూడు నెలల కోటా కోసం మూడుసార్లు వేలిముద్రలు వేయాల్సి రావడంతో సర్వర్లు మొరాయిస్తున్నాయి.దీంతో లబ్ధిదారులు గంటల తరబడి మండుటెండలో వేచి చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ నెలలో మూడు నెలల కోటాను ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో రేషన్ దుకాణాల వద్ద భారీ రద్దీ నెలకొంది. అయితే, సాంకేతిక సమస్యలు తోడవడంతో రాష్ట్రా వ్యాప్తంగా లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది.

**బయోమెట్రిక్‌తో చిక్కులు:**

ప్రస్తుతం ఉన్న సాఫ్ట్వేర్ నిబంధనల ప్రకారం.. మూడు నెలల బియ్యం తీసుకోవాలంటే లబ్ధిదారులు ఈ-పాస్ యంత్రంపై మూడుసార్లు వేలిముద్ర వేయాల్సి వస్తోంది. ప్రతి నెలకు విడివిడిగా అథెంటికేషన్ చేయాల్సి రావడంతో ఒక్కో కార్డుకు 20 నుండి 30 నిమిషాల సమయం పడుతోంది. ఒకేసారి లక్షలాది

...మిగతా 2లో



## తప్పుడు ప్రచారం చేస్తే.. చెప్పు తెగుద్ది!

### మంత్రి సీతక్క హెచ్చరిక

ములుగు, ఏప్రిల్ 11: అంగన్వాడీ టీచర్లకు ఇచ్చే ఫోన్లలో అవినీతి జరిగిందన్న దుష్ప్రచారాన్ని మంత్రి సీతక్క ఖండించారు. ప్రజలకు ఇచ్చే సంక్షేమ పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తే.. చెప్పు తెగుతదని హెచ్చరించారు.

...మిగతా 2లో



## కీసర టోల్‌ప్లాజా వద్ద ఘోర ప్రమాదం

కంచికచర్ల, ఏప్రిల్ 11: ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కీసర టోల్ ప్లాజా వద్ద ఘోర ప్రమాదం జరిగింది. బ్రేకులు విఫలమవ్వడంతో హైదరాబాద్ వైపు వెళ్తున్న ఫ్లయ్ యాష్ ట్యాంకర్ అదుపుతప్పి కారుపై బోల్తా పడింది. ఈ ఘటనలో హైదరాబాద్‌కు

...మిగతా 2లో


కేంద్రం వెన్నులో..వణుకు పుట్టేలా ఉద్యమిద్దాం 6 తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత


## ‘పరారైన’ జో బైడెన్ కొడుకు

### అప్పులు.. పన్ను ఎగవేత కేసులు తప్పించుకోవడానికేనా?



వాషింగ్టన్, ఏప్రిల్ 11: అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ కుమారుడు హంటర్ బైడెన్ దేశాన్ని వీడినట్లు తెలుస్తోంది. హంటర్ బైడెన్ విదేశాల్లో నివసిస్తున్నట్లు ఆయన న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఎక్కడున్నారన్న విషయంపై తనకు కూడా స్పష్టత లేదన్నారు. తనకు చెల్లించాల్సిన 50,000 డాలర్ల బకాయిలను కూడా చెల్లించలేదని తెలిపారు. అమెరికాలో 17మిలియన్ డాలర్ల (దాదాపు రూ.158కోట్లు) అప్పు ఉన్న సమయంలో హంటర్ యూఎస్సు వీడడం గమనార్హం. తాను అప్పుల్లో కూరుకుపోయినట్లు హంటర్ బైడెన్ గతేడాది ఓ ఇంటర్వ్యూలోనూ వెల్లడించారు. హంటర్ బైడెన్ ప్రస్తుతం దక్షిణాఫ్రికాలో ఉండే అవకాశం ఉన్నట్లు అమెరికా అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


**హంటర్ పై కేసులు..**

2018లో తుపాకీ కొనుగోలు సందర్భంగా ఆయుధ డీలరుకు

...మిగతా 2లో

## చాగోస్ దీవుల అప్పగింతకు బ్రిటన్ బ్రేక్

### ట్రంప్ పితలాటకమే కారణం..!



పోర్ట్ లూయిస్ (మారిషస్), ఏప్రిల్ 11: హిందూ మహా సముద్రంలోని చాగోస్ దీవులను మారిషస్ కు అప్పగించే ఒప్పందాన్ని బ్రిటన్ నిలిపివేసింది. ఈ ఒప్పందానికి గతేడాది ఓకే చెప్పినప్పటికీ.. ఆమోదించేందుకు(ర్యాటిఫై) పార్లమెంటులో గడువు ముగిసిపోయిందని బ్రిటన్ ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. చాగోస్ ద్వీప సముదాయంపై సార్వభౌమాధికారాన్ని మారిషస్కు అప్పగించేందుకు గత సంవత్సరం మే నెలలో బ్రిటన్ అంగీకరించింది. అయితే, ఇక్కడి డిగో గార్సియాలో ఉన్న బ్రిటన్-అమెరికా సంయుక్త సైనిక స్థావరాన్ని

...మిగతా 2లో

# మిషన్ సక్సెస్

## క్షేమంగా వచ్చేసిన ఆర్టెమిస్-2

**కాలిఫోర్నియా, ఏప్రిల్ 11:** విజయవంతంగా చంద్రుడిని చుట్టేసిన ఆర్టెమిస్-2 తిరిగి భూమికి చేరుకుంది. కాలిఫోర్నియా సమీపంలోని పసిఫిక్ మహాసముద్రం శాన్డియాగో తీరంలో వ్యోమగాముల ఒరాయన్ క్యాప్సుల్ ల్యాండ్ అయింది. వ్యోమగాములు క్షేమంగా తిరిగి రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అదే విధంగా మిషన్ సక్సెస్ అయినందుకు ప్రపంచ వ్యాప్తంగా సంతోషం వ్యక్తమవుతోంది.

# ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. ఎన్ని అవాంతరాలు వచ్చినా సామాజిక న్యాయం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందనీ, బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందనీ, కేంద్రం ఆమోదించి పంపుతుందని ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. అక్షరాన్ని ఆయుధంగా చేసుకుంటేనే అంతరాలు లేని సమాజ నిర్మాణం సాధ్యమవుతుందనీ, నమ్మిన ప్రజా ప్రభుత్వం తాజా బడ్జెట్లో విద్యాశాఖకు 13.5 శాతం నిధులు కేటాయించామన్నారు. ఇది విద్య పట్ల మా ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత అని పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే 40 శాతం డైట్ చార్జీలను 200 శాతం పెంచామనీ, వాటిని పర్యవేక్షించేందుకు చీఫ్ సెక్రటరీ స్థాయి నుంచి మండల స్థాయి అధికారి వరకు అధికారులు గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు సందర్శించాలనీ, అవసరమైతే అక్కడే నిద్రించాలనే నిబంధన రూపొందించామన్నారు. ప్రతి నియోజకవర్గంలో రూ.15 కోట్లతో సకల సౌకర్యాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభించనున్నట్లు ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు.

# 'పరారైన' జో బైడెన్ కొడుకు

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన దరఖాస్తు ఫారంలో హంటర్ తప్పుడు సమాచారం ఇచ్చారు. తాను అక్రమంగా డ్రగ్స్ కొనుగోలు చేయలేదని, వాటికి బానిస కాలేదని, తనవద్ద అక్రమంగా ఆయుధం లేదని వెల్లడించారు. అయితే అది తప్పని తేలింది. అప్పటికే హంటర్ డ్రగ్స్ అక్రమంగా కొనుగోలు చేశారు. కాలిఫోర్నియాలో 1.4 మిలియన్ డాలర్ల పన్ను ఎగవేత ఆరోపణలపై కేసు నమోదైంది.

అక్రమ ఆయుధం కొనుగోలు వ్యవహారంలో హంటర్ పై నమోదైన కేసులో 2024 జూన్లో న్యాయస్థానం ఆయనను దోషిగా తేల్చింది. అమెరికా అధ్యక్ష పీఠం నుంచి దిగిపోయే సమయంలో జో బైడెన్ అక్రమ ఆయుధం కొనుగోలు సహా రెండు క్రిమినల్ కేసుల్లో హంటర్కు క్షమాభిక్ష ప్రసాదించారు. తన కుమారుడిపై కేసులు రాజకీయ ప్రేరేపితమైనవేనని జో ఆరోపించారు.

# జీవన్ రెడ్డి అంటే మాకిప్పటికీ గౌరవమే

(మొదటి పేజీ తరువాయి)

కేవలం స్థానికంగా ఉన్న చిన్న విభేదాల కారణంగా దశాబ్దాల అనుబంధం ఉన్న పార్టీని వీడటం సరికాదని అభిప్రాయపడ్డారు. ఇన్నేళ్లుగా కేసీఆర్ అవినీతిపై పోరాటం చేసిన జీవన్ రెడ్డి ఇప్పుడు అదే కేసీఆర్ పక్కన కూర్చోవడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

ఇలాంటి నవ్వుల పాలయ్యే పనులు ఆయన స్థాయికి తగవని వ్యాఖ్యానించారు. పార్టీ వీడిప్పటికీ ఆయనంటే తమకు ఇంకా గౌరవం ఉందనీ, ఇప్పటికైనా ఆయన తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలని కోవాలని సూచించారు. జీవన్ రెడ్డి తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటే పార్టీకి, ఆయన రాజకీయ భవిష్యత్తుకు మంచిదని మహేష్ కుమార్ గౌడ్ అభిప్రాయపడ్డారు.

# రేషన్ పంపిణీలో 'సర్వర్' పరేషాన్

(మొదటి పేజీ తరువాయి)

మంది బయోమెట్రిక్ వేస్తుండటంతో సర్వర్లపై తీవ్ర ఒత్తిడి పెరిగి ప్రక్రియ నెమ్మదించింది. దీంతో వేలిముద్రలు పడక ప్రజలు గంటల తరబడి రేషన్ షాప్‌ల ముందు క్యూలైన్లలో నిలబడాల్సి వస్తోంది.

**మండుతున్న ఎండలతో అవస్థలు:**

ఓ వైపు ఎండలు మండుతుండటంతో వృద్ధులు, మహిళలు షాపుల వద్ద తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రద్దీని తగ్గించేందుకు కొన్ని చోట్ల డీలర్లు టోకెన్ సిస్టమ్ ప్రవేశపెట్టినప్పటికీ, అది మరింత గందరగోళానికి దారితీస్తోంది. మరోవైపు, గోదాముల నుంచి వస్తున్న బియ్యం బస్తాల్లో తూకం తక్కువగా ఉంటోందని డీలర్లు ఆరోపిస్తున్నారు. 50 కేజీల బస్తాలో 4 కేజీల వరకు తక్కువగా వస్తోందని, దీంతో తాము నష్టపోతున్నామని డీలర్ల సంఘం నేతలు పేర్కొంటున్నారు. సాంకేతిక సమస్యల వల్ల పంపిణీ ఆలస్యమవుతున్నందున, ఈ నెల రేషన్ పంపిణీ గడువును ఏప్రిల్ 30 తర్వాత కూడా పొడిగించాలని కార్డుదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అలాగే, మూడు సార్లు థంబ్ వేసే పద్ధతిని మార్చి, ఒకే వేలిముద్రతో 3 నెలల బియ్యం ఇచ్చేలా సాఫ్ట్‌వేర్ అప్డేట్ చేయాలని కోరుతున్నారు.

**కార్డుల రద్దుకు రంగం సిద్ధం:**

తెలంగాణలో అనర్హులకు 1.40 లక్షల రేషన్ కార్డులను రద్దు చేసినట్లు ఇటీవలె కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్ బాంభానియా పార్లమెంటుకు చెప్పిన సంగతి తెలిసిందే. మరోవైపు రేవంత్ రెడ్డి సర్కార్ కూడా రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా కలిగి ఉన్న రేషన్ కార్డుల ఏరివేత ప్రక్రియను ముమ్మరంగా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే తెలంగాణ విజిలెన్స్ విభాగం.. గుట్టు చప్పుడు కాకుండా.. రేషన్ కార్డులకు సంబంధించి రహస్య ఆడిట్ నిర్వహించగా అందులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్‌లోనే ఏకంగా 2 లక్షల మంది అనర్హులు రేషన్ కార్డులు కలిగి ఉన్నారని తేలింది.పాన్ కార్డు, గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ నంబర్లను రేషన్ కార్డు డేటాతో విజిలెన్స్ అధికారులు లింక్ చేయగా.. కీలక విషయాలు బయటపడినట్లు సమాచారం. ఒక్క హైదరాబాద్ నగరంలోనే దాదాపు 2 లక్షల మంది ఆదాయపు పను చెల్లించే వారు రేషన్ కార్డులను పొందినట్లు వెల్లడైంది.దీనికి సంబంధించి ఇప్పటికే 80 శాతం వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఐటీ పన్ను చెల్లించేవారు, ప్రభుత్వ ఉద్యోగుల రేషన్ కార్డులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాఫ్ట్‌వేర్‌తో విజిలెన్స్ అధికారులు గుర్తించడం గమనార్హం.దీంతో ఆ రేషన్ కార్డులను రద్దు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. అంతేకాకుండా రేషన్ కార్డు ద్వారా ఇప్పటివరకు పొందిన సబ్సిడీని కూడా రికవరీ చేసేందుకు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఇప్పుడు నకిలి రేషన్ కార్డుదారుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.

# ఎక్సైజ్ శాఖలో బదిలీల కలకలం

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగం చేయలేనంటూ ప్రభుత్వానికి డీసీ లేఖ రాశారు. కమిషనర్ చాలా మంది అధికారులు, సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్నారనీ, రెండు సంవత్సరాల నుంచి ఆయన తీరు ఇలాగే ఉందని ఆరోపించారు. తెలంగాణ వ్యక్తిగా ఏ తప్పు చేయకున్నా అధికారి తిడితే మాటలు పడలేం. అందుకే ఇక ఉద్యోగం చేయకూడదని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, నిజామాబాద్ డీసీ నిబంధనలకు విరుద్ధంగా తాను సూచించిన వారికి వారు కోరుకున్న స్థానానికి బదిలీ చేయాలని పట్టుబట్టారనీ, అందుకు కమిషనర్ నిరాకరించిన కారణంగానే ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగిందని ఎక్సైజ్ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

# కీసర టోల్‌ప్లాజా వద్ద ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

చెందిన సీనియర్ న్యాయవాది శ్రీనివాసరావు మృతి చెందారు. 16 చక్రాల అతి భారీ ట్యాంక్ మీద పడటంతో కారు నుజ్జునుజ్జయింది. అతి కష్టం మీద క్రేన్లు, జేసీబీ సాయంతో కారు మీద పడిన ట్యాంకర్ను తొలగించారు.

# చాగోస్ దీవుల అప్పగింతకు బ్రిటన్ బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

మాత్రం 99 ఏళ్లపాటు లీజుకు తీసుకుంటున్నట్లు పేర్కొంది. తద్వారా మారిషస్ కు ఏడాదికి 136 మిలియన్ డాలర్లు చెల్లిస్తామని కూడా చెప్పింది. ఈ ఒప్పందాన్ని అమెరికా తొలుత స్వాగతించింది. అయితే, ఇటీవల బ్రిటన్ తీరును విమర్శిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ .. చాగోస్ ద్వీపాలను మారిషస్ కుఅప్పగించడాన్ని వ్యతిరేకించారు. అదో తెలివి తక్కువ నిర్ణయమని విమర్శించారు. ఈ చర్యల ద్వారా చైనా, రష్యాల ముందు తలవంచుకోవాల్సి వస్తోందని పేర్కొన్న విషయం తెలిసిందే. ట్రంప్ ఈ నిర్వాకం వల్లనే బ్రిటన్ వెనక్కి తగ్గినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.



# 11 గంటలకు ఇంటర్ రిజల్ట్స్

(మొదటి పేజీ తరువాయి)

ఇంటర్ బోర్డు శనివారం అధికారికంగా ప్రకటించింది. ముందుగా ఈ ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విడుదల చేయాలని ఇంటర్ అధికారులు భావించినప్పటికీ ఆ తరువాత ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ప్రభుత్వ కార్యదర్శి యోగితా రాణా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 9.5 లక్షల మంది హాజరయ్యారు. మరోవైపు, ఇంటర్ విద్యార్థులు తమ ఫలితాలను నేరుగా వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ ఫలితాల కోసం మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వాట్సాప్‌లోనే పొందేలా ఏర్పాటు చేసింది. స్మార్ట్‌ఫోన్‌లలో 80969 58096 నంబరును సేవ్ చేసుకుని హాయ్ అని మెసేజ్ చేసి బీఐఈ ఎగ్జామ్ రిజల్ట్ అని టైప్ చేయడం ద్వారా ఫలితాలను చెక్ చేసుకోవచ్చు.




# తప్పుడు ప్రచారం చేస్తే.. చెప్పు తెగుద్ది!

(మొదటి పేజీ తరువాయి)

ములుగులో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అంగన్వాడీ టీచర్లకు రూ.11,650కు ఫోన్లు కొంటే.. రూ.14 వేలు అని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడారం పునర్నిర్మాణం పనుల్లో అవినీతికి తావులేదన్న సీతక్క.. ఆధారాలు ఉంటే చూపాలని సవాల్ విసిరారు. అవసరమైతే సీబీఐ విచారణ జరపాలన్నారు.

# జేఈఈ ప్రాథమిక కీ విడుదల

**ఢిల్లీ, ఏప్రిల్ 11:** దేశవ్యాప్తంగా ఇటీవల జరిగిన జేఈఈ మెయిన్ తుది విడత ఆన్లైన్ పరీక్షల ప్రాథమిక 'కీ' విడుదలైంది. ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు ఈ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. తాజాగా జాతీయ పరీక్షల సంస్థ (ఎన్టీఏ) పేపర్-1 పరీక్షకు సంబంధించిన ప్రొవిజినల్ ఆన్సర్ 'కీ', రెస్పాన్స్ షీట్లను శనివారం రాత్రి విడుదల చేసింది. ఈ కీపై ఈ నెల 13వ తేదీ రాత్రి 11.50గంటల వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు తెలిపింది. ఈ అభ్యంతరాలను నిపుణుల కమిటీ పరిశీలించిన అనంతరం తుది 'కీ'తో పాటు అభ్యర్థులు సాధించిన మెరుగైన స్కోరును పరిగణనలోకి తీసుకొని ఫైనల్ ర్యాంకులను ప్రకటించనుంది. ఈ ఏడాది జేఈఈ మెయిన్ తుది విడత పరీక్షలకు దాదాపు 11.23లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 11.06 లక్షల మంది పేపర్ -1 (బీఈ/బీటెక్) పరీక్ష రాయగా.. దాదాపు 55వేల మంది పేపర్ -2 (బీఆర్క్, బీ ప్లానింగ్) పరీక్షకు హాజరయ్యారు. జేఈఈ మెయిన్ పేపర్ -1 ఫలితాలను ఏప్రిల్ 20 నాటికి ప్రకటించే అవకాశం ఉన్నట్లు ఇటీవల ఎన్టీఏ ఓ ప్రకటనలో తెలిపింది.

# శాంతి చర్చలు షురూ

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యామ్నాయ చమురు మార్గాలు కూడా ఆవిర్భవిస్తున్నాయని అన్నారు. ఇరాన్ ను విఫలమవుతున్న దేశంగా అభివర్ణించారు. చర్చలు విఫలమైతే, అమెరికా తిరిగి దాడులు ప్రారంభిస్తుందని హెచ్చరించారు. ఇందుకు ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆ దేశంపై భీకర దాడులకు మునుపెన్నడూ వినియోగించనంత శక్తిమంతమైన ఆయుధాలను పంపించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ట్రంప్ వెల్లడించారు.

# అమెరికాపై నమ్మకం లేదు

## ఇస్లామాబాద్‌లో ఇరాన్ ప్రతినిధి బృందం

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 11:** శాంతి చర్చల్లో పాల్గొనడానికి ఇరాన్ పలు షరతులు విధించింది. ఏ కాల్పుల విరమణ అయినా లెబనాన్ను కూడా పరిగణనలోకి తీసుకోవడంతో పాటు ఆంక్షల పేరుతో స్తంభింపజేసిన తమ ఆస్తులను విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

ఇరాన్ పార్లమెంటు స్పీకర్ ఘాలిబఫ్ విలేకరులతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. యూఎస్ పై తమకు మంచి అభిప్రాయత దేశంతో గతంలో ఎదురైన అనుభవాలను గురించి ఆయన ప్రస్తావించారు. రెండుసార్లు చర్చలు జరుగుతుండగానే తమపై దాడికి పాల్పడ్డారన్నారు. తమ ప్రజల హక్కులను యూఎస్ గుర్తిస్తే.. వారితో ఒప్పందానికి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అయితే, చర్చలను ఒక ప్రచారంగా పరిగణిస్తే.. తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

**లెబనాన్- ఇజ్రాయెల్ మధ్య చర్చలు**

పాక్లో శాంతి చర్చలకు సమయం దగ్గరపడుతున్న వేళ.. కీలక పరిణామం చోటుచేసుకుంది. యూఎస్లోని లెబనాన్-ఇజ్రాయెల్ రాయబారులు ఫోన్లో మాట్లాడుకున్నారు. కాల్పుల విరమణ, వ్యవస్థీకృత చర్చలకు మార్గం సుగమం చేయడం లక్ష్యంగా ఈ సంభాషణ జరిగిందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

# అమెరికాకు ఇరాన్ షరతులు

## ట్రంప్ అసహనం

**టెహ్రాన్, ఏప్రిల్ 11:** ఇరాన్‌తో శాంతి చర్చలకు ముందు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు అతిపెద్ద చమురు ఆర్థిక వ్యవస్థలైన రష్యా, సౌదీ అరేబియా కంటే తమ వద్దే ఎక్కువ చమురు ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యంత నాణ్యత కలిగిన చమురు, గ్యాస్ను నింపుకోవడానికి ప్రపంచ దేశాలకు చెందిన అనేక ఖాళీ చమురు ట్యాంకర్లు అమెరికా తీరం వైపు వస్తున్నాయని పేర్కొన్నారు. 'మేము మీకోసం ఎదురు చూస్తున్నాం.. త్వరితగతిన స్పందించండి' అంటూ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. ప్రపంచంలో ఎక్కడికైనా చమురు ఎగుమతి చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉందన్నారు.మరికొన్ని గంటల్లో ఇరుదేశాల మధ్య చర్చలు ప్రారంభమవ్వనున్న నేపథ్యంలో ఇరాన్ అమెరికాకు పలు షరతులు విధిస్తుండడంతో కాల్పుల విరమణ ప్రయత్నాలు ఆలస్యమవుతున్నాయి. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం పాకిస్థాన్ కు వచ్చి నాలుగు గంటలకు పైగా అయినప్పటికీ, ఇరాన్ ప్రతినిధులతో ఇంకా ప్రత్యక్ష చర్చలు జరపలేదు. పాకిస్థాన్ ప్రధాని షరీఫ్ ఇప్పటికే వాన్స్ తో సమావేశమయ్యారు. ప్రస్తుతం ఇరాన్ అధికారుల బృందం పాక్ అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. లెబనాన్లో కాల్పుల విరమణ, స్తంభింపజేసిన ఇరాన్ నిధుల విడుదల అనే రెండు షరతులను ఇరాన్ అమెరికా ముందు ఉంచింది. అవి అమలైతేనే చర్చలు జరుగుతాయని స్పష్టం చేసింది.

# సర్కారీ ఉద్యోగులకు సోషల్ మీడియా నిబంధనలు

**పాట్నా, ఏప్రిల్ 11:** ప్రభుత్వ ఉద్యోగుల సోషల్ మీడియా వినియోగంపై బిహార్ ప్రభుత్వం కొన్ని నిబంధనలు విధించింది. డిజిటల్ సంస్థాగత క్రమశిక్షణను కాపాడుకునేందుకే వీటిని తీసుకొచ్చినట్టు ప్రభుత్వం పేర్కొంది. వినియోగంపై నిషేధం విధించే ఉద్దేశం లేదని, డిజిటల్ వేదిక(ఫేస్బుక్, ఎక్స్, ఇన్ స్టా, యూట్యూబ్)ల్లో హుందాగా వ్యవహరించేలా చూడడమే తమ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది.

**అమలులోకి తెచ్చిన నిబంధనలివే..**

◆ ప్రభుత్వ పథకాలు, విధానాలు, హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులకు వ్యతిరేకంగా సర్వీసులో ఉన్న ఉద్యోగులు వ్యక్తిగత అభిప్రాయాలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసేందుకు అనుమతి లేదు.

◆ వ్యక్తిగత సోషల్ మీడియా ఖాతాలకు సంస్థ అధికారిక మొబైల్ నంబర్లను, ఈమెయిల్ ఐడీలను ఉపయోగించకూడదు. నకిలీ ఖాతాలతో సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టొద్దు

◆ ఆఫీస్ ప్రాంగణంలో ఉన్నప్పుడు సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు, డాక్యుమెంట్లు షేర్ చేయడానికి అనుమతి లేదు. రీల్స్, లైవ్ స్ట్రీమ్ వంటివి పూర్తిగా నిషిద్ధం. ఇలాంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవు.

◆ ప్రభుత్వ ఉద్యోగులు ప్రతిపక్ష పార్టీలకు, మీడియా సంస్థలకు, సోషల్ మీడియాలో ప్రముఖ ఇన్ ఫ్లుయెన్సర్లకు మద్దతుగా నిలవడం, - కుల, మత విభేదాలను రెచ్చగొట్టేలా, సున్నితమైన అంశాలపై పోస్టులు పెట్టడటంపై పూర్తి నిషేధం. వర్తిస్తాయని ప్రభుత్వం ఆదేశాలు జారీ

# హైడ్రా...'అదుర్స్'



(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణం చేపట్టారు. హైడ్రా అధికారులు అక్రమ కూల్చి వేతలు చేపడుతున్న సమయంలో స్థానికంగా ఇల్లు కట్టుకున్నపేదలు, సామాన్యులు ఆందోళన చెందాల్సిన పని లేదని ఎప్పటికప్పుడు అధికారులు మైకు ద్వారా ప్రకటించారు. దీంతో పేదలంతా ఊపిరి పీల్చుకున్నారు. హైడ్రా ఫెన్సింగ్ కార్యక్రమానికి సహకరించారు. ఇదే సమయంలో అక్కడ పాత లే ఔట్లలోని ప్లాట్ల యజమానులు సంబరాలు చేసుకున్నారు. టపాసులు పేల్చి ఆనందాన్ని పంచుకున్నారు. మా లే ఔట్లను కాపాడు కోడానికి మేమంతా కోర్టుకు వెళ్లి న్యాయం కోసం ఎదురు చూస్తున్న తరుణంలో, ప్రభుత్వ భూమి అని రెవెన్యూ అధికారులు.. కాదు లే ఔట్లు వేశాం.. ఆ భూమి మాది అని అక్కడి ప్లాట్ల యజమానులు కోర్టులో పోరాడుతున్నామని,. మధ్యలో ఎం. ఎ. ముఖీం అనే న్యాయవాది వచ్చి అన్యాయంగా ఆ భూములను తెగనమ్ముకోవడానికి ప్రయత్నాలు చేశాడని, ఇన్నాళ్లకు ప్రభుత్వ యంత్రాంగం అడ్డుకట్ట వేసిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

**గెస్టు హౌస్‌తో పాటు.. ఫామ్ హౌస్ కూల్చివేత..**

అమీన్‌పూర్ మండలం ఐలాపూరంలోని సర్వే నంబరు 1 నుంచి 220 వరకూ ఉన్న ప్రభుత్వభూమిలో ఎలాంటి కట్టడాలు చేయరాదని 1998లో హైకోర్టు స్పష్టమైన తీర్పు చెప్పింది. ఆ తీర్పును ఏమాత్రం లెక్క చేయకుండా 2006లో ఎం. ఎ. ముఖీం గెస్టు హౌస్ కట్టాడు. గెస్ట్ హౌస్‌తో పాటు మొత్తం 40 ఎకరాల పరిధిలో ఫార్మ్ హౌస్ నిర్మించాడు. చుట్టూ ఫెన్సింగ్ వేసి హద్దులు కూడా ఏర్పాటు చేశాడు. ఇక అటువైపు కన్నెత్తి చూడడానికి కూడా అవకాశం లేకుండా తన అనుచర గణాన్ని కాపలా పెట్టాడు. ఇక్కడితో ఆగకుండా అక్కడ భూములను తెగనమ్మడం ప్రారంభించాడు. దీంతో అక్కడ లే ఔట్లు ఉన్నవారు మళ్లీ కోర్టును ఆశ్రయించారు. ఇరు పక్షల వాదనలు విన్న న్యాయస్థానం సదరు భూమి స్వరూపాన్ని మార్చరాదని ఇరు పక్షాలకూ 2013లో హైకోర్టు స్పష్టమైన తీర్పు చెప్పింది. హైకోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా.. 2.20 ఎకరాల్లో ముఖీం సోదరుడు ఎంఏ అజీం నిర్మించిన 6 అంతస్తుల అపార్టుమెంట్‌ను కూల్చేసింది. స్విమ్మింగ్ పూల్‌తో సహా విలాసవంతంగా నిర్మించుకున్న గెస్టు హౌస్‌తో పాటు అక్కడ నిర్మించిన గదులను ఇంటిని, ఇంటి చుట్టూ 40 ఎకరాల మేర గడీలు పెట్టి నిర్మించుకున్న ఫామ్ హౌస్, గుర్రాల కోసం నిర్మించిన శాలలను ప్రభుత్వ అధికారులు నేలమట్టం చేశారు.

**భూములు అమ్మకాలకు చెక్**

కోర్టు తీర్పులు పెండింగ్ ఉండగా.. ఆ భూమితో ఎలాంటి సంబంధం లేని ముఖీంతో పాటు అతని అనుచరులు ఇష్టానుసారం అమ్మకాలు చేస్తుండడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించింది. కోర్టు ఉత్తర్వులను తుంగలోతోక్కి ప్లాట్లుగా అమ్మేస్తున్న వారికి ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి హైడ్రా చెక్ పెట్టింది. చట్టాలంటే భయం లేకుండా..అధికారులను లెక్క చేయకుండా ఇష్టారాజ్యంగా కబ్జాలు చేసి అక్కడ లావాదేవీలు నిర్వహిస్తున్న ముఖీం కార్యకలాపాలకు ఫుల్ స్టాప్ పెట్టింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య 861 ఎకరాలకు ఫెన్సింగ్ వేసింది. సుమారు రెండు వేల మంది రెవెన్యూ, వెయ్యి మంది పోలీసులు, మున్సిపల్ అధికారుల సమక్షంలో హైడ్రా యంత్రాంగం ఈ భారీ ఆపరేషన్ నిర్వహించింది. ప్రజా ప్రతినిధులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ వందల కోట్ల రూపాయిలు కొల్లగొట్టిన ముఖీంకు హైడ్రా చెక్ పెట్టింది. 1263 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. ఇప్పటికే ఆభూమిలో కొన్ని ఇళ్ల నిర్మాణం జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీంతో పేదలు కట్టుకున్న ఇళ్లను మినహాయించి ఖాళీగా ఉన్న 860 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వ యంత్రాంగం కాపాడింది.

# దారి..తప్పితే...ఇంటి దారే

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు చెబుతున్నారు. పోలీసుల అవినీతి పోలీసులకే తెలుస్తుందని, లా అండ్ ఆర్డర్ పోలీసులపై నిఘా పెంచేందుకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు మరిన్ని అధికారాలు అప్పగించనున్నారు. ఈక్రమంలో రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లలోని పోలీసుల పనితీరుపై వారాని ఒకసారి నివేదికలు ఇచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు తెలియవచ్చింది. గతంలో నెలకో సారి నివేదికలు ఇచ్చే ఎస్బీ విభాగం తాజాగా వారానికి ఒకసారి నివేదికలు ఇచ్చేలా నిర్ణయం తీసుకోనున్నట్లు తెలియవచ్చింది. ఇటీవల పోలీసుశాఖలో వరుసగా ఏసీబీకి పట్టుబడుతుండటంతో డీజీపీ శివధర్‌రెడ్డి అసహనం వ్యక్తం చేసిన విషయం విదితమే. నిందితులకు కొమ్ముకాస్తూ బాధితులను లంచాల పేరిట వేధించే పోలీసులకు తనదైన శైలిలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రియాల్టర్లకు, అక్రమార్కులకు, అవినీతి పరులకు కొమ్ము కాసే ఖాకీల కట్టడికి పోలీసు బాసులు సరికొత్త నిర్ణయాలకు శ్రీకారం చుడుతున్నారు. వెరసి పోలీసు శాఖలో అవినీతి వరులను ఏరివేసేందుకు సన్నద్ధమౌతున్నారు.

**పోలీసు పరువుకు :**

పోలీసుశాఖ ప్రతిష్టకు భంగం కలిగించే పోలీసులపై ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా ఏసీబీ సోదాలలో పట్టుబడటం, ఏసీబీకి చిక్కకుండా పారిపోవడం, పరాయి స్త్రీలతో అక్రమ సంబంధాలు, తీవ్ర నేరాల కేసులోని నిందితులకు కొమ్ముకాయడం, స్టేషన్ బెయిల్ పేరిట లంచాలు తీసుకోవడం లాంటివి అధికంగా చోటుచేసుకుంటున్నాయి. గడచిన ఏడాది కాలంలో అవినీతి అరోపణలు, విధులలో నిర్లక్ష్యం ఫలితంగా దాదాపు 350 మంది పోలీసులను ఇంటిదారి పట్టించారు. ప్రజలకు రక్షణ అందించాల్సిన పోలీసులు అవినీతి, అక్రమార్కులకు



కొమ్ముకాస్తూ భక్షకులుగా మారడం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది, దీంతో ఆత్మరక్షణలో పడిన పోలీసు శాఖ ఎస్బీ విభాగాన్ని మరింత బలోపేతం చేసేందుకు సమాయత్తమౌతోంది.

**ప్రాధాన్యత లేని పోస్టులు:**

పోలీసు శాఖలో పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు ఆవినీతి, అక్రమాలు, అసమర్థత ఆరోపణలపై ఎస్బీ నివేదికల ఆధారంగా చర్యలు తీసుకోనున్నారు. తరచూ ఆరోపణలు ఎదుర్కొనే అధికారులకు ప్రాధాన్యతలేని పోస్టులలో కొనసాగించేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నారు. ముఖ్యంగా అవినీతి పరులకు, అక్రమార్కులకు కళ్లెం వేసేలా కఠినమైన నిర్ణయాలను తీసుకోవాలని పోలీసు బాసులు భావిస్తున్నారు. పోలీసు శాఖలో అవినీతి ఆరోపణలున్న పోలీసులపై వేటు వేసి ప్రజలకు శాంతిభద్రతలపై నమ్మకం కలిగించాలని పోలీసు బాసులు సమాలోచనలు సాగిస్తున్నారు. క్రమశిక్షణ, విధినిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులు ఏ స్థాయిలో ఉన్నా చర్యలు తీసుకునే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవడంతోపాటు పదోన్నతులలో ఆ ప్రభావం చూపించేలా చర్యలు తీసుకుంటున్నారు. పోలీసుల బాధితుల కోసం డీజీపీ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటుకు శ్రీకారం చుడుతున్నారు. పోలీసులపై వచ్చిన ఆరోపణలు నిజమని తేలితే ఆయా పోలీసులపై కేవలం సస్పెన్షన్ వేటుతో సరిపెట్టకుండా వారికి పదోన్నతులు రాకుండా ప్రణాళికలు కఠిన చర్యలు చేపట్టేందుకు సమాయత్తమౌతున్నారు.

ప్రతీ ఆరోపణపై విచారణ :

నేరాలను నియంత్రించాల్సిన పోలీసులే నేరాలకు పాల్పడితే ఎలా ? అంటూ ప్రజల్లో జరుగుతున్న చర్చపై పోలీసు బాసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రజాభిప్రాయం పేరిట సీఐడీ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి పోలీసుశాఖలోని అక్రమార్కులపై వచ్చే ప్రతీ ఆరోపణపై అంతర్గత విచారణ చేపడుతున్నారు. వెరసి క్రమశిక్షణ శాఖలో గీత దాటిన పోలీసులపై మరిన్ని చర్యలు తీసుకోనున్నారు. కేవలం కొందరి ఆవినీతి, అక్రమాల కారణంగా పోలీసుశాఖ ప్రతిష్ఠ బజారుపాలవుతోందని పోలీసు బాసులు భావిస్తున్నారు. నేరాలకు పాల్పడిన పోలీసులకు శిక్షలు ఖరారయ్యేలోపు శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు బాసులు భావిస్తున్నారు.

**సివిల్ పంచాయతీలు :**

రాష్ట్రంలో సివిల్ పంచాయతీలు, రియల్ మాఫియాలలో దలదూర్చే పోలీసుల పట్ల మరింత కఠినంగా వ్యవహరించనున్నారు. విధులను దుర్వినియోగం చేస్తూ ఆక్రమార్జనకు పాల్పడే పోలీసులపై నిఘా అధికంచేయనున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ప్రతీ పోలీస్ స్టేషన్‌లో ఎస్బీ (స్పెషల్ బ్రాంచ్) అధికారుల నివేదిక ఆధారంగా ఆవినీతికి పాల్పడే అధికారులను గుర్తించి వారికి తగిన రీతిలో చర్యలు తీసుకోనున్నారు. ముఖ్యంగా తీవ్ర నేరాలలో తలదూర్చిన పోలీసులకు పదవీ విరమణ పొందే వరకు ప్రాధాన్యత లేని పోస్టులలో దీర్ఘకాలం కొనసాగించాలని పోలీసు బాసులు నిర్ణయం తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక జీవో రూపొందించేందుకు కసరత్తు ప్రారంభమైనట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు.

# అమ్మ మాట-అంగన్వాడీ బాటతోనే ఆరోగ్యవంతమైన తెలంగాణ

## జంక్ ఫుడ్కు స్వస్తి చెప్తూ ఇంటి వంటకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

- గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా పోషణ్ పక్వాడ కార్యక్రమం
- రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



ములుగు, ఏప్రిల్ 11, మనం ప్రతినిధి : 'అమ్మ మాట - అంగన్వాడీ బాట'తోనే ఆరోగ్యవంతమైన తెలంగాణను నిర్మించడం జరుగుతుందని,జంక్ ఫుడ్కు స్వస్తి చెప్తూ ఇంటి వంటకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని,గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ములుగు జిల్లా కేంద్రంలోని ఐ లవ్ ములుగు థీమ్ వద్ద పోషణ్ పక్వాడ కార్యక్రమం అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ములుగు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆఫీస్, పాత బస్టాండ్ ఆవరణలో ఏర్పాటుచేసిన చలివేంద్రాలను ప్రారంభించి పద్మశాలి భవన్ లో ఏర్పాటుచేసిన పోషణ్ పక్వాడ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలోని గర్భిణీ స్త్రీలు, బాలింతలు చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా ఐసీడీఎస్ విభాగం ఆధ్వర్యంలో 'పోషణ్ పక్వాడ' (పోషకాహార మాసోత్సవం) వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఏప్రిల్ 9 నుండి ఏప్రిల్ 23 వరకు 15 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. పోషకాహార లోపంపై మనం భుజించే ఆహారంలో పోషక విలువలు తగ్గడం, కల్తీ ఆహారం, జంక్ ఫుడ్ తినడం అలవాట్ల వలన చిన్న వయసులోనే పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారని,బయట దొరికే జంక్ ఫుడ్ పిల్లలకు విషంతో సమానమని, తల్లులు తమ చేతులతో వండిన నాణ్యమైన ఆహారాన్నే పిల్లలకు అందించాలని పిలుపునిచ్చారు.

గర్భిణీ స్త్రీలు బాలింతలు రోడ్ల మీద దొరికే ఆహారాన్ని కాకుండా, ఎలాంటి పురుగుమందులు లేని, కల్తీ లేని పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల తల్లితో పాటు బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. పిల్లలకు చిన్న వయసులోనే సెల్ ఫోన్లు అలవాటు చేయడం వల్ల వారి కంటి చూపు దెబ్బతినడమే కాకుండా, మానసిక వికాసం కుంటుపడుతుందని, తల్లిదండ్రులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. 'అమ్మ మాట - అంగన్వాడీ బాట' అనే నినాదంతో ప్రతి అంగన్వాడీ సెంటర్ ద్వారా నాణ్యమైన ఆహారం అందించడమే కాకుండా, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐసీడీఎస్ డిపార్ట్మెంట్ నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా నిత్యం వివిధ సుదూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్ కు వచ్చే ప్రజల దాహార్తి తీర్చడం కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద, ప్రయాణికుల దృష్ట్యా పాత బస్టాండ్ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న తరుణంలో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని వృద్ధులు చిన్నపిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అవసరం మేరకే నీటిని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్ పర్సన్ చింత నిప్పుల చంద్రకళ, వైస్ చైర్పర్సన్, డిడబ్ల్యుఓ ప్రేమలత, సిడిపిఓ శిరీష, స్థానిక కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంగ్లీ కేసులో మరో ట్విస్ట్



- నార్సింగ్ పీఎస్‌లో ఫిర్యాదు

హైదరాబాద్,ఏప్రిల్ 11(మనం,ప్రత్యేక ప్రతినిధి) : సింగర్ మంగ్లీపై చీటింగ్ కేసులో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. తనపై ఆరోపణలు చేస్తున్న న్యాయవాది సుబ్బారావుపై మంగ్లీ నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో మంగ్లీ తాను రూ.150 కోట్ల మేర మోసం చేశారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మార్చి 21న సుభా సియపోగు పేరుతో పరిచయం చేసుకున్న వ్యక్తి తనను బెదిరించాడని వెల్లడించారు. తన పట్ల అమర్యాదగా బెదిరించే ధోరణిలో మాట్లాడటంతో పాటు తనను కలవాలని ఒత్తిడి చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. అందుకు నిరాకరిస్తే అప్రతిష్ఠ పాలుచేస్తానని బెదిరించారని, మరో వ్యక్తితో కలిసి అవమానకర వ్యాఖ్యలు చేశారని పోలీసులకు తెలిపింది. తనకు ఎలాంటి సంబంధం లేని కరెన్సీ నోట్లు ఉన్న వీడియో చూపించి బెదిరించారని, సుభా సింగబోష్ తీరుపై నా కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారయని మంగ్లీ ఫిర్యాదులో పేర్కొంది. మంగ్లీ ఫిర్యాదుతో న్యాయవాది సుబ్బారావుపై బీఎన్ఎస్ సెక్షన్ల 79,351(3)కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

**పంజాగుట్టలో :**

ఇటీవల సింగర్ మంగ్లీపై పంజాగుట్ట పీఎస్‌లో కేసు నమోదైంది. మంగ్లీతో పాటు ఆమె సోదరులపైనా కేసు నమోదు చేసినట్లు న్యాయవాది సుబ్బారావు మీడియాకు వివరించారు. మంగ్లీ పేరుతో భారీ ఎత్తున మోసం చేశారని, ఈక్రమంలో రెండు నెలల క్రితం బాధితులు తనను కలిశారని వివరించాడు. ఈ వ్యవహారంలో మంగ్లీతో పాటు ఆమె సోదరుడు శివ,మధు ఉన్నట్లు తేలిందన్నారు. బాధితులు చెప్పిన వివరాల ప్రకారం మంగ్లీని కలిసే ప్రయత్నం చేయగా ఆమె దురుసుగా వ్యవహరించాడని, అంతేకాకుండా కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే పేరు చెప్పి నన్ను బెదిరించారని న్యాయవాది వాపోయాడు. ఇప్పటికే సింగర్ మంగ్లీపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని వివరించాడు. మంగ్లీ ఆమె సోదరులపై సివిల్ కేసు కూడా ఫైల్ చేస్తామన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలోనూ బాధితులు ఉన్నారని వ్యాఖ్యానించారు.

# పూలే 109వ జయంతి



భీమదేవరపల్లి ఏప్రిల్ 11 మనం న్యూస్ : మేజర్ గ్రామపంచాయతీ ముల్కనూర్ గ్రామంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం రోజున ప్రజా గ్రంథాలయం ప్రాంగణంలో మండల ఉత్సవ కమిటీ చైర్మన్ కొలుగూరి రాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ లక్ష్మారెడ్డి, భీమదేవరపల్లి జేఏసీ చైర్మన్ డ్యాగల సారయ్య ముఖ్యఅతిథిగా హాజరై పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు సమాన హక్కులు పొందడానికి సత్య సోధిక సమాజ్ ను ఏర్పాటు చేసి అన్ని మతాల, కులాల ప్రజలు సంఘంలో చేరాలని కోరారు. పూలే భార్య సావిత్రిబాయి పూలే భారత దేశంలో మహిళా విద్యకు మార్గదర్శకురాలు అనగారిన కుల ప్రజలకు విద్యను అందించేందుకు ప్రయత్నాలకు ప్రసిద్ధి చెందారు. వితంతువుల కోసం ఓ గృహాన్ని కూడా స్థాపించారు.

భారతదేశంలో బాలికల కోసం పాఠశాలను ప్రారంభించిన మొట్టమొదటి భారతీయ పూలే జంట అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అశోక్ ముఖర్జీ, డాక్టర్ ఏదిలాపురం తిరుపతి, మాట్ల వెంకటస్వామి, చె ప్యాల ప్రకాష్, మాడుగుల అశోక్, ఊస కోయిల ప్రకాష్, రేణిగుంట్ల బిక్షపతి, తూముల సంబంధం, కాంతారావు, అంబాల చక్రపాణి బొల్లంపల్లి సంపత్ కనకం నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# అనారోగ్యంతో మానసిక ఒత్తిడికి ఆత్మహత్య

భీమదేవరపల్లి, ఏప్రిల్ 11 మనం న్యూస్ : రత్నగిరి గ్రామంలో అనారోగ్యంతో మానసిక ఒత్తిడికి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. వంగర ఎస్సై దివ్య తెలిపిన వివరాల ప్రకారం రత్నగిరి గ్రామానికి చెందిన గుండెల్లీ వెంకటయ్య తరచూ అనారోగ్యంతో బాధపడుతూ మానసిక ఒత్తిడి తట్టుకోలేక తన వ్యవసాయ బావి వద్ద ఉరివేసుకొని మృతి చెందినట్లు మృతుడి భార్య రాజమ్మ తెలిపిన వివరాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడికి ఒక కొడుకు ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

# ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



రంగారెడ్డి ఏప్రిల్ 11 (మనం న్యూస్) : సంఘసంస్కర్త ,సామాజిక విప్లవకారుడు, బడుగు బలహీన వర్గాల కోసం జీవితాంతం పోరాడిన జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు సరూర్నగర్ డివిజన్ కాలనీ సంక్షేమ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సరూర్నగర్ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ ఆకుల అరవింద్ కుమార్ అధ్యక్షతన జరిగిన వేడుకలకు ఎల్బీనగర్ నియోజకవర్గం బి.యన్.రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్ గౌడ్ మాట్లాడుతూ సరూర్నగర్ డివిజన్, డాక్టర్స్ కాలనీ డివిజన్ ప్రజల సౌకర్యార్థం జ్యోతిరావు పూలే విగ్రహం వెనకాల ఉన్న ఖాళీ స్థలంలో' బీసీ భవన్ ' నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, ఎల్బీనగర్ కాంటెస్ట్ ఎమ్మెల్యే ముద్దగొని రామ్మోహన్ గౌడ్ ల సహకారంతో ప్రభుత్వ అధికారులతో చర్చించి బిసి భువన నిర్మాణానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు..

ఈ కార్యక్రమంలో సరూర్నగర్ డివిజన్ కాలనీ సంక్షేమ సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్,(బాలన్న) బబ్బురి ఆనంద్ కుమార్ గౌడ్, కందికంటి శ్రీధర్ గౌడ్, లోడీ నరసింహ గౌడ్, బాలా గౌడ్ ,భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

# స్మరించుకునే చోట పిడిగుద్దులు



- రణరంగంగా పూలే జయంతి వేడుకలు
- నిధుల గోల్‌మాల్ పై బీసీ సంఘాల ఘర్షణ
- అసహనం వ్యక్తం చేసిన పూలే అభిమానులు
- రవీంద్ర భారతిలో అనూహ్య ఘటన

హైదరాబాద్,ఏప్రిల్ 11(మనం న్యూస్) : మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు రవీంద్ర భారతి వేదికగా రణరంగంగా మారాయి. తెలంగాణ ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అధికారిక వేడుకల్లో బీసీ సంఘాల నేతలు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడికి దిగడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పూలే ఆశయాలను స్మరించుకోవాల్సిన చోట నాయకులు ఇలా పిడిగుద్దులు గుద్దుకోవడం చర్చనీయాంశమైంది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. జరుగుతున్న ప్రచారం ప్రకారం జయంతి వేడుకలకు కేటాయించిన నిధుల వినియోగంపై మొదటి నుంచీ బీసీ సంఘాల మధ్య భిన్నాభి ప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో నిధుల కేటాయింపులో, ఖర్చు చేయడంలో భారీగా అవినీతి జరిగిందని ఒక వర్గం ఆరోపించడంతో గొడవ మొదలైంది ముఖ్యంగా ఆర్. కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్,జేరుపోతుల నరేంద్ర వర్గాల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుందని ఈ క్రమంలో ఒకరిపై మరొకరు పిడిగుద్దులు గుద్దుకున్నారు.

**పూలే అభిమానుల అసహనం:**

దేశవ్యాప్తంగా అట్టడుగు వర్గాల చైతన్యం కోసం పోరాడిన జ్యోతిరావు పూలే జయంతి రోజే ఇలాంటి ఘటనలు జరగడంపై పూలే అభిమానులు, మేధావులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. బీసీ సంఘాల మధ్య సఖ్యత లేకపోవడం, ఐక్యతను పక్కనపెట్టి నిధుల కోసం, ఆధిపత్యం కోసం కొట్టుకోవడం బీసీ ఉద్యమాన్ని దెబ్బతీస్తుందని వారు ఆవేదన చెందుతున్నారు. పూలే లాంటి మహనీయుడికి ఇచ్చే గౌరవం ఇది కాదని హితవు పలికారు. అయితే పూలే జయంతి రోజు గందరగోళం ఇదేం కొత్త కాదు. మూడేళ్ల క్రితం ఇదే రవీంద్ర భారతిలో పూలే జయంతి వేడుకల్లో అవార్డులు, శాలువాల కోసం బీసీ నేతలు కీచులాడుకోగా, పూలే విగ్రహానికి పూల మాల వేసేందుకు నేతలు పోటీ పడగా వేదికపై ఏర్పాటు చేసిన విగ్రహానికి పూల మాల వేసేందుకు విగ్రహాన్ని అటు ఇటు లాగడం తీవ్ర విమర్శలపాలు చేసింది.

# జగిత్యాలలో బీఆర్ఎస్ బహిరంగ సభ

## జీవన్ రెడ్డి చేరికకు ముహూర్తం ఖరారు

హైదరాబాద్, మనం ప్రతినిధి : జగిత్యాల వేదికగా ఈనెల 20న సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ కోసం గులాబీ శ్రేణులు సమరోత్సాహంతో సిద్ధమవుతున్నాయి. సుమారు లక్ష మంది జనసమీకరణే లక్ష్యంగా పార్టీ నాయకత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ సభకు సంబంధించి అనువైన ప్రదేశాన్ని ఖరారు చేసేందుకు శనివారంనాడు పార్టీ ముఖ్య నేతలు కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. అయితే, ఈ బహిరంగ సభకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడటానికి ప్రధాన కారణం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో మాజీ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అధికారికంగా పార్టీలో చేరనున్నారు. గులాబీ పార్టీ అధికారం కోల్పోయాక కేసీఆర్ రానున్న సభ, మొదటి భారీ బహిరంగ సభ కావడంతో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఎస్ఎస్‌సిసిజిఎల్ ఫలితాల్లో ఐఏసిఈ ప్రభంజనం

- విద్యార్థుల విజయమే లక్ష్యంగా పనిచేస్తున్నాం
- చైర్మన్ వినయ్ కుమార్ రెడ్డి



రంగారెడ్డి ఏప్రిల్ 11 (మనం న్యూస్) : ఐ ఆర్ ఎఫ్ అస్త్రంతో ఎస్ ఎస్ సి సి జి ఎల్ - 2025 ఫలితాల్లో ఆల్ ఇండియా ర్యాంకులతో ఐ ఏ సి ఈ ప్రభంజనం సృష్టించి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో దేశంలోనే తిరుగులేని శక్తిగా ఎదిగింది అని ఐఏసీఈ చైర్మన్ వినయ్ కుమార్ రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్ లు హర్షం వ్యక్తం చేశారు. ర్యాంకులు సాధించిన వారిని ఘనంగా సన్మానించి కేకు కట్ చేసి సంబరాలు చేశారు. వారు మాట్లాడుతూ 2025 ఫలితాలలో మరోసారి చరిత్రను తిరగరాసిందని తెలిపారు. 2025 ఫలితాలలో ఆల్ ఇండియా 54, 59, 120, 287, 324, 349 వంటి టాప్ ర్యాంకులతో ప్రభంజనం సృష్టించి తెలుగు రాష్ట్రాల కీర్తిని జాతీయ స్థాయిలో చాటి చెప్పామని తెలిపారు. ఈ అద్భుత విజయాలు తరగతి గది శిక్షణ, వివరణతో కూడిన మాక్ టెస్టులతో పాటూ ఇంటెన్సివ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, హైదరాబాద్ ఐఆర్ఎఫ్ (ఐఏసి ఈ రిజలట్స్ ఫ్యాక్టరీ) ద్వారానే సాధ్యమయ్యాయి అని తెలిపారు. ఈ చారిత్రక విజయం పట్ల అత్యంత హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను ఘనంగా అభినందించారు విద్యార్థుల విజయమే లక్ష్యంగా కృషి చేస్తున్న అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# మహిళా సాధికారత కోసమే నియోజకవర్గాల పునర్విభజన

- దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా చూస్తాం
- కేంద్రమంత్రి కిషన్రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 11 : మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు నియోజకవర్గాల పునర్విభజన అనివార్యమని.. దీనిపై కాంగ్రెస్ పార్టీ అనవసర



రాద్ధాంతం చేస్తోందని కేంద్రమంత్రి కిషన్రెడ్డి ధ్వజమెత్తారు. దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్లను అడ్డుకున్న పార్టీలు, ఇప్పుడు భాజపా చిత్తశుద్ధితో అడుగులు వేస్తుంటే విమర్శించడం హాస్యాస్పదమన్నారు. హైదరాబాద్లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్హెచ్ఆర్డీ)లో హైదరాబాద్ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం శుక్రవారం నిర్వహించారు. అనంతరం మీడియాతో కిషన్రెడ్డి మాట్లాడుతూ.. 'గతంలో కాంగ్రెస్ హయాంలో అనేకసార్లు నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. ఇది రాజ్యాంగబద్ధమైన అవసరం. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు దక్కాలంటే నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సిందే. పునర్విభజన వల్ల ఉత్తరాది రాష్ట్రాలకు లాభం, దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందన్న ప్రచారం గర్హనీయం. ప్రధాని నరేంద్రమోదీ అన్ని రాష్ట్రాలను సమాన దృష్టితో చూస్తారు. దక్షిణాది రాష్ట్రాలకు ఒక్కశాతం కూడా నష్టం జరగకుండా చూస్తాం. పునర్విభజన కమిటీలో అన్ని పార్టీల సభ్యులకు చోటు ఉంటుంది. అక్కడ నిర్మాణాత్మక సూచనలు ఇవ్వవచ్చు' అని అన్నారు.

**హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచాలె..**

తెలంగాణకు గుండెకాయ వంటి హైదరాబాద్ నగర అభివృద్ధిపైనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని.. నగర బ్రాండ్ ఇమేజ్ను మరింత పెంచేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కేంద్రమంత్రి కిషన్రెడ్డి పిలుపునిచ్చారు. ఎంసీఆర్హెచ్ఆర్డీలో దిశా సమావేశం శుక్రవారం 8 గంటల పాటు సుదీర్ఘంగా సాగింది. ఆయనతో పాటు హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమీక్ష అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ.. 'కేంద్ర ప్రభుత్వ పథకాల నియమాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపితే మరిన్ని నిధులు తీసుకురావడానికి అవకాశం ఉంటుంది. హైదరాబాద్ జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పూర్తి సహకారం ఉంటుంది. రాష్ట్ర ఆదాయంలో 70 శాతం ఇక్కడి నుంచే లభిస్తున్నప్పటికీ.. నగరంలోని కొన్ని విభాగాలు నిధుల కొరతతో ఇబ్బంది పడటం బాధాకరం. నగరంలో అనేక ఐటీ కంపెనీలు, కార్పొరేట్ సంస్థలున్నాయి. లా ప్రణాళికలుండాలి'' అని కిషన్ రెడ్డి సూచించారు.



# రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే

తిరుపతి, ఏప్రిల్ 11,మనం న్యూస్ : 42వ డివిజన్ పరిధిలోని ద్వారకానగర్ లో 16 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం ఉదయం భూమి పూజ నిర్వహించారు. గుంతలమయమైన రోడ్డు స్థానంలో సీసీ రోడ్డుని నిర్మించనున్నారు. వీలైనంత త్వరగా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఆయన ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో రోడ్లను బాగు చేస్తున్నట్టు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. మట్టి రోడ్ అనేది లేకుండా సీసీ రోడ్ల నిర్మాణం కొనసాగిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఏళ్ల కిందటి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మించేందుకు ప్రభుత్వం రెడీగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఎంఈ తులసి కుమార్, గంగమ్మ గుడి పాలకమండలి చైర్మన్ మహేష్ యాదవ్, రాజా రెడ్డి, హరిశంకర్, హెచ్ డిసి సభ్యులు మునస్వామి, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ అనిల్ రాయల్, రూపేష్ రాయల్, రమణ రాయల్, రాజేష్ ఆచ్చారి, ఆళ్వార్ మురళీ , రమణ రెడ్డి, సురేంద్ర, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ రింగ్ రోడ్డు పనులపై ప్రభుత్వం చొరవ తీసుకోవాలె

## బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు



గజ్వేల్, ఏప్రిల్ 11 : గజ్వేల్ అభివృద్ధికి ఈ రింగ్ రోడ్డు కీలకమైనదని..నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తి చేసేలా సీఎం రేవంత్రెడ్డి చర్యలు తీసుకోవాలని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్రావు తెలిపారు. ఈరోజు గజ్వేల్ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న రింగ్ రోడ్డును రఘునందన్ రావు పరిశీలించారు. సీఎం రేవంత్రెడ్డి ఇటీవల నర్మెట్టకు వచ్చినప్పుడు అసంపూర్తిగా ఉన్నా గజ్వేల్ రింగ్ రోడ్డు వ్యవహారం గురించి వివరించానని తెలిపారు. సీఎం రేవంత్రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పుడు పరిష్కరిస్తామని సభ వేదికగా చెప్పారని ప్రస్తావించారు. రింగ్ రోడ్డు పూర్తి కావడానికి 151 మీటర్ల భూ సేకరణ పెండింగ్లో ఉందని వెల్లడించారు. ఒక రైతుని పిలిచి ఒప్పించడంలో జిల్లా రెవెన్యూ యంత్రాంగం అంతా కూడా నిర్లక్ష్యంగా ఉన్నారని మండిపడ్డారు. రింగ్ రోడ్డు వ్యవహారంలో సమస్య ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి తానే స్వయంగా వచ్చి పరిశీలించానని తెలిపారు. జిల్లా ఎంపీగా భూమి ఇచ్చే రైతుతో మాట్లాడి ఈ పనులపై చొరవ తీసుకుంటానని అన్నారు. ఒక వేళ రైతు భూమి ఇచ్చే వ్యవహారంలో అంగీకరించని పక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తానని ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.

## నా ప్రియమైన మిత్రులారా!

నా ప్రియమైన మిత్రులారా
మీరు త్రిశంకు స్వర్గంలోంచి
ఎప్పుడు బయటపడతారు?
అటు పైవాడికీ
ఇటు కిందివాడికీ కాకుండా
శూన్యంలో ఎంతకాలం వేలాడుతారు?
మీరు విశ్వామిత్రుడంతటి
శక్తియుక్తులు కలవారు
మీరు తల్చుకుంటే స్వర్గాన్నే
కిందికి దించగలరు
నరకాన్నీ చవి చూపించగలరు

ఎటొచ్చీ మీ శక్తి సామర్థ్యాలు మీకు కాక మరెవరికో
ఉపయోగపడటమే నన్ను కలవరపెడుతోంది

మీరు మేము మనమంతా కలలు కన్న రాజ్యం
మనకోసం ఎదురుచూస్తోంది
మనదైన రాజ్యంకోసమే
మీలాగే నేనూ కలలు కంటున్నాను

బలవంతమైన సర్పము మీదకి దాడి చేసే
ఒక చలిచీమల దండులా కదలండి
మనలో మనకి కొట్లాట పెట్టి
మనవాళ్ల మీదికి మనల్నే ఉసిగొల్పి
మనల్ని మనమే అంతం చేసుకునేలా
మొలిచిన కుట్రల్నిక భగ్నం చేద్దాం

ఒకడి మోచేతికింద  నీళ్లు తాగే దుస్థితి
మనకెందుకు?
మనం మన అస్తిత్వం ఉత్పత్తి సంబంధ కారకం
మన నెత్తురు మన చెమట చిందకుండా
ఈ నేలకు ఫలాలెక్కడివి?

సగానికి పైగా వున్న మన చెమటచుక్కల్ని
ఎవడి ఊడిగానికో తాకట్టు పెట్టటం
ఇంకెంత కాలం లేవండి!

ఒక్కొక్క కట్టె ఏకమై కట్టెల మోపులా మారండి
మన అస్తిత్వం ఒక మోకులా
మన ఆవేదన మనల్ని నడిపించే
ఇంధనం లా కదలండి

మన రాజ్యం మనం ఏలుకోవాలి
ఎవడో కూర్చున్న కుర్చీకి
నాలుగు కాళ్లుగానే ఎంతకాలం?
కుర్చీలో కూర్చోవటం మన వంతు కావాలి
నాలుగు దిక్కులొకటైతే ఎట్లా వుంటుందో
చూపిద్దాం
గడ్డిపోచలమే ఎంట్లుగా మారి
ఆధిపత్యపు ఏనుగును బంధిద్దాం

వెనకబడిన తరగతులను
ముందు తరగతులుగా నిర్మాణం చేద్దాం
రాజ్యం కుంభ స్థలాన్ని కొట్టే
సత్తాగల వీరత్వం మన ఐక్యతలోనే వుంది

కదలండి మిత్రులారా త్రిశంకు స్వర్గాన్ని వీడి
మనదైన భూమినీ నేలనీ స్వర్గతుల్యం
చేసుకుందాం
మన రాజ్యానికి మనమే రాజులం రారాజులం
బానిసల రాజ్యం నుంచి
రాజులుగా రూపాంతరం చెందుదాం

నా ప్రియమైన మిత్రులారా!  అదిగో ఆకాశం నేలా
మనకోసం ఎదురుచూస్తోంది
నియంతలు అస్తమించే రేఖ దగ్గర
బహుజన అస్తిత్వపు ప్రభలతోటి
మన కలల సామ్రాజ్యం  పురుడుపోసుకుంటోంది
మన రాజ్యం తూర్పున దండు కడుతూ
కొత్త పొద్దయి పొడుస్తోంది!

**-చిత్తలూరి**
9133832246

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

ఈ పేపర్ కోసం https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి

– ఎడిటర్

# విలువలు లేని విద్య నిరర్థకం



మనిషిని మానవతా మూర్తిగా తీర్చిదిద్దేవి విలువలు.ఆ విలువల బీజాలను పాఠశాల స్థాయిలోనే పిల్లల మనస్సుల్లో బలంగా నాటగలిగితే వారిలో మానవత్వం వికసించి శాంతి, సహనం, నీతి, నిజాయితీ,కరుణ, పరస్పర గౌరవం, మానవీయత వంటి ఉత్తమ విలువల పరిమళాలు వ్యాపిస్తాయి. తద్వారా వారు విలువలతో కూడిన భావి సమాజ నిర్మాతలుగా ఆవిష్కరించబడతారు. విలువలు లేని విద్య స్పందన లేని హృదయం వంటిది అన్న మహాత్మాగాంధీ మాటలు విలువలతో కూడిన విద్య యొక్క ప్రాముఖ్యతను వివరిస్తాయి.

ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థులు ఉపాధ్యాయునిపై దాడిచేయడం శోచనీయం. ఇటువంటి సంఘటనలు తరచు జరుగుతూనే ఉన్నాయి. ఈ పరిస్థితికి కారణం ఎవరు? విద్యార్థులు అలా మారడానికి కారణం తల్లిదండ్రులా? ఉపాధ్యాయులా? ప్రస్తుత విద్యా విధానమా? అనే విషయంపై చర్చించే ముందు అసలు విద్యావిధానంలో విలువలతో కూడిన విద్య యొక్క ప్రాముఖ్యతను గూర్చి చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ప్రాచీన భారతీయ విద్యావ్యవస్థ శాస్త్ర పరిజ్ఞానంతో పాటు విలువలకు పెద్దపీట వేసింది. వ్యక్తిత్వ వికాసం, నిస్వార్థ జీవితం, నైతికత వంటి వాటిని పెంపొందించడమే లక్ష్యంగా విద్యను అందించింది. తద్వారా విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి బాటలు వేసింది. ఆ ప్రక్రియలో బోధించిన ఉపాధ్యాయులను గురుబ్రహ్మలంటూ గౌరవించి వారిని ఉన్నత స్థానంలో నిలిపింది.

కాలం మారుతూ వచ్చింది దానితోపాటు విద్యాలక్ష్యాలు మారుతూ వచ్చాయి. ఉపాధ్యాయుల స్థానం కూడా మారుతూ వచ్చింది. ప్రస్తుత విద్యావిధానంలో శాస్త్ర సాంకేతిక విద్యలకు ప్రాధాన్యం పెరిగి అవి ఉపాధికల్పనా విద్యలుగా రూపొందాయి. ఇతర విద్యలు అప్రాధాన్య విద్యలు విద్యలయ్యాయి. కాలంతో పాటు మార్పు సహజమే అయితే ఆ మార్పు శిలను శిల్పంగా మార్చేదిగా ఉండాలి కానీ, శిల్పాన్ని శిలగా మార్చేదిగా ఉండకూడదు. విద్యార్జన కేవలం జీవనోపాధి కొరకే అని పాలకుల దగ్గరి నుండి సామాన్య ప్రజల వరకు అందరికీ ఒకే అభిప్రాయం ఏర్పడింది. ఎక్కువ మార్కులు, ర్యాంకులు తెచ్చుకున్న వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉండి సంపాదన బాగా ఉంటుందన్న భావన సమాజమంతా నిండిపోయింది. దానివల్ల విద్యాలక్ష్యాలు పూర్తిగా మారిపోయాయి. విద్య వ్యాపార వస్తువుగా మారిపోయింది. విద్యాసంస్థల మధ్య, విద్యార్థుల మధ్య, తల్లిదండ్రుల మధ్య అనారోగ్యకర పోటీతత్వం పెరిగిపోయింది.




మార్కులు, ర్యాంకుల సాధనకు ప్రాధాన్యత పెరిగి విలువలకు తిలోదకాలు ఇవ్వబడ్డాయి. ఈ క్రమంలో గురుబ్రహ్మలుగా ఉన్నత గౌరవాన్ని పొందిన ఉపాధ్యాయులు యంత్రాలుగా మారిపోయి మార్కులు, ర్యాంకులు సాధించే విద్యార్థులను తయారుచేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఆ పరిస్థితుల్లో టీచర్లు ఎన్నో అవమానాలు, చీత్కారాలు, బెదిరింపులు ఎదుర్కొంటున్నారు. విలువలకు కనీస విలువ ఇవ్వలేని విద్య ఒక డాక్టరును తయారు చేయవచ్చునేమో కానీ రోగులపై చూపించాల్సిన కనీస మానవత్వాన్ని పెంపొందించలేకపోతుంది. అటువంటి విద్యావ్యవస్థ నుండి వచ్చిన టీచరు, డాక్టరు, లాయరు, ఇంజనీరు, అధికారి మొదలైన ఏ వృత్తివారైనా చివరకు రాజకీయ నాయకులుగా అవతరించిన వారైనా కనీస విలువలు మరచి ప్రవర్తించడం, సంపాదనలకై అడ్డదారులు తొక్కడం, సభ్య సమాజం తలదించుకునే పనులు చేయడం చూస్తూనే ఉన్నాం. వీరందరూ పెద్ద చదువులు చదివినా విలువలు మరచిన విద్యావేత్తలుగా మిగిలారు.

మన విద్యా ప్రణాళికల్లో విలువల ప్రస్తావన ఉంటుంది. మన పాఠ్యపుస్తకాల్లో వాటిని పొందుపరుస్తారు. విలువలతో కూడిన విద్యను అందిస్తామని ప్రచారం చేస్తారు. కానీ అది అంతవరకే పరిమితమై పోయింది. క్షేత్రస్థాయిలో విలువల కంటే పిల్లల మార్కులు, గ్రేడులు, జి.పి.ఏ పాయింట్లు, ర్యాంకుల పైనే అధికారులు, తల్లిదండ్రులు, పాలకులు దృష్టిపెడతారు. వాటికై ప్రణాళికలు రచించి అమలుపరుస్తారు. ఫలితాలు, మార్కులు,గ్రేడుల సాధనను టార్గెటు పెట్టి అదే విద్యాలక్ష్యంగా చాటుతున్నారు. ఈ క్రమంలో మన విద్యలో విలువలు అనేవి నేతి బీరకాయలో నెయ్యి చందంగా మిగిలిపోయాయి. ఉపాధ్యాయుల గౌరవం కూడా నానాటికీ తీసికట్టు నాగంబొట్లు అన్న చందంగా తయారైంది. పిల్లల్లో విలువలు పెంచడం కంటే వారిని పరీక్షకు సిద్ధపరిచే ప్రక్రియలకు టీచర్లను పరిమితం చేస్తున్నారు. టీచర్లపై అధికారులు ఆదేశించు, నియంత్రించు (కమాండ్ కంట్రోలు) పద్ధతిలో వ్యవహరిస్తున్నారు.

ప్రస్తుత ఇఇడ విధానంలో మార్కులు, ర్యాంకులు లేని జి.పి.ఏ పాయింట్లు గ్రేడింగుల విధానం తెచ్చామని అధికారులు ఆర్భాటంగా ప్రకటించినా అందులో ఉన్నది మాత్రం శూన్యం. అప్పుడు మార్కులు, ర్యాంకులు అయితే ప్రస్తుతం పాయింట్లు, గ్రేడింగులు కొరకు చదువు అన్నట్లు సాగుతోంది. ఈ దశలో టీచర్లపై తీవ్ర వత్తిడిలో పనిచేస్తున్నారు. ఫలితాల విషయమై టార్గెట్లు నిర్ణయించడం, చర్యలు తీసుకుంటామని బెదిరించడం ఏ విలువలు పెంచడానికికో ఏలినవారే చెప్పాలి.

విలువలు లేని విద్యాభ్యాసం ద్వారా విద్యాధికుడు అనిపించుకోవచ్చును. నీతి నిజాయితీలను కలిగి మానవత్వం ఉన్న మనిషిగా తయారవడం కష్టం. విలువలు లోపించిన సమాజంలో అవినీతి, అక్రమం, అన్యాయాల విశృంఖలత్వమే కనిపిస్తుంది. వావి వరుసలు లేని అరాచకత్వం కనిపిస్తుంది. కొంతమంది టీచర్లు కూడా తప్పుదారి పడుతున్నట్లు అక్కడక్కడా కనిపించడానికి కారణం విలువలు లేని ఉపాధ్యాయ విద్య. విలువలు నేర్పని శిక్షణలు, విలువలు లేని విద్య నిరుద్యోగులను ఉద్యోగులుగా చేయగలుగుతుందేమో కానీ మానవత్వం పరిమళించే మనుషులుగా తయారుచేయదు.

విద్యలో విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పిల్లల్లో మార్కులు, ర్యాంకులు, గ్రేడింగ్లు, పాయింట్ల సాధన కంటే సామాజిక, నైతిక విలువలు పెంపొందించడమే విద్యాలక్ష్యం కావాలి. ఆ విలువల ద్వారా పిల్లల్లో సానుకూల దృక్పథాలు, సామాజిక వైఖరులు, ఉత్తమ వ్యక్తిత్వం అలవడేటట్లు చేయాలి. అవసరమైతే ఇంటర్నల్ మార్కుల్లో విలువల విద్యకు మార్కులు కేటాయించాలి.అధికశాతం మార్కులు, ర్యాంకులు, గ్రేడింగులు, జి.పి.ఏ పాయింట్ల సాధనకు వేలు,లక్షలు ఖర్చుపెట్టి విలువ అయిన విద్య నేర్పాలా ? విలువల తో కూడిన విద్య నేర్పాలా ? అనేది పాలకులు, అధికారులు, తల్లిదండ్రులు ఆలోచించాలి. అలా ఆలోచించిన నాడే విద్యార్థుల్లో మార్పు వస్తుంది. తల్లిదండ్రులను, పెద్దలను ఉపాధ్యాయులను గౌరవించడం నేర్చుకుంటారు.

**- సుధాకర్.ఏ.వి**
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ
9000674747

# అంతరిక్ష రంగంలో భారత్ ముందంజ

అంతరిక్ష విజ్ఞాన రంగంలో భారత్ సాధిస్తున్న ప్రగతి కేవలం ప్రయోగాలకు పరిమితం కాకుండా, ప్రపంచ యవనికపై ఒక అగ్రగామి శక్తిగా మన దేశాన్ని నిలబెడుతోంది. ఏప్రిల్ 12 'అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవం' సందర్భంగా, మానవాళి సాధించిన అద్భుతాలను గుర్తుచేసుకుంటూనే, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ISRO) ప్రయాణాన్ని, దాని వెనుక ఉన్న కృషిని విశ్లేషించుకోవడం సముచితం. 1961 ఏప్రిల్ 12న సోవియట్ యూనియన్‌కు చెందిన యూరీ గగారిన్ 'వోస్టోక్-1' నౌకలో భూకక్ష్యలోకి ప్రవేశించి, అంతరిక్షంలోకి వెళ్ళిన తొలి మానవుడిగా చరిత్ర సృష్టించారు. ఈ చారిత్రాత్మక ఘట్టానికి 50 ఏళ్లు నిండిన సందర్భంగా, 2011లో ఐక్యరాజ్య సమితి ఏప్రిల్ 12ను అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవంగా ప్రకటించింది. ఈ నేపథ్యం ప్రపంచానికి ఒక ఎత్తయితే, భారత్ సున్నా నుండి శిఖరానికి చేరుకున్న వైనం మరో అద్భుత చరిత్ర.

భారత అంతరిక్ష పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ దూరదృష్టి నేడు భారత్ను అంతరిక్ష దిగ్గజంగా మార్చింది. 1957లో రష్యా 'స్పుత్నిక్' ప్రయోగించినప్పుడు, అంతరిక్ష పరిజ్ఞానం కేవలం విలాసం కాదని, దేశాభివృద్ధికి అదొక అవసరమని సారాభాయ్ గుర్తించారు. హోమీ బాభా సహకారంతో 1962లో 'ఇన్కోస్పార్' (INCOSPAR) ఏర్పాటు కావడం, కేరళలోని తుంబాలో ఒక చర్చి ప్రాంగణంలో రాకెట్ ప్రయోగాలు మొదలు పెట్టడం భారత అంతరిక్ష చరిత్రలో అత్యంత స్ఫూర్తిదాయకమైన ఘట్టాలు. సైకిళ్లపై రాకెట్ విడిభాగాలను, ఎడ్ల బండ్లపై ఉపగ్రహాలను తీసుకెళ్లిన రోజుల నుండి నేడు ప్రపంచ దేశాల ఉపగ్రహాలను అతి తక్కువ ఖర్చుతో కక్ష్యలోకి చేర్చే స్థాయికి మనం ఎదిగాం. 1975 ఏప్రిల్ 19న మన తొలి ఉపగ్రహం 'ఆర్యభట్ట'ను సోవియట్ యూనియన్ సహాయంతో ప్రయోగించిన భారత్, నేడు తన స్వంత వాహక నౌకలైన PSLV, GSLV లతో ప్రపంచ రికార్డులను సృష్టిస్తోంది.

భారత అంతరిక్ష రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన వ్యవస్థలలో 'ఇన్శాట్' (INSAT) శ్రేణి ప్రధానమైనది. 1983లో ప్రారంభమైన ఈ వ్యవస్థ ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోనే అతిపెద్ద సమాచార ఉపగ్రహ వ్యవస్థగా ఎదిగింది. ప్రస్తుతం వందలాది ట్రాన్స్‌పాండర్ల సహాయంతో టెలివిజన్ ప్రసారాలు, రేడియో నెట్‌వర్క్, వాతావరణ హెచ్చరికలు, విపత్తు నిర్వహణ వంటి సేవలను అందిస్తోంది. హస్సన్ (కర్ణాటక), భోపాల్ (మధ్యప్రదేశ్) కేంద్రాల నుండి ఈ ఉపగ్రహాలను నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. అంతరిక్ష ప్రయోగాలపై పెట్టే ఖర్చు వృథా అని భావించే వారికి ఇస్రో సాధించిన విజయాలే సమాధానం. ఉదాహరణకు, అమెరికా వంటి దేశాలు అంగారక యాత్ర (క్షై) కోసం వేల కోట్లు ఖర్చు చేస్తే, భారత్ కేవలం 450 కోట్ల రూపాయలతో (సుమారు 74 మిలియన్ డాలర్లు), హాలీవుడ్ సినిమా నిర్మాణ వ్యయం కంటే తక్కువతో మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది.




ప్రస్తుతం భారత్ వద్ద మూడు ప్రధాన ప్రయోగ కేంద్రాలు ఉన్నాయి. తుంబా (కేరళ)లో రాకెట్ విడిభాగాల తయారీ మరియు వాతావరణ రాకెట్ల ప్రయోగాలు జరుగుతుంటే, శ్రీహరికోట (ఆంధ్రప్రదేశ్) లోని 'సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం' (SHAR) ప్రధాన ప్రయోగ వేదికగా నిలుస్తోంది. ఇక్కడ ఉన్న రెండు లాంచ్ ప్యాడ్ల ద్వారా ఏడాదికి పలు ఉపగ్రహాలను ప్రయోగించే సామర్థ్యం మనకుంది. ఒరిస్సాలోని బలేశ్వర్ కేంద్రం ప్రధానంగా క్షిపణి పరీక్షలకు వేదికగా ఉంది. ఇస్రో చరిత్రలో మైలురాళ్లుగా నిలిచిన సంఘటనలు అనేకం. 2017లో పి.ఎస్.ఎల్.వి-సి37 ద్వారా ఒకేసారి 104 ఉపగ్రహాలను ప్రయోగించి భారత్ ప్రపంచ రికార్డు సృష్టించింది. ఇందులో 96 ఉపగ్రహాలు అమెరికావే కావడం విశేషం. ఇది భారత వాహక నౌకల విశ్వసనీయతకు మరియు తక్కువ వ్యయానికి నిదర్శనం.

ఇటీవలి కాలంలో అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పెను మార్పులకు నాంది పలికింది. 'ఇన్-స్పేస్' (IN&SPACe) వంటి సంస్థల ద్వారా ప్రైవేటు స్టార్టప్లు అంతరిక్ష రంగంలోకి అడుగుపెట్టాయి. దీనివల్ల ఆర్థిక లావాదేవీలు పెరగడమే కాకుండా, సాంకేతికతలో వినూత్న ఆవిష్కరణలు చోటు చేసుకుంటున్నాయి. గత దశాబ్ద కాలంలో భారత్ 34 దేశాలకు చెందిన సుమారు 393 ఉపగ్రహాలను వాణిజ్యపరంగా ప్రయోగించి భారీ విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించింది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్ వంటి అగ్రదేశాలు సైతం నేడు ఇస్రో సేవలను వినియోగించుకుంటున్నాయంటే మన ప్రాముఖ్యత ఎంత పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. 2023వ సంవత్సరం భారత అంతరిక్ష చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గది. 'చంద్రయాన్-3' మిషన్ ద్వారా చంద్రుని దక్షిణ ధ్రువంపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన మొదటి దేశంగా భారత్ అవతరించింది. దీని వెనుక శాస్త్రవేత్తల దశాబ్దాల కఠోర శ్రమ దాగి ఉంది. కేవలం చంద్రుడికే పరిమితం కాకుండా, సూర్యుడిపై అధ్యయనం కోసం 'ఆదిత్య-ఎల్1'ను విజయవంతంగా ప్రయోగించాం. రానున్న రోజుల్లో 'గగన్ యాన్' ద్వారా భారతీయులను అంతరిక్షంలోకి పంపే బృహత్తర కార్యక్రమం సిద్ధమవుతోంది. ఇది విజయవంతమైతే, అమెరికా, రష్యా, చైనా తర్వాత సొంతంగా మానవ అంతరిక్ష యాత్ర చేపట్టిన నాలుగో దేశంగా భారత్ నిలుస్తుంది. అంతరిక్షం అనేది కేవలం నక్షత్రాల అన్వేషణ మాత్రమే కాదు, అది దేశ భద్రత, ఆర్థికాభివృద్ధి మరియు సాంకేతిక సార్వభౌమాధికారానికి నిదర్శనం. విక్రమ్ సారాభాయ్ వేసిన పునాది, అబ్దుల్‌కలాం అందించిన క్షిపణి పరిజ్ఞానం, సతీష్ ధావన్ నేతృత్వంలో జరిగిన అభివృద్ధి నేడు సోమనాథ్ వంటి నాయకత్వంలో శిఖరాగ్రానికి చేరుతోంది. అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవం జరుపుకుంటున్న ఈ తరుణంలో, భారత్ తనదైన ముద్రను విశ్వవ్యాప్తంగా వేస్తూ, 'వసుధైక కుటుంబకం' స్ఫూర్తితో అంతరిక్ష ఫలాలను సామాన్య మానవుడికి సైతం చేరువ చేస్తోంది. రాబోయే కాలంలో అంతరిక్ష పర్యాటకం, అంతరిక్ష స్టేషన్ నిర్మాణంవంటి రంగాల్లో భారత్ అగ్రగామిగా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది.

ఏప్రిల్ 12...అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవం

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# చీకటి జీవితాలలో కొత్త వెలుగు జ్యోతిబా

ఆధునిక భారతదేశంలో సామాజిక ఆర్థిక రాజకీయ దోపిడీకి గురవుతున్న వారి కోసం భారతీయ స్త్రీల కోసం పోరాడిన వారిలో ప్రథముడు. విద్యనే వికాసమన్న తొలి సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే. ఆయన 11 ఏప్రిల్ 1827న మహారాష్ట్ర పునా పట్టణంలో జన్మించారు. సామాజిక పీడనలకు వ్యతిరేకంగా పూనా పట్టణంలో జ్యోతిబా తన సామాజిక ఉద్యమాన్ని ప్రారంభించాడు. భారతదేశంలో కార్మిక ఉద్యమం జ్యోతిబా తోనే మొదలైంది. మతసామరస్యం మానవ హక్కుల కోసం నిరంతరం పోరాడి జీవితాంతం అంకితమైన జ్యోతిబా పూర్తి పేరు జ్యోతిరావు గోవిందరావు పూలే. థామస్ పెయిన్ రచించిన 'రైట్స్ ఆఫ్ మాన్' మానవ హక్కుల పుస్తకంతో ప్రభావితమై హక్కుల కోసం విప్లవించాడు. 1848లో జ్యోతిబా బ్రాహ్మణ మిత్రుని వివాహ ఊరేగింపులో పాల్గొన్నాడు.


'మాలి' కులంలో పుట్టిన శూద్రుడు మాతో సమానంగా నడుస్తాడా అంటూ బ్రాహ్మణు లు అవమానించి బారాత్ నుండి బయటకి తరిమేశారు ఆ అవమానం జ్యోతిబాను తీవ్ర క్షోభకు గురి చేసింది. అస్పృశ్యత పేరు మీద కొనసాగుతున్న అంటరానితనంపై సామాజిక తిరుగుబాటు చేస్తూ సమత కోసం, న్యాయం కోసం ఉద్యమించాడు.

ఆధునిక భారతదేశ చరిత్రలో మానవ సమాజానికి విద్య ప్రాముఖ్యతను తెలియజేస్తూ1848 లో మరఠ్వాడాలో నిమ్న కులాల బాలికల కోసం మొట్టమొదటి పాఠశాల ప్రారంభించాడు. తన భార్య సావిత్రిబాయికి తానే స్వయంగా చదువు బోధించి తాను స్థాపించిన పాఠశాలలోనే తొలి ఉపాధ్యాయురాలిని చేసి స్త్రీ విద్యకు తొలి అక్షర కిరణమ య్యాడు. సావిత్రిబాయి మొట్టమొదటి భారత ఉపాధ్యాయుని.

నాటి ఫీష్వాలు సావిత్రిబాయి మీద పేడ నీళ్లు పోసి అవమానించినా సావిత్రిబాయి తొణకలేదు బెదరలేదు పేద వర్గాలకు అక్షరాలను బోధించడం మానలేదు. సంచిలో మరొక చీరను పెట్టుకొని పాఠాలు చెప్పి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేటప్పుడు మళ్లీ పెడనీళ్లు చల్లే సమాజాన్ని ఎదిరించి నిలబడ్డ ధీశాలి.

పూలే దంపతులు విద్యకు మాత్రమే పరిమితం కాలేదు. భ్రూణ హత్యలను నివారిం చడానికి వితంతువుల సంక్షేమానికి సావిత్రిబాయి జ్యోతిబా లు 1863లో పూనేలో వితంతు శరణాలయాన్ని స్థాపించారు.

జ్యోతిరావు పూలే దంపతులకు సంతానం లేకపోవడంతో, ఒక బ్రాహ్మణ వితంతువు (కాశీబాయి)కు పుట్టిన బిడ్డను 1874లో దత్తత తీసుకొని యశ్వంత్ రావు అని పేరు పెట్టుకున్నారు. యశ్వంత్ రావు వైద్య విద్యను అభ్యసించి బ్రిటిష్ సైన్యంలో సివిల్ సర్జన్‌గా పనిచేశారు. మహారాష్ట్రలో ప్లేగు వ్యాధి ప్రబలినప్పుడు, ఆయన తన తల్లి సావిత్రీబాయి పూలేతో కలిసి పూణే శివార్లలో ఒక ఆసుపత్రి ప్రారంభించి రోగులకు సేవలు అందించేవారు. 1873 జూన్ 1న మరాఠీ భాషలో రాసిన 'గులాంగిరి' పుస్తకం చారిత్రాత్మక గ్రంథం. భారతీయ కుల వ్యవస్థలోని అణచివేతను మనువాద శాస్త్రాలల్లోని బానిసత్వాన్ని తీవ్రంగా విమర్శించిన రచన.



1873 సెప్టెంబర్ 24 న తన సహచరులతో 'సత్యశోధక్ సమాజ్'సంస్థను ఏర్పాటు చేశాడు. మూఢనమ్మకాలు వెట్టిచాకిరికీ వ్యతిరేకంగా అణగారిన వర్గాలకు, మహిళలకు విద్య మరియు సామాజిక హక్కులు కల్పించడం, కుల వివక్షకు వ్యతిరేకంగా, స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వాలు సమాన అవకాశాలకై పోరాడటం. బాల్యవివాహాలను వ్యతి రేకిస్తూ, విధవా పునర్వివాహాలను, సమానత్వాన్ని సామాజిక సాంఘిక అసమానతలపై ఈసంస్థ నిరంతరం పోరాడుతుండేది. భారతీయ సాంస్కృతిక పునర్జీవనంలో సత్యశోధక్ సమాజ్ పాత్ర గణనీయమైనది. 1876- 82 సంవత్సరాల మధ్య జ్యోతిబా పూనా మున్సిపల్ కౌన్సిల్ సభ్యునిగా పని చేశారు. బ్రిటిష్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పూనా ప్రాంతంలో యాభై రెండు ఉచిత భోజన కేంద్రాలను ఏర్పాటు చేయించారు. వీటిలో చరిత్రలో ప్రముఖంగా నిలిచింది 1877లో విక్టోరియా శరణాలయం. 1879లో దీనబంధు పత్రిక స్థాపించి శూద్రుల తరపున ప్రధాన గొంతుకలై నిలిచారు. ఈ పత్రికకు ఎడిటర్ కృష్ణాజీ రావు భాలేలేకర్ సంపాదకత్వం నిర్వహించారు.

1888 మే 11న పూనాలో జ్యోతిబాకు పౌర సన్మానం ఏర్పాటు చేసి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి జోతిబాకు 'మహాత్మా' అనే బిరుదు ఇచ్చారు. ఆ సన్మాన సభకు హాజరు కాలేకపోయినా బరోడా మహారాజు శాయాజీ రావు గైక్వాడ్ తాను పంపిన సందేశంలో జ్యోతిబాను 'అమెరికాలోని నీగ్రో బానిసల విద్య కోసం శ్రమించిన 'బూకర్ టీ వాషింగ్టన్' తో పోల్చారు.

పూలే స్వయంగా కవి రచయితగా గులాంగిరి, సేద్యకారుడు, చర్నాకోల, తృతీయ రత్న,శివాజీ భోంస్లే పావడాతో పాటుగా 1889 'సార్వజనిక సత్యధర్మ' పుస్తకాన్ని రచించారు. అంత్య దశలో కూడ శూద్ర అతి శూద్ర వర్ణాల విద్య కోసం శ్రమిస్తూనే 1889 నవంబర్ 28న జ్యోతిబా తుదిశ్వాస విడిచాడు.

అవిద్య వలన కలిగే విపత్తు జ్యోతిబా మాటల్లో ... 'అవిద్య అజ్ఞానానికి దారితీస్తుంది. అజ్ఞానం అనైతికతకు దారితీస్తుంది. అనైతికత వలన అభివృద్ధి నశిస్తుంది. అభివృద్ధి లేకపోతే ధనము ఉండదు. ధనము లేకపోవడం వలన శూద్ర జాతులు పీడనకు గురిచేయ బడుతున్నాయి' అని స్పష్టంగా చెప్పాడు. జ్యోతిబాపూలే ద్విశతజయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించి ప్రభుత్వమే జయంతి వర్ధంతులను నిర్వహిచాలి. యూనివర్శిటీ, తెలుగు అకాడమీ కానీ పూలే సమగ్ర రచనలను తెలుగులో సంపుటాలుగా అందించాలి.

మహాత్మా జ్యోతిబా పూలేను ఆదర్శంగా తీసుకోవడం అంటే ఆయన ఆశయాలను మన జీవితంలో ఆచరించడమే. దేశంలో విద్యా వికాసానికి పూలే పేరున యూనివర్శిటీ పెట్టాలి. పూలే సాహిత్యాన్ని పూలే జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలి. విద్యకు అధిక ప్రాధాన్య తనిచ్చిన పూలే విగ్రహాలను ప్రతి కళాశాలలో ఏర్పాటు చేయాలి. పూలే ఆశయాలను నేటి యువతి యువకులు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలి. కుల వివక్షకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం అనన్యసామాన్యం. మనుషులందరూ సమానమే అనే భావనను కలిగి ఉండటం, వివక్ష లేని సమాజం కోసం పని చేయడం ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి.

**- వనపట్ల సుబ్బయ్య**
9492765358

# మత్తు పదార్థాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం

- **డి-అడిక్షన్ సెంటర్ సందర్శించిన ఎస్పీ, ఎమ్మెల్యే**



జగిత్యాల ఏప్రిల్ 11(మనం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో మత్తు పదార్థాల వినియోగాన్ని నిర్మూలించేందుకు, వ్యసనానికి గురైన వ్యక్తులను తిరిగి సాధారణ జీవన విధానంలోకి తీసుకురావడానికి హెల్త్ మరియు పోలీస్ శాఖలు సంయుక్తంగా చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఈరోజు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న డి-అడిక్షన్ సెంటర్ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ సమస్య ఒక పెద్ద సవాలుగా మారిందని, దీన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా ఈగల్ టీంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందం ద్వారా డ్రగ్స్ నియంత్రణ, అవగాహన కార్యక్రమాలు, పర్యవేక్షణ చర్యలు మరింత బలోపేతం చేయబడుతున్నాయని వివరించారు.మత్తు పదార్థాల వినియోగం వలన ఆరోగ్య సమస్యలు మాత్రమే కాకుండా కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, నేరాలకు దారితీసే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఎస్పీ గారు పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలన అనేది కేవలం లా అండ్ ఆర్డర్ సమస్య మాత్రమే కాకుండా ఇది ఒక సామాజిక సమస్య, ప్రజా ఆరోగ్య సమస్య కూడా అని స్పష్టం చేశారు. కావున దీన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించాలంటే అన్ని వర్గాల ప్రజలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ముఖ్యంగా యువత ఈ వ్యసనాలకు గురికాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు వ్యక్తి జీవితాన్ని పూర్తిగా దెబ్బతీసే ప్రమాదకరమైన అలవాటు అని పేర్కొంటూ, డి-అడిక్షన్ సెంటర్ అనేది వ్యసనానికి గురైన వారికి ఒక రెండవ అవకాశమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు.అదేవిధంగా జిల్లాలో మత్తు పదార్థాల సరఫరా, రవాణా, విక్రయాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని, ఎవరైనా ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు ఎక్కడైనా మత్తు పదార్థాల వినియోగం లేదా విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత దేశానికి అతి పెద్ద సంపద అని, యువత సన్మార్గంలో నడవడం చాలా అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా మంచి మార్గంలో నడుచుకుంటూ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు.జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు ప్రత్యేక వార్డులను డి-అడిక్షన్ సెంటర్గా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సెంటర్లో ఎంత సీరియస్ కేసులైనా సమర్థవంతంగా చికిత్స అందించే నిపుణ వైద్యులు అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు.

చికిత్సతో పాటు అవసరమైన మందులు, సేవలు ప్రభుత్వం తరపున ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.యువత బాగుంటేనే దేశం బాగుంటుందని, అందువల్ల యువత మత్తు పదార్థాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పాఠశాల, కళాశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేసి డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల నిర్మూలన మరియు వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎస్పీ మరియు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్లు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యులు, పోలీస్ అదికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిబా పూలే ఆశయాలను, ఆలోచనలను ఆచరించాలి

- **సామాజిక అసమానతనలు తొలగించడమే పూలే ఆశయం**
- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**





పెద్దపల్లి, ఏప్రిల్ 11 (మనం ప్రతినిధి): మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలను, ఆలోచనలను మనమందరం ఆచరించాలి అని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ మహాత్మ జ్యోతిబా పూలే 200వ జయంతి వేడుకల్లో ₹జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అదనపు కలెక్టర్ డి.వేణు లతో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మన దేశం అభివృద్ధి చెందాలంటే మహాత్మ జ్యోతిబా పూలే ఆశయాలను ,ఆలోచనలు మనమందరం ఆచరిస్తూ అమలు చేస్తూ దేశ అభివృద్ధిని సాధించవచ్చు అని, సమాజంలోని అసమాన తలను తొలగించవచ్చని కలెక్టర్ అన్నారు.సామాజిక సమానత్వం సాధన కోసం జ్యోతి బా పూలే అప్పటి సమాజంలో పోరాటం చేశారని, ఆ స్ఫూర్తి మనమంతా తీసుకోవాలని, సామాజిక అసమానతలు దూరమయ్యేందుకు మన వంతు కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. బాలికల విద్యపై పూలే దంపతులు చిత్తశుద్ధితో పనిచేశారని, స్త్రీలు విద్యా వంతులు కావాలని ఆకాంక్షించారని తెలిపారు. అంతకంటే ముందు పెద్దపల్లి లోని మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని లు కూచిపూడి నృత్యం ప్రదర్శన చేసి అలరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి జే.రంగా రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్ ప్రకాశ్, వివిధ బీసీ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు,ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తుల పట్టివేత

- **గంజాయి పండించిన,తరలించినా, అమ్మిన సేవించిన వారి పై కఠిన చర్యలు తప్పవు**
- **పొత్కపల్లి ఎస్ ఐ దీకొండ రమేష్**



ఓదెల, ఏప్రిల్ 11 (మనం న్యూస్): రామగుండం పోలీస్ కమీషన రేట్ పరిధి లోని పెద్దపల్లి జోన్,పెద్దపల్లి సబ్ డివిజన్, సుల్తానాబాద్ సర్కిల్ లోని పొత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు డీసీపీ పెద్దపల్లి బి రామ్ రెడ్డి ఐపిఎస్ ఆద్వర్యం లో ఎసీపీ జి.కృష్ణ,ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ సుల్తానాబాద్ జి. సుబ్బారెడ్డి పర్యవేక్షణ లో ఏప్రిల్ 11 శుక్రవారం పొత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గల గుంపుల గ్రామ శివారులో పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్ వాహనాలు చెకింగ్ చేస్తుండగా ఒక ద్విచక్ర వాహనం పై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. అనుమానాస్పదంగా కనిపించిన వారు చూసి పారిపోవడానికి ప్రయత్నించగా పట్టుకోని వారిని అదుపులోకి తీసుకొని విచారించ గా వారు గంజాయి అమ్మడానికి వచ్చినట్టు తెలిపారు.వారి దగ్గర నుండి 220 గ్రాముల ఎండు గంజాయిని,ఒక ద్విచక్ర వాహనం,ఒక మొబైల్ ఫోన్ ను స్వాధీనం చేసుకుని నిందితుల పై పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దీకొండ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా పొత్కపల్లి ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ గంజాయిని సరఫరా చేస్తూ పట్టుబడిన నిందితులు జమ్మికుంట మండలం పాపక్కపల్లి గ్రామానికి చెందిన గాజానా వేణి రాకేష్ వయసు 31 సంవత్సరాలు,ఓదెల మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన అంబాల తరుణ్ వయసు 26 సంవత్సరాలు. గంజాయి పండించిన,రవాణా చేసిన,అమ్మిన సేవించిన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత చెడువారిలకు బానిసై వారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

## సామాజిక సమానత్వం పూలే ఆశయం



- **బీసీ జేఏసీ జిల్లా చైర్ పర్సన్ దాసరి ఉష**

పెద్దపల్లి ఏప్రిల్ 11 (మనం ప్రతినిధి): మహిళా విద్య, సామాజిక సమానత్వం మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయం అని పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ దాసరి ఉష కొనియాడారు. పెద్దపల్లి పట్టణ కేంద్రంలో శనివారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహానికి ఉష పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారతదేశంలో బహుజన వర్గాల అభ్యున్నతి, మహిళల విద్యా వికాసానికి జ్యోతిరావు పూలే చేసిన కృషి అనన్య సామాన్యమని అన్నారు. పూలే చూపిన చొరవతోనే నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగశక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్ సన్నీ, బీసీ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి శంకర్, జిల్లా వైస్ చైర్మన్ కొండి సతీష్, జిల్లా కన్వీనర్లు, బీసీ జేఏసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తాం

- **ప్రజల మధ్యలో ఉంటాం.. మరో మారు అధికారంలోకి వస్తాం**
- **రేవంత్ ఎందుకు పోవాలో జీవన్ రెడ్డి చెప్పాలి**
- **రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



జగిత్యాల, ఏప్రిల్ 11(మనం న్యూస్): పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా ఎన్నికైన సంగనభట్ల దినేష్ పదవి ప్రమాణ స్వీకారం, అభినందన సభ జగిత్యాల జిల్లా కేంద్రంలో ని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో జరిగిన కార్యక్రమానికి మంత్రి అడ్లూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పనిచేస్తూ గెలిచిన, ఓడిన ప్రజల మధ్యనే ఉంటూ ముందుకు సాగానని అన్నారు. అనేక అవమానాలు ఎదుర్కొంటూ ఎన్నికల్లో ఓటమి చెందిన అధైర్య పడకుండా కాంగ్రెస్ పార్టీ జెండాను నమ్ముకొని ముందుకు సాగినట్లు మంత్రి తెలిపారు. పార్టీలో కమిట్మెంట్ గా పని చేశాను కనుక నేడు క్యాబినెట్ లో పని చేసే అవకాశం దక్కిందని మంత్రి అడ్లూరి అన్నారు.బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో తనకు అనేక ఆఫర్లు ఇచ్చిందని అయినప్పటికీ ఏలాంటి ఆఫర్లను లొంగకుండా కాంగ్రెస్ పార్టీలో కొనసాగానని మంత్రి అడ్లూరి అన్నారు. జగిత్యాల జిల్లాలో పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు సరైన సమయంలో గుర్తింపు లభిస్తుందని ఎవరు నిరాశ పడవద్దని మంత్రి అన్నారు. రాష్ట్రంలో రేవంత్ పాలన పోవాలి.. మార్పు రావాలి అని జీవన్ రెడ్డి నినాదం ఎత్తుకున్నారని ఎందుకు మార్పు రావాలి అని మంత్రి ప్రశ్నించారు. రాష్ట్రంలో సన్నబియ్యం పథకం అమలు చేస్తున్నందుకు మార్పు రావాలా.. ? అర్హులకు రేషన్ కార్డు లు అందించినందుకు మార్పు రావాలా..? నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చినందుకు మార్పు రావాలా.. ? మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందుకు మార్పు రావాలా ..? అని జీవన్ రెడ్డిని మంత్రి అడ్లూరి ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని రానున్న రోజుల్లో నిత్యం ప్రజల మధ్య ఉంటూ రాష్ట్రంలో మరో మారు అధికారంలోకి వస్తామని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. 2029లో సైతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డి మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు. కొత్తగా గ్రంధాలయ సంస్థ చైర్మన్ గా ఎన్నికైన సంగనభట్ల దినేష్ కు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విఫ్ ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, దుద్దిళ్ల శ్రీను బాబుతో పాటు జగిత్యాల జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.

# నెరవేరిన సుల్తానాబాద్ ప్రజల చిరకాల స్వప్నం

- **సుల్తానాబాద్ మినీ ట్యాంక్ బండ్ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సింగ్నల్**
- **మినీ ట్యాంక్ బండ్ గా సుల్తానాబాద్ ఊర చెరువు**
- **జీవో నంబర్ 170 ద్వారా రూ.8.77 కోట్లు మంజూరు**
- **ఉత్తర్వులు జారీచేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం**
- **ఫలించిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు కృషి**



సుల్తానాబాద్, ఏప్రిల్ 11 (మనం న్యూస్): గత ప్రభుత్వ హయాంలో సుల్తానాబాద్ పట్టణంలో అభివృద్ధికి నోచుకోని ఊర చెరువుకు ఎట్టకేలకు మహర్దశ లభించి. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఇచ్చిన మాట ప్రకారం ఊర చెరువును మినీ ట్యాంక్ బండ్ గా సుందరీకరణ చేసేందుకు రూ. 8 కోట్ల 77 లక్షల 50 వేల రూపాయలు మంజూరి చేయించారు. ఈ మేరకు తాజాగా రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ఈ. శ్రీధర్ జీవో 170 ద్వారా ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు..ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు మాట్లాడుతూ చాలా కాలంగా ఊర చెరువును అభివృద్ధి చేస్తామని గతంలోని పాలకులు మాయ మాటలు చెప్పి పబ్బం గడుపుకున్నారు. దీంతో రాను రాను చెరువు కట్టకు బుంగలు ఏర్పడి ప్రమాదకర పరిస్థితికి ఏర్పడింది. అలాగే సాగునీటి స్థిరీకరణ కూడా కుంటుపడింది. రైతులు చాలాకాలంగా ఇబ్బందులు పడుతూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి మొరపెట్టుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఈ క్రమంలో ఎన్నికల్లో మేము ఇచ్చిన హామీ మేరకు చెరువును మినీ ట్యాంక్ బండ్ గా అభివృద్ధి చేసేందుకు పట్టుదలతో కృషిచేసి నిధులు మంజూరు చేయించడం జరిగిందని వెంటనే టెండర్లు పిలిచి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు. సుల్తానాబాద్ మినీ ట్యాంక్ బండ్ నిర్మాణానికి నిధుల మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖ మాత్యులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి కి, జిల్లా మంత్రి వర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సుల్తానాబాద్, సుగ్లాంపల్లె, కందునూరుపల్లె తో పాటు చెరువు కింద పంట పొలాలు సాగు చేసే వివిధ గ్రామాల రైతాంగానికి శుభాకాంక్షలు తెలియజేశారు. చెరువు కట్ట ఆధునికరణ వల్ల సాగునీటి స్థిరీకరణతో పాటు సుల్తానాబాద్ పట్టణంలో బావుల్లో సైతం నీటి నిలువలు పెరుగుతాయని ఎమ్మెల్యే విజయరమణ రావు తెలిపారు. సుల్తానాబాద్ పట్టణ అభివృద్ధిలో భాగంగా ఈ చెరువును అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజల ఆశీస్సులతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మినీ ట్యాంక్ బండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేపించినందుకు సుల్తానాబాద్ ప్రాంత ప్రజలు, పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- **పూలే స్ఫూర్తితో సమ్మెను ఉధృతం చేస్తాం**



మంథని ఏప్రిల్ 11 (మనం న్యూస్): విద్యుత్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ డిమాండ్ చేశారు. శనివారం మంథనిఎన్.పీడీసీఎల్ డిఈ కార్యాలయం ముందు సమ్మె శిబిరం వద్ద మహాత్మ జ్యోతిబాపూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.విద్యుత్ సంస్థలోపనిచేస్తున్న ఆర్టిజన్లు ఆన్ మాండు,పీస్ రేట్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని గత నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నారని తెలిపారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులు అనేక సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలు తీసుకుంటూ కుటుంబాలని పోషించుకుంటున్నారన్నారు.వీరిని కనీసం ఉద్యోగులుగా చూడడం లేదని ఆయనవిమర్శించారు.విధి నిర్వహణలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలు అందిస్తున్న విద్యుత్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం బాధాకరమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రాత్రింబవళ్లు సమాజ క్షేమం కోసం పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరిపి కార్మికుల సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని, లేని పక్షంలో జ్యోతిబాపూలే జయంతి స్ఫూర్తితో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గొర్రెంకల సురేష్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఏల్పుల సురేష్,బాబురవి, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# హౌస్ లిస్టింగ్ బ్లాక్ల జనగణన కార్యక్రమాన్ని కచ్చితత్వంతో పూర్తి చేయాలి

- **హౌస్ లిస్టింగ్ బ్లాక్లకు ఫిజికల్ వెరిఫికేషన్ తప్పనిసరి**
- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



పెద్దపల్లి/సుల్తానాబాద్ ఏప్రిల్ 11 (మనం ప్రతినిధి): హౌస్ లిస్టింగ్ బ్లాక్ల జనగణన కార్యక్రమాన్ని కచ్చితత్వంతో, సమగ్రంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయాన్ని సుల్తానాబాద్ పురపాలక సంఘం లో జరుగుతున్న జనగణన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, హౌస్ లిస్టింగ్ బ్లాక్లకు సంబంధించి ఫిజికల్ వెరిఫికేషన్ను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. పట్టణంలోని ల్యాండ్మార్క్లు, పాఠశాలలు, దేవాలయాలు, కార్యాలయాలు తదితర గుర్తులను బ్లాక్ వారీగా స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.హౌస్ లిస్టింగ్ బ్లాక్కు సంబంధించిన వివరాలు ఖచ్చితమైన సమాచారంతో సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పెద్దపల్లి డిప్యూటీ తహసిల్దార్ విజయ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

- **సామాజిక అసమానతనలు తొలగించడమే పూలే ఆశయం**
- **మహాత్మ జ్యోతిబా పూలే ఆశయాలను, ఆలోచనలను ఆచరించాలి**
- **రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

జగిత్యాల ఏప్రిల్ 11(మనం ప్రతినిధి): శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ మహాత్మ జ్యోతిబా పూలే 200వ జయంతి వేడుకల్లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్ జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ మాసం అంటేనే మహనీయుల మాసం అని అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే విద్యా విప్లవానికి నాంది పలికిన ఆయన మహిళల విద్యకు ప్రాధాన్యతనిస్తూ తొలి బాలికల పాఠశాలను స్థాపించారు. సమాజంలో ఉన్న



అసమానతలను తొలగించడానికి శ్రమించి, అణగారిన వర్గాలకు సమాన హక్కులు కల్పించాలనే లక్ష్యంతో పలు కార్యక్రమాలు చేపట్టారు. దేశంలోని అణగారిన వర్గాల కోసం మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలో సమానత్వం, విద్య, న్యాయం కోసం చేసిన కృషి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని తెలిపారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చూపిన మార్గం ప్రస్తుత ప్రభుత్వానికి మార్గదర్శకమని అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేస్తూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో మహనీయుల జయంతుల వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా పేదలు, దళితులు, బలహీన వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్య, ఉపాధి, సామాజిక న్యాయం రంగాల్లో పూలే గారి ఆశయాలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. జగిత్యాల జిల్లా విద్యా రంగంలో మరియు మహిళాభివృద్ధి కొరకు అనేక పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. జిల్లాకు అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా రెసిడెన్సియల్ పాఠశాల అడ్మిషన్స్ కొరకు ఎంతమంది అప్లికేషన్ చేసుకున్నా అవకాశం కలిపించాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. ప్రతి ఒక్కరూ మహాత్మా పూలే గారి ఆలోచనలను ఆచరణలో పెట్టి సమాజంలో సమానత్వం నెలకొల్పడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహాత్మ జ్యోతి బా పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించినందుకు అధికారులను అభినందించారు.

# 'పూలే' చిత్ర యూనిట్‌కు సన్మానం




హైదరాబాద్, మనం ప్రతినిధి : కులరహిత విద్యయే 'పూలే' లక్ష్యం అని అంబేద్కర్ వర్సిటి వీ.సీ ప్రొ. ఘంటా చక్రపాణి అన్నారు. సాధికార ఉత్సవాల్లో భాగంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని చక్రపాణి మాట్లాడుతూ... సనాతన వ్యవస్థలో అందిరికీ విద్య అందలేదని, అడుగడుగున అణచివేతకు గురవడం జ్యోతిబా పూలేను తీవ్రంగా కలచి వేసిందని పేర్కొన్నారు. కుల, సామాజిక హోదా భేదం లేకుండా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు విద్యలో సమాన అవకాశాలు ఉండాలని పూలే వాదించారని గుర్తు చేశారు. విద్య అనేది సామాజిక పరివర్తనకు, సాధికారతకు ఒక సాధనంగా ఉపయోగపడాలని పేర్కొన్నారు. అంతకు ముందు మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం విశ్రాంత అధ్యాపకులు, సామాజికవేత్త డా. సంగిశెట్టి శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ భారతదేశంలో 'శూద్ర', మహిళల విద్యకు జ్యోతిబా పూలే పోరాడారన్నారు. ఆ కాలంలో అది ఒక విప్లవాత్మకమైన చర్య అని పేర్కొన్నారు.

**'పూలే' సినిమా ప్రదర్శన**

అనంతరం, వర్శిటీ ఆడిటోరియంలో 'పూలే' తెలుగు సినిమా ప్రివ్యూను ప్రదర్శించారు. 'పులే' సినిమా నిర్మాత పొన్నం రవిచంద్ర ఈ చిత్రాన్ని పరిచయం చేస్తూ, అద్భుతమైన కథను తెరపైకి తీసుకువచ్చి, భవిష్యత్ తరాలకు స్ఫూర్తినివ్వడమే ఈ చిత్రం లక్ష్యమని పేర్కొన్నారు.

**వర్సిటీ వేదికగా ప్రజాభిప్రాయాల చర్చ : ప్రొ. పుష్పా చక్రపాణి**

ఇదిలాఉంటే, వర్సిటిలో అనంతరం జరిగిన సాధికారత ఉత్సవాల్లో భాగంగా.. ప్రజాస్వామిక రచయితల వేదిక అధ్వర్యంలో అంబేద్కర్‌పై పుస్తక పరిచయ సభ శనివారం నిర్వహించారు. ప్రొ. పుష్పా చక్రపాణి మాట్లాడుతూ రచయితలు, ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా మాట్లాడుకునేందుకు వర్సిటీ ఎల్లప్పుడూ ఒక వేదికగా ఉంటుందన్నారు.

# అధికారం శాశ్వతం కాదు ?..

- నిషేధిత భూముల జాబితాను 22ఎతో పెద్ద ఎత్తున సెటిల్‌మెంట్లు
- అప్రజాస్వామిక కాంగ్రెస్ సర్కార్‌కి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతరు?
- కాంగ్రెస్‌కు వత్తాసు పలికే ఏ అధికారినీ భవిష్యత్తులో వదిలిపెట్టం : కేటీఆర్ వార్నింగ్

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ సమాజాన్ని మోసం చేస్తూ, తన కుటుంబ సభ్యులు, అనుచరుల కోసం పేద ప్రజల భూములను అరాచకంగా లాక్కుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర చరిత్రలో ఒక చరిత్రహీనుడిగా మిగిలిపోతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న



కేటీఆర్... ఇబ్రహీంపట్నం, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో గులాబీ జెండా ఎగరడం న్యాయానికి దక్కిన విజయమని పేర్కొన్నారు. మెజారిటీ కౌన్సిలర్లు బీఆర్ఎస్ వైపు ఉన్నప్పటికీ, అక్రమంగా చైర్మన్ పదవులను దక్కించుకోవాలని కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలు సాగలేదని అన్నారు.ముఖ్యంగా 'ఫోర్త్ సిటీ', 'ఫ్యూచర్ సిటీ' పేరుతో రేవంత్ రెడ్డి భారీ భూ దందాకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఫార్మా సిటీ భూములను రైతులకు తిరిగి ఇచ్చేస్తామని నమ్మబలికి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు అదే భూముల్లో కొత్త నగరాల పేరుతో నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. భట్టి విక్రమార్క, సీతక్క వంటి నేతలు పాదయాత్రలు చేసి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, ఇప్పుడు అదనంగా మరో 16,000 ఎకరాలను సేకరించాలని చూడటం వెనుక రేవంత్ రెడ్డి సోదరులు, అనుచరుల ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయని విమర్శించారు. ఉన్న సిటీలో దోమల నివారణ కూడా చేయలేని ప్రభుత్వం, ఫ్యూచరే లేని నాయకుడు ఫ్యూచర్ సిటీ కడతామంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇక నిషేధిత భూముల జాబితాను (22ఎ) అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో పెద్ద ఎత్తున సెటిల్‌మెంట్లు జరుగుతున్నాయని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 16 లక్షల ఎకరాలుగా ఉన్న నిషేధిత భూముల సంఖ్యను ఏకంగా కోటి ఎకరాలకు పెంచి, భూ యజమానులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని మండిపడ్డారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ పెద్దలు కలెక్టర్లకు ఫోన్లు చేస్తూ భూ దందాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇబ్రహీంపట్నంలో స్థానిక ఎమ్మెల్యే అరాచకాలు పెచ్చుమీరాయని, హోటళ్లు, బార్ల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. అక్రమ కేసులకు భయపడకుండా నిలబడిన కార్యకర్తలకు అండగా ఉంటామని, నిబంధనలు అతిక్రమించి కాంగ్రెస్‌కు వత్తాసు పలికే అధికారులను భవిష్యత్తులో వదిలిపెట్టే ప్రసక్తి లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

# డ్రగ్స్‌తో కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి

- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో ఆరోగ్య వారోత్సవాలు ముగింపు
- మెడికల్ కాలేజీలో ఫ్లాష్ మాబ్
- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన
- వైద్య కళాశాల పనుల పరిశీలన
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్




రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ -11(మనం ప్రతినిధి)ః డ్రగ్స్ తో కలిగే నష్టాలపై యువత, విద్యార్థులకు వైద్యులు, వైద్య విద్యార్థులు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక₹ 99 రోజుల కార్యాచరణలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య వారోత్సవాల ముగింపు సందర్భంగా సిరిసిల్ల పరిధిలోని వైద్య కళాశాలలో డ్రగ్స్ నియంత్రణ, డ్రగ్స్ తో కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డ్రగ్స్ తో కలిగే నష్టాలపై వైద్య విద్యార్థులు ఫ్లాష్ మాబ్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని వెల్లడించారు. ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్షలు, సేవలు అందించామని తెలిపారు. టీబీ ముక్త్ భారత్ లో భాగంగా జిల్లాకు వచ్చిన మొబైల్ ఎక్స్ రే యంత్రం ప్రారంభించామని, నిర్దేశిత గ్రామాల్లో పరీక్షలు చేస్తున్నారని పేర్కొన్నారు. హెచ్ పీ వీ వ్యాక్సిన్ వేస్తున్నారని వివరించారు. యోగా తో ఉపయోగాలు తెలియజేసేందుకు సిరిసిల్లలో భారీ అవగాహన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. వైద్యుల సలహా సూచనలకు అందరూ ఎంతో విలువ ఇస్తారని, ప్రతి డాక్టర్ తమ వద్దకు వచ్చే వారికి ఆరోగ్య సలహాలు ఇవ్వాలని, వైద్య విద్యార్థులు యువత, విద్యార్థులకు డ్రగ్స్ తో కలిగే నష్టాలు, భవిష్యత్తులో వచ్చే ఇబ్బందులపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుత మంచి అలవాట్లు, ఆహారంపై శ్రద్ధ భవిష్యత్ కు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను సన్మానించారు. వైద్య కళాశాల పనులు గడువులోగా పూర్తి చేయాలి. వైద్య కళాశాల భవన నిర్మాణ పనులు ప్రభుత్వ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వైద్య కళాశాల భవనం, బాలుర, బాలిక హాస్టళ్లు, మెస్ ఇతర పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి.. వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ సీఈ రాజేశ్వరరెడ్డి, ఈఈ నరసింహాచారి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జున చక్రవర్తి, జీజీ హెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, ఆర్ఎంఓ సంతోష్ కుమార్, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ పాలనలో భ్రష్టు పట్టిన విద్యావ్యవస్థ

- రేవంత్ సర్కార్‌పై ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల ధ్వజం



హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో గురుకులాలను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మండిపడ్డారు. కేసీఆర్ సృష్టించిన బ్రాండ్‌ను నాశనం చేశారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి పేద విద్యార్థులంటే ఎందుకంత ద్వేషమని సీఎం రేవంత్ రెడ్డిని ఆయన ప్రశ్నించారనీ దుష్ట కాంగ్రెస్ పాలనలో గురుకుల విద్యావ్యవస్థ పూర్తిగా పూర్తీగా భ్రష్టు పట్టిందని ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. గురుకులాలు నాశనం కావడానికి కారణం ఎవరు అని ప్రశ్నించారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడానికేనా ఈ కుట్ర అని నిలదీశారు. గురుకలాలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని అన్నారు. సమస్యలపై విద్యార్థులు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఎర్రోళ్ల మండిపడ్డారు. గురుకులాలపై ఒక్క రోజైనా సీఎం రేవంత్ రెడ్డి రివ్యూ చేసిండా? అని ఎర్రోళ్ల శ్రీనివాస్ ప్రశ్నించారు. గురుకుల విద్యార్థుల మరణాలకు సంతాపం తెలిపిండా? అని నిలదీశారు. ముఖ్యమంత్రే కదా? విద్యాశాఖ మంత్రి.. మరి గురుకులాలు ఎందుకు సర్వనాశనమయ్యాయని ప్రశ్నించారు. విద్యార్థులంటే ముఖ్యమంత్రికి లెక్కలేదా? అని నిలదీశారు. వేల కోట్ల రూపాయలు ఎన్నికల కోసం ఖర్చుపెడుతున్నారని.. ఎక్కడ ఎన్నికలు జరిగిన కోట్లు కుమ్మరిస్తున్నారని అన్నారు.. గురుకులాల కోసం మాత్రం ఒక్క రూపాయిని కేటాయించడం లేదని ధ్వజమెత్తారు.

# ప్రతి పేద కుటుంబ సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వ భరోసా...

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి



తిరుమలాయపాలెం, ఏప్రిల్ -11(మనం న్యూస్): ప్రతి పేద కుటుంబ సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వ భరోసా కల్పిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం తిరుమలాయపాలెం మండలంలో పర్యటించి తిరుమలాయపాలెం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన (12) మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, (137) మంది లబ్ధిదారులకు మొత్తం 41 లక్షల 73 వేల రూపాయల విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అలాగే పాలేరు నియోజకవర్గంలోని (331) మంది అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సమాజంలోని ప్రతి పేద వ్యక్తికి భరోసా, భద్రత కల్పిస్తున్నదని తెలిపారు. హైదర్సాయిపేట పరిసర ప్రాంతాల్లో ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత సుమారు 10 పనులు 36 కోట్ల 50 లక్షలతో పనులు చేపట్టామని తెలిపారు. )ఈ కార్యక్రమంలో ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఆర్ అండ్ బి ఎస్ఈ యాకోబు, డీపీఓ రాంబాబు, జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ సిలార్ సాహెబ్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే ముందడుగు

- పూలే ఆత్మగౌరవాన్ని నిలబెట్టినం
- ఆయన ఆశయాల సాధనకు బీఆర్ఎస్ కృషి చేసినం
- జ్యోతిభా పూలే ఆశయాలు ఎల్లకాలం ఆచరణీయం
- గత పదేండ్లలో విప్లవాత్మక పథకాల అమలు : కేసీఆర్

హైదరాబాద్, మనం ప్రతినిధి : వర్ణ వివక్షకు వ్యతిరేకంగా తన జీవితకాలం పోరాడిన భారతదేశ సామాజిక విప్లవకారుడు, సమ సమాజ స్థాపన మార్గదర్శి, మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా వారు జాతికి చేసిన సేవలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. భారత సమాజంలో వర్ణ, కుల లింగ వివక్షతను రూపుమాపి, సామాజిక న్యాయం దక్కాలని పోరాడిన దార్శనికుడు మహాత్మా పూలే అని కొనియాడారు. సబ్బండ వర్ణాలు సామాజిక ఆర్థిక రంగాల్లో ముందడుగు వేయాలంటే విద్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని చెప్పిన జ్యోతిరావు పూలే ఆశయాలు ఎల్లకాలం ఆచరణీయమైనవని కేసీఆర్ తెలిపారు. తన భార్య సావిత్రి బాయి పూలేకు చదువు నేర్పించి మరీ, చదువు నిరాకరించబడిన భారత మహిళకు విద్య నేర్పాలనే ధృఢ సంకల్పాన్ని అనేక కష్ట నష్టాల నడుమ అమలు చేసిన, మహిళాభ్యుదయ మార్గదర్శి మహాత్మా పూలే అని కొనియాడారు. పూలే ఆశయాలను నిజం చేస్తూ, తన పదేండ్ల ప్రగతి పాలనలో, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్బండ కులాల అభ్యున్నతి కోసం అమలు చేసి ఫలితాలను సాధించిన పలు రకాల పథకాలను కార్యాచరణను కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. సాగునీరు, విద్యుత్, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు అమలు చేసి వ్యవసాయ రంగాన్ని పటిష్టపరిచామని తెలిపారు. పలు వృత్తికులాలను ప్రోత్సహిస్తూ గొర్రెల పెంపకం, చేపల పంపిణీ, నేతన్నకు చేయూత వంటి పథకాలను అమలు చేయడం ద్వారా నూటికి తొంభైశాతంగా ఉన్న దళిత బహుజన కులాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయని తెలిపారు. తద్వారా, తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనం జరిగిందని అన్నారు. ఆసరా ఫించన్లు, బీసీ బంధు వంటి బహుజన సంక్షేమ పథకాల అమలు ద్వారా, వెనకబడి ఉన్న సబ్బండ కులాలను ఆర్థికంగా అభివృద్ధి చేసామన్నారు. బీసీ కులాల విద్యకోసం ప్రత్యేక రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఏర్పాటు చేసి వారికి అంతర్జాతీయ స్థాయి విద్యనందించినామని కేసీఆర్ తెలిపారు. బీసీ బిడ్డల భవిష్యత్తు తరాల ప్రయోజనాలను నెరవేర్చేందుకు రాష్ట్ర రాజధాని నగరం హైద్రాబాద్‌లో ఆత్మగౌరవ భవన నిర్మాణాల కోసం, అత్యంత విలువైన స్థలాలను, నిర్మాణ నిధులను,బీసీ కుల సంఘాలకు కేటాయించినామని తెలిపారు. బీసీ కులాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు పూలే ఆశయాలకు అనుగుణంగా తాము గత ప్రభుత్వంలో అమలులోకి తెచ్చిన ప్రగతి కార్యాచరణను చిత్తశుద్ధితో కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. తద్వారా మాత్రమే మహాత్మాపూలేకు మనం ఘన నివాళి అర్పించిన వారమవుతామని కేసీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# కేంద్రం వెన్నులో..వణుకు పుట్టేలా ఉద్యమిద్దాం



- పాలకులకు బీసీ లంటే భయం లేదు
- పూలే మళ్లీ పుట్టాడా? అనే స్థాయిలో జాగృతి ఉద్యమం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

హైదరాబాద్,ఏప్రిల్ 11(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః బీసీ మహిళలకు ఉప కోటా కోసం కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా ఉద్యమిద్దామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిరావ్ పూలే రెండు వందల జయంతి సందర్భంగా బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కల్వకుంట్ల కవిత నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మహాత్మా పూలే విగ్రహ ఏర్పాటులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది, పూలే ఆశయాలను సాధించడమే నిజమైన నివాళి అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ పాలకులకు బీసీలంటే భయం లేకపోవటంతోనే మహిళ రిజర్వేషన్ బిల్లులో బీసీ సబ్ కోటా పెట్టలేదని, బీసీ సబ్ కోటా కోసం జాగృతి శ్రేణులు కమిట్ మెంట్‌తో పనిచేస్తాయని తేల్చిచెప్పారు. మహాత్మా పూలేనే మళ్లీ పుట్టారా అనే స్థాయిలో తమ పోరాటం ఉంటుందన్నారు. దేశంలో మహిళ రిజర్వేషన్ బిల్లు రావటంలో జాగృతి ఉద్యమమే కీలకం అన్న విషయాన్ని మనమంతా సగర్వంగా చెప్పుకోవాలన్నారు. అంతటితో ఆగకుండా బీసీలకు ఉపకోటా వచ్చే వరకు పోరాడుదామన్నారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో మహిళ రిజర్వేషన్ బిల్లుపై పార్లమెంట్ లో చర్చ జరగనున్న నేపథ్యంలో అవసరమైతే ఢిల్లీకి వెళ్తామని చెప్పారు. బీసీ కోటా కోసం అన్ని పార్టీల నాయకులతో మాట్లాడుతామన్నారు. అధికార బలం ఉందని బీసీ కోటా లేకుండా బిల్లు పాస్ చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునేది లేదని హెచ్చరించారు. బీసీ కోటా వచ్చే వరకు జాగృతి పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**పూలే విగ్రహంపై :**

ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేయాల్సిన పూలే విగ్రహం విషయంలో ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కవిత మండిపడ్డారు. అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని జాగృతి డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తాము అసెంబ్లీ ఆవరణలో విగ్రహం ఏర్పాటు చేయాలని కోరితే ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. పూలే జయంతి నాటికి కూడా విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన పనులు చేశారే తప్ప పూలే విగ్రహం మాత్రం ఏర్పాటు చేయలేదన్నారు. ఈనెల 14న అంబేడ్కర్ జయంతి రోజు నాటికైనా పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ని కష్టాలు వచ్చిన సరే వెన్ను చూపకుండా పోరాడిన త్యాగధనులు పూలే గారని చెప్పారు. ఏ విప్లవం వచ్చిన సరే త్యాగం పునాదిగా ఉంటుందని.. సమాజంలో మార్పు తేవాలంటే ముందు ఆ మార్పు మన నుంచే మొదలుకావాలని సూచించారు. జాగృతి చేపట్టే బాట కూడా ముళ్లబాట మాదిరిగానే ఉంటుందని.. పూలేకు సైతం అదే జరిగిందని గుర్తు చేశారు.

**ఆర్టిజన్లకు జాగృతి మద్దతు**

విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఆర్టిజన్లను రెగ్యులర్ చేయాలని కవిత డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం కొత్తగూడెంలో ధర్నా చేస్తున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకునే ప్రయత్నం చేయటం సరికాదన్నారు. వారికి మద్దతుగా రాష్ట్రంలోని ఆర్టిజన్లంతా కొత్తగూడెంలో చేస్తున్న ధర్నాలో జాగృతి నాయకులుగా కూడా పాల్గొంటారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఆర్టిజన్ల జీతాలు రూ.40 వేలకు పెంచిందని, ఇందులో తన వంతు ప్రయత్నం చేశానని కవిత గుర్తు చేశారు

**పదే..పదే :**

బీసీలను పదే పదే మోసం చేయడంతో పాటు వారిని అవమానిస్తూ చులకన చేస్తే తగిన మూల్యం తప్పదని తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి అన్నారు. జాగృతి బీసీ నాయకులతో కలిసి శనివారం ఐ మ్యాక్స్ ఎదురుగా గల లేక్ వ్యూ పార్క్ మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ప్రాంగణంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి మాట్లాడుతూ బీసీలంటే ఎందుకంత చులకన అని ప్రశ్నించారు. ఈనెల 9వ తేదీన పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని ప్రచారం చేసుకుని ఆయన జయంతి నాటికి కూడా విగ్రహాన్ని ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు.మహాత్మా పూలే గ్రహాన్ని ఏర్పాటు చేయకుండా ఆ స్థానంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాన్ని పెట్టే కుటిల యత్నం చేశారని మండిపడ్డారు. బీసీ సంఘాలు, జాగృతి నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందన్న ఉద్దేశంతో ఆ ప్రయత్నం మానుకున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో కూడా కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం విషయంలో ఇలాగే చేశారని గుర్తు చేశారు. సమాజాన్ని చైతన్య పరిచేందుకు జీవితమంతా కృషి చేసిన సంఘ సంస్కర్త పూలే విషయంలో ఇంత నిర్లక్ష్యమా? అని ప్రశ్నించారు. అసలు పూలే బీసీ గా పుట్టటమే ఆయన చేసిన తప్పా అని ఆవేదన వ్యక్తం చేశారు.

## త్రివేణి లో సామాజిక సంస్కర్త జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

ఖమ్మం, ఏప్రిల్ 11(మనం న్యూస్): త్రివేణి ఉన్నత పాఠశాలలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ అంటరానితనం, కుల నిర్మూలన కై పాటుపడిన సామాజిక సంస్కర్త అని వారు చేసిన సేవలను కొనియాడారు. పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే తన అనుచరులతో కలిసి 1873 సెప్టెంబర్ 24న 'సత్యశోధక్ సమాజ్'స్థాపించి అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేశారు, అలాగే ప్రస్తుత సమాజంలో అందరూ కలిసికట్టుగా ఉండాలని కుల, మత రహిత సమాజంలో మనమంతా ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ముస్తఫా, స్వప్న క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్ ట్రాన్స్‌పోర్టు ఇంచార్జ్ సందీప్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు జ్యోతి రావు పూలే



### వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### పూలే ఆశయాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### శ్రీ మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి, కలెక్టర్

ఖమ్మం, ఏప్రిల్ 11(మనం న్యూస్): సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు శ్రీ మహాత్మా జ్యోతి రావు పూలే అని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం స్థానిక శ్రీ శ్రీ సర్కిల్ వద్ద వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పాల్గొని, జ్యోతి రావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ₹మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ₹ నేడు మహనీయుడు జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకోవడం గొప్ప గౌరవమని తెలిపారు. సమానత్వ సమాజ నిర్మాణంలో పూలే కీలక పాత్ర పోషించారని అన్నారు. ఆ కాలంలో కుల, మత భేదాలు ఉన్న పరిస్థితుల్లో సామాజిక సంస్కరణలకు పూలే శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. మొదటగా తన భార్య సావిత్రిబాయి పూలేకు విద్యాబోధన చేసి, ఆ తర్వాత ఆమె ద్వారా బాలికల విద్యకు మార్గం సుగమం చేసిన గొప్ప సంస్కర్త అని కొనియాడారు. ఆ రోజుల్లో కుల వివక్ష కారణంగా అనేక వర్గాల ప్రజలను దేవాలయాలు, పాఠశాలల్లోకి అనుమతించని పరిస్థితులను పూలే ధైర్యంగా ఎదిరించి సమాజంలో మార్పు తీసుకువచ్చారని తెలిపారు. అందుకే వారి జయంతిని ఘనంగా జరుపుకుంటున్నా మని అన్నారు. వెనుకబడిన వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత బిసి వర్గానికి 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని సైంటిఫిక్ గా ప్రూవ్ చేసి పూర్తి చిత్తశుద్ధితో ప్రయత్నించిన సంగతి రాష్ట్ర ప్రజలకు తెలుసని, బీసీ వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ₹ కుల వివక్ష లేకుండా సమాజం అభివృద్ధి చెందాలని, ప్రతి ఒక్కరూ విద్యను పొందాలని శ్రీ మహాత్మా జ్యోతి రావు పూలే బోధించిన సిద్ధాంతాలని తెలిపారు. ఆ కాలంలోనే మహిళా విద్య కోసం పూలే చేసిన కృషి అపారమని గుర్తుచేశారు.

పేదలకు నాణ్యమైన విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు వంటి పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా వారి ఆశయాలను మరోసారి స్మరించుకొని, మంచి సమాజ నిర్మాణం కోసం వారు చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జి. జ్యోతి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, జిల్లా అధికారులు, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, వివిధ సంఘాల నాయకులు, కుల సంఘ నాయకులు, ప్రతినిధులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, సాంస్కృతిక సారథి కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును కలిసిన డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు



ఖమ్మం, ఏప్రిల్ 11(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావును ఖమ్మం జిల్లా ప్రముఖ వైద్యులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. తనను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీని ఖమ్మంలో బలం పుంజుకోవడానికి తన వంతు సాయి శక్తుల కృషి చేస్తానని తెలిపారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఎన్ రామచంద్ర రావు ఆధ్వర్యంలో బీజేపీ సరైన సమయంలో సరైన నిర్ణయాలతో అందరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి శాయశక్తుల కృషి చేస్తున్నారని రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలందరూ బిజెపి వైపు చూస్తున్నారని గడిచిన సంవత్సరాలలో వివిధ పార్టీలు చేసింది శూన్యమని అందువల్ల ప్రజలందరూ బిజెపి రావాలని కోరుకుంటున్నారని రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు అన్నారు. అదే విధంగా ఖమ్మం జిల్లాలో కూడా బిజెపి శ్రేణులందరుని ఒక తాటిపై నడిపించి ముందుకు తీసుకెళ్లి దేశంలో బీజేపీ తీసుకొచ్చిన సంస్కరణలు మోదీ పరిపాలనలో భారతదేశం ప్రపంచ దేశాలతో పోటీపడుతున్న విధానం భారతదేశ అభివృద్ధి ఇవన్నీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీ విజయపథంలో నడవడానికి కృషి చేయాలని ఆయన సూచించారని డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన సూచనలను తూచా తప్పకుండా పాటిస్తానని గోంగూర వెంకటేశ్వర్లు తెలియజేశారు.

# వ్యసన బాధితులకు అడిక్షన్ కౌన్సిలింగ్ సెంటర్ ప్రారంభం

- జిల్లా కలెక్టర్ అంకిత్
- జిల్లాలో వ్యసన బాధితులకు పునరావాస సేవలు అందుబాటులో



భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 11(మనంప్రతినిధి): కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అడిక్షన్ కౌన్సిలింగ్ సెంటర్ను శనివారం జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. వ్యసన బాధితులకు సమగ్ర చికిత్స, పునరావాస సేవలు అందించేందుకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం అదే ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ కేంద్రాన్ని కూడా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా మత్తు వ్యసనానికి గురైన వారికి ప్రత్యేక వైద్య చికిత్సలు, నిపుణుల పర్యవేక్షణలో పునరావాస సేవలు, నిరంతర కౌన్సిలింగ్ అందించబడతాయని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మద్యానికి బానిసై చికిత్స కోసం వచ్చిన రోగితో మాట్లాడి, రోజువారీ ఆదాయం, మద్యంపై ఖర్చు వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ వ్యక్తి తాను మద్యం మానేందుకు పలు మార్లు ప్రయత్నించినప్పటికీ, వణుకుడు, ఫిట్స్ వంటి సమస్యలు రావడంతో చికిత్స కోసం ఈ కేంద్రానికి వచ్చానని తెలిపాడు.

ఈ తరహా కేసులకు అందిస్తున్న వైద్య సేవలు, కౌన్సిలింగ్ విధానాలు, చికిత్స ప్రక్రియ గురించి కలెక్టర్ అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులు పూర్తిగా కోలుకునేలా సమగ్ర చికిత్సతో పాటు నిరంతర కౌన్సిలింగ్ అందించాలని వైద్యులకు సూచించారు. ఇదే సందర్భంగా డ్రగ్స్ కంట్రోల్ అండ్ రెగ్యులేటరీ స్ట్రెంగ్తెనింగ్ డే కార్యక్రమం కింద నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి కలెక్టర్ ప్రశంస పత్రాలు, శిల్డులను అందజేశారు. యువతలో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. మత్తు వ్యసన నిర్మూలనలో ప్రభుత్వ శాఖలు, వైద్య విభాగం, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యులు బాధితులను ప్రోత్సహించి, ఈ కేంద్రం సేవలను వినియోగించుకునేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, ఆసుపత్రి సూపర్డెంట్ రమేష్, డాక్టర్ రాధిక, డాక్టర్ రాదా మోహన్, ఇతర వైద్యులు సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 450 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

### నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు

### జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్

### రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు




భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 11 (మనంప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (పి డి ఎస్) కింద పంపిణీ అయ్యే రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిపై జిల్లా యంత్రాంగం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సమన్వయ దాడుల్లో మొత్తం 450 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శనివారం తెల్లవారుజామున సుమారు 1.45 గంటల సమయంలో సివిల్ సప్లై అధికారులు, పోలీస్ విభాగం కలిసి నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో భాగంగా ఇల్లెందు మండలం రేపల్లెవాడలోని కోట మైసమ్మ గుడి సమీపంలో అక్రమంగా వాహనాలకు ఎక్కిస్తున్న 200 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఒక లారీ, ఒక బొలెరో వాహనాలను కూడా అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్కు తరలించారు.

అదేవిధంగా టేకులపల్లి మండలంలో మరో ఘటనలో సుమారు 250 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఇతర రాష్ట్రానికి తరలించే ప్రయత్నంలో ఉన్న లారీని అడ్డుకుని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యం ఛత్తీస్గఢ్ రాష్ట్రానికి మళ్లించేందుకు యత్నించినట్లు ప్రాథమిక విచారణలో బయటపడినట్లు తెలిపారు. ఈ రెండు ఘటనలపై సవివర విచారణ కొనసాగుతోందని, సంబంధిత నిందితులపై తెలంగాణ స్టేట్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (టి ఎస్ పి డి ఎస్) కంట్రోల్ ఆర్డర్ నిబంధనలు మరియు భారతీయ న్యాయ సంహిత (బి ఎన్ ఎస్) కింద కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యాన్ని దారి మళ్లించడం అత్యంత తీవ్రమైన నేరమని, ఇందులో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. జిల్లాలో ఇలాంటి అక్రమ కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించేందుకు నిరంతర తనిఖీలు, దాడులు కొనసాగుతాయని తెలిపారు. ఈ దాడుల్లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్, సివిల్ సప్లై అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీలకు చట్టబద్ధత కల్పించాలి

### బిసి సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు గుండాల కృష్ణ

ఖమ్మం, ఏప్రిల్ 11(మనం న్యూస్): మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ లకు చట్ట బద్ధత కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు గుండాల కృష్ణ పేర్కొన్నారు.సంఘం ముఖ్య నాయకుల సమావేశం శని వారం ఖమ్మం లో జరిగింది.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ తో పాటు ఓబీసీ లకు వాటా కల్పించాలని అప్పుడే పూలేకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందన్నారు.జనగణన లో కులం కాలం వున్నప్పటికీ ఓబీసీ క్లాసిఫికేశన్ లేకపోవడంవల్ల బీసీల జనాభా లెక్క తేలడం లేదన్నారు.వెంటనే ఓబీసీ గణన చేపట్టి దానికి అనుగుణంగా మహిళా రిజర్వేషన్ లో ఓబీసీ లకు సాబ్ కోటా కల్పించాలని డిమాండ్ చేశారు.బిల్లు అమలు కాకపోవడం వల్లఖమ్మం లో రాజకీయ సామాజిక అసమానతలు మరింత పెరిగాయని అన్నారు.కొన్ని సంవత్సరాలు గా పూలే జయంతి వేడుకలు రోడ్ల మీద నిర్వహించుకోవడం విచారకరమని వెంటనేఖమ్మం లో బీసీ భవన్ ను వెంటనే బీసీ భవన్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు.అదేవిధంగా నూతనంగా నిర్మించిన కలెక్టరేట్ లో పులె విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని



కోరారు.ఈ కార్యక్రమంలో డి డిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం,జిల్లా పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షులు బొమ్మా రాజేశ్వరరావు, గౌడ సంఘం అధ్యక్షులు కత్తి నెహ్రూ పాల్గొన్నారు.

## పూలే జీవితం స్ఫూర్తిదాయకం


### రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



ఏలూరు/నూజివీడు, ఏప్రిల్ 11,మనం న్యూస్): నూజివీడు మండలం యనమదల గ్రామంలో శనివారం మహాత్మా జ్యోతిబాపూలే 200వ జయంతి ఉత్సవాల్లో భాగంగా చిత్రపటానికి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నామని అన్నారు. రెండు శతాబ్దాలు తర్వాత కూడా ఒక వ్యక్తిని గుర్తు చేసుకుంటూ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నామంటే ఆయన ఎంత గొప్పతనం మనమంతా తెలుసుకోవచ్చనని అన్నారు. జ్యోతిరావు పూలే స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు నడవాలని సూచించారు. వెనుకబడిన వర్గాలు విద్యకోసం, మానవ హక్కులు కోసం మహాత్మా జ్యోతిరావు పూలే అలుపువెరగని పోరాడారని తెలిపారు. అత్యంత వెనుకబడిన కులాలు వారికి అభివృద్ధి, సంక్షేమ కోసం పూలే ఎంతగానో కృషి చేశారని తెలిపారు. భారతదేశంలో ఉన్న మహానాయకులు అందరికీ ఆదర్శంగా నిలిచిన గొప్ప వ్యక్తి పూలే అన్నారు. మహిళలకు విద్య ఎంతో అవసరమని అందరూ మాట్లాడుకుంటున్న సమయంలో తన భార్యకు ముందుగా విద్యను అందించి ఆమె ద్వారా మహిళలు విద్యావ్యాప్తికి ఎన్నో సంస్థలు స్థాపించిన గొప్ప వ్యక్తి అన్నారు. బడుగుబలహీన వర్గాలు అభ్యున్నతికి సామాజిక న్యాయం అనే కొత్త ఆలోచన విధానాన్ని తీసుకువచ్చి ప్రజలు కోసం

తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప యోధుడు అన్నారు. సమాజంలో అసమానతలు తొలగడానికి పూలే ఎంతో శ్రమించారని ఆ దిశగా కూటమి ప్రభుత్వం అసమానతలు తొలగించేందుకు, సమాజంలో అందరూ సమానంగా జీవించే విధంగా కృషిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలు అధికారులు, ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# క్లీన్ పాలిటిక్స్‌కి కేరాఫ్ టిడిపి..



### అమరావతి అభివృద్ధితోనే కౌంటర్ ఇస్తా

### కార్యకర్తల శిక్షణలో సీఎం చంద్రబాబు

**జగన్ 'మావిగన్' విమర్శలకు 'అమరావతి' సరైన సమాధానమిస్తుంది. అమరావతి అభివృద్ధే జగన్ బ్యాచ్ కి కౌంటర్ ఇస్తుంది. అభివృద్ధికి అంతం లేదు... అభివృద్ధి అనేది ఆగదు... కార్యకర్తలకు ఎలాంటి అధైర్యం లేదు. నైతిక ఆర్థిక సాధికారత అనే ఇ.-3 ఫార్ములాను రూపొందించా...పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అని నారా చంద్రబాబు ప్రకటించారు.**





(అమరావతి, పి.మీరాహుస్సేన్, మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి) అమరావతి రాజధాని నిర్మాణంపై ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు శనివారం కాసేపు చిట్ చాట్ చేశారు. మీడియాతో చిట్చాట్లో సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. జగన్ 'మావిగన్' విమర్శలకు 'అమరావతి' సరైన సమాధానమిస్తుందన్నారు. అమరావతి అభివృద్ధే జగన్ బ్యాచ్కు పూర్తిస్థాయి కౌంటర్ ఇస్తుందని, అభివృద్ధి అనేది ఆగదు.. హైదరాబాద్, బెంగళూరు నిరంతరం పెరుగుతున్నాయి. అమరావతి కూడా ఇదే తరహాలో నిరంతరం అభివృద్ధి చెందుతుంది.. అభివృద్ధికి ముగింపు అనేది ఉండదన్నారు. ఇలాంటి విషయాలు తెలియని వారు చేసే విమర్శలు పట్టించుకోం... అని చెప్పారు. మంగళగిరి టీడీపీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ఇ-3 ప్రకటన చేశారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. కార్యకర్తల కోసం ఈ-3 అనే సరికొత్త విధానాన్ని ప్రకటించారు. నైతిక ఆర్థిక సాధికారతలతో ఇ.3ని రూపొందించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. నీతి, నిజాయితీలతో కూడిన మార్గాల ద్వారా కార్యకర్తల కుటుంబాలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడం తమ ఉద్దేశం అని చంద్రబాబు ప్రకటించారు. పార్టీ కార్యకర్తలకు భరోసా ఇస్తూ, తాను తన కుటుంబం గురించి ఎంతలా ఆలోచిస్తానో, టీడీపీ కార్యకర్తల కుటుంబాల గురించి కూడా అంతే బాధ్యతగా ఆలోచిస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. రాజకీయ సంస్కరణలు: క్లీన్ అండ్ గ్రీన్, క్లీన్ ఎనర్జీ తరహాలోనే రాష్ట్రంలో 'క్లీన్ పాలిటిక్స్' తీసుకురావాలని, అందుకు టీడీపీ కేరాఫ్ అడ్రస్గా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, ప్రజల నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్బ్యాక్ సేకరించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ శిక్షణ తరగతుల్లో ముఖ్యమంత్రి స్వయంగా ఒక సాధారణ కార్యకర్తలా కూర్చుని ప్రసంగాలను వినడం, కార్యకర్తలతో నేరుగా ముచ్చటించడం విశేషం.

## పూలే ఆశయాలను కొనసాగించాలి



ఏలేశ్వరం,ఏప్రిల్ 11(మనం న్యూస్): మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగించాలని ఏలేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ జి వి సత్యనారాయణ పిలుపునిచ్చారు. పూలే 199 వ జయంతి వేడుకలను స్థానిక ఆర్టీసీ డిపో లో రాష్ట్ర బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు భీమన సూరిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిపో మేనేజర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ జీవి సత్యనారాయణ మాట్లాడుతూ నేటి యువత కార్మికులు ఉద్యోగస్తులు పూలే ఆశయాలను కొనసాగిస్తూ ముందుకు సాగాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు భీమన సూరిబాబు మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. తమ సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చొరవ చూపాలన్నారు. అనంతరం పూలే జయంతి సందర్భంగా డిపో మేనేజర్ చేతుల మీదుగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కే టి మూర్తులు, ఎల్ వి ఎస్ నారాయణ, ఎన్ నారాయణ, కే ప్రవీజ్, ఏ బి జి ఎస్ రావు, జె శ్రీను, ఎస్ సి హెచ్ బాబు, గ్యారేజీ సురేష్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# బీసీ, ఎస్సీల అభివృద్ధి సంక్షేమమే నా ప్రధాన అజెండా

## మంత్రి నిమ్మల ఆధ్వర్యంలో ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



పాలకొల్లు, ఏప్రిల్ 11,మనం ప్రతినిధిః భారతదేశంలో సామాజిక న్యాయం, సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహాత్మ జ్యోతిరావు పూలే అని, అటువంటి మహనీయుని ఆశయాలు కనుగుణంగా బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సంక్షేమమే నా ప్రధాన అజెండాగా పనిచేస్తున్నానని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. సమాజ సంస్కరణల పితామహుడైన మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శనివారం పాలకొల్లులో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక అడబాల థియేటర్ వెనుక ప్రాంతంలో జరిగిన ఈ కార్యక్రమ సభలో మంత్రి రామానాయుడు మాట్లాడారు. ముందుగా గాంధీ బొమ్మల సెంటర్లో జ్యోతిరావు పూలే విగ్రహానికి కూటమి నాయకులతో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. సభా వేదికపై పూలే చిత్రపటానికి పూలమాలవేసి కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, పేద మహిళలకు కుట్టు మిషన్ లను మంత్రి రామానాయుడు ఉచితంగా అందజేశారు. బీసీ వర్గానికి చెందిన కూటమి నాయకులను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యే విముక్తి మార్గం అనే నమ్మకంతో ఆయన బాలికల విద్యకు శ్రీకారం చుట్టి దేశంలో తొలి బాలికల పాఠశాలను స్థాపించారన్నారు.ఆయన భార్య సావిత్రిబాయి పూలే దేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా మహిళా సాధికారతకు దారితీశారన్నారు.

అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన పూలే, సమానత్వం, విద్య, సామాజిక న్యాయం కోసం చూపిన దారి ప్రతి ఒక్కరికీ ప్రేరణగా నిలుస్తోందన్నారు. జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. బీసీ వర్గాల అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తోందని, బీసీ అంటే తెలుగుదేశం - తెలుగుదేశం అంటే బీసీ అనే స్థాయికి పార్టీ ఎదిగిందని వ్యాఖ్యానించారు. జ్యోతిరావు పూలే ఆశయాలను అమలు చేస్తూ చంద్రబాబు నాయుడు అట్టడుగు వర్గాలకు సంక్షేమ పథకాలు, రాజకీయ అవకాశాలు కల్పించారని చెప్పారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇచ్చిన పార్టీ తెలుగుదేశమేనని గుర్తుచేశారు. అయితే గత ప్రభుత్వం బీసీలకు నష్టం కలిగించిందని మంత్రి ఆరోపించారు. 40 ఏళ్ల చరిత్రలో ఎవరూ రద్దు చేయని బీసీ రిజర్వేషన్ను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఆలోచనలు ఆధునిక భారత సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి అన్నారు. సభలో ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, కర్నేన గౌరు నాయుడు, ఉన్నమట్ల కబర్ది, తులా రామలింగేశ్వరరావు, , మామిడి శెట్టి పెద్దిరాజు, కడలి గోపాలరావు, అంగర చిన్న, చిట్టూరిసీతారామాంజనేయులు, ఉన్నమట్ల ప్రేమ్ కుమార్,, పీతల శ్రీనివాస్, మాతా రత్నం రాజు, చినిమిల్లి చిన్ని, దొమ్మేటి ఏసు, , పొట్నూరి శ్రీనివాస్, బొప్పన హరికిషోర్, జోతదితరులు పాల్గొన్నారు.

## జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం..

- **సుమారు 150 మందికి పరీక్షలు**
- **25 మందికి కంటి ఆపరేషన్లు**



శంఖవరం ఏప్రిల్ 11 మనం ప్రతినిధిః ప్రపంచ మేధావి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 135వ జయంతి నీ పురస్కరించుకొని శంఖవరం జై భీమ్ యూత్ అసోసియేషన్ మరియు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో కాకినాడ సంజీవి ఆసుపత్రి సిబ్బంది, తుని కృష్ణ ఆర్థోకేర్ ఆసుపత్రి సిబ్బంది సుమారు 150 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించగా కాకినాడ వాసన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులతో పాటు తక్కువ ధరకే కళ్ళజోళ్ళు అందించారు. కంటి ఆపరేషన్లు అవసరమైన 25 మందిని గుర్తించి త్వరలో ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. మురళీకృష్ణ, డాక్టర్ ఎస్ ఎం నిజాముద్దీన్, డాక్టర్ శివీష, డాక్టర్ స్వామి వందనం, పులి కిషోర్, నాగేంద్ర, మణికుమార్, దుర్గాప్రసాద్, విజయబాబు, గునపర్తి అశోక్, లూదియా, సర్వణ, జై భీమ్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ నందు పూలే జయంతి



అమలాపురం, ఏప్రిల్ 11 మనం న్యూస్ః యువత జ్యోతిరావుపూలే వారి ఆశయాలను స్ఫూర్తి గా తీసుకుని, ఉన్నత చదువులతో సమాజ అభివృద్ధిలో భాగస్వాము లు కావాలని విద్య, సమానత్వం సామాజిక న్యాయం ప్రాతిపదికన జిల్లాను ఆద ర్శంగా నిలబెట్టాలని కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీ విశ్వేశ్వర రావు అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్ నందు మహాత్మ జ్యోతి రావు పూలే జయంతి వేడుకల ను అధికారికంగా ఆయన చిత్రపటానికి పూలమలలు అలంకరించి పుష్పగుచ్ఛా లతో ఘనంగా నివాళుల ర్పించారు. జిల్లా ప్రజలంద రికీ, ముఖ్యంగా అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం శ్రమించే ప్రతి ఒక్కరికీ మ హాత్మ జ్యోతిరావు పూలే జయంతి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమం లో డి ఎస్ ఓ ఏ ఉదయ భాస్కర్, బీసీ వెల్ఫేర్ ఆఫీ సర్ పి జ్యోతిలక్ష్మి దేవి, పి చంద్రమౌళి, గొల్ల రమేష్, శెట్టి బలిజి కార్పొరేషన్ సభ్యులు కడలి వెంక టేశ్వర రావు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కిర్లంపూడిలో నాగేంద్ర చౌదరికి ఘన సత్కారం



కిర్లంపూడి ఏప్రిల్ 11(మనం న్యూస్)ః అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా నియమితులైన నాగేంద్ర చౌదరి కిర్లంపూడి మండలంలో ఘన స్వాగతం లభించింది. జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆశీస్సులతో ఈ పదవి లభించిన సందర్భంగా, కిర్లంపూడి మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు కలిసి పూల బొకేలు, పూల దండలతో అభినందనలు తెలియజేశారు.



## పూలే జయంతి కార్యక్రమం

కాత్రేనికోన, ఏప్రిల్ 11(మనం ప్రతినిధి)ః అనగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సంఘసంస్కర్త జ్యోతిబా పూలే 199 వ జయంతి కార్యక్రమాన్ని శనివారం మండల పరిషత్ కార్యాలయం నందు ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో ఉన్న పూలే, విగ్రహాని కి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ రవి కిరణ్ మాట్లాడుతూ పూలే కుల వ్యవస్థ నిర్మూలన తోపాటు మహిళల ఉన్నతి కి కృషి చేశారని, సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజాన్ని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమం లో ఎంపీడీఓ బి రాజేశ్వర్ రావు, మండల పరిషత్ ఏవో సంఘమిత్ర, ఏ ఓ బి మృదుల, సూపర్వైజర్ తులసి, వర్మ, బాలాజీ, పంచాయతీ కార్యదర్శులు, స్వర్ణ గ్రామ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## ఆచంటలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

- **ఎస్ ఐ కే వెంకటరమణ**

ఆచంట, ఏప్రిల్ 11 మనం న్యూస్ః నియోజకవర్గ కేంద్రమైన ఆచంటలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారిని అయినా ఉపేక్షించేది లేదని స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ కె వెంకటరమణ అన్నారు ఆచంట పరిధిలోని కోడేరు ఉత్తర పాలెం లో పేకాట కోడిపందాలు స్థావరాలపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ సమక్షంలో పోలీసులు మెరుపు దాడి చేశారు ఈ దాడిలో 42 మంది పేకాట కోడిపందాలు ఆడే వారిని అదుపులోకి తీసుకున్నారు అంతేకాక వారి వద్ద నుండి పది కార్లు ఏడు మోటార్ వాహనాలు మూడు లక్షల నగదు పోలీసులు స్వాధీనం చేసుకున్నామని పోలీసు అధికారులు విలేకరులకు తెలిపారు.

# ప్రజల కోసం రోజుకి 18 గంటలు పనిచేస్తున్నా

- **మంత్రి రామానాయుడు.**
- **142 మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ.**





పోడూరు, ఏప్రిల్ 11 మనం న్యూస్ః పోడూరు మండలం జిన్నూరు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో చెట్టినాడ్ సిమెంట్ సిఎస్ఆర్ నిధులతో జిన్నూరు, వేడంగి, జిన్నూరుపాలెం పాఠశాలలకు చెందిన 9వ తరగతి 142 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మంత్రి విద్యార్థులతో మమేకమై కొంతసేపు సరదాగా గడిపారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు మేలు జరిగేలా పనిచేస్తున్నాననే సంతృప్తి ఉందని, వ్యక్తిగత లాభం కోసం ఎప్పుడూ పనిచేయలేదన్నారు. నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన అవకాశానికి కృతజ్ఞతగా రోజుకు 18 గంటలపాటు శ్రమిస్తూ అభివృద్ధి పనులకు నిధులు తీసుకువస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సిఎస్ఆర్ నిధుల ద్వారా కూడా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని చెప్పారు.


నియోజకవర్గంలో 9వ తరగతి విద్యార్థులకు దశలవారీగా సైకిళ్లు అందజేస్తామని మంత్రి వెల్లడించారు. అలాగే ధర్మారావు ఫౌండేషన్ ద్వారా చలివేంద్రాలు, ఉచిత భోజనాలు, రక్తదాన శిబిరాలు, ఆరోగ్య శిబిరాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయం వంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని వివరించారు.కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. చెట్టినాడ్ సిమెంట్ సంస్థ ప్రతినిధులను మంత్రి సన్మానించగా, విద్యార్థులు మంత్రికి ఘన స్వాగతం పలికారు.

## కుల వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడిన గొప్ప వ్యక్తి మహాత్మ జ్యోతి బా ఫూలే



గుంటూరు, ఏప్రిల్ 11(మనం న్యూస్ ప్రతినిధి): అస్పృశ్యత, కుల వివక్ష, బాల్య వివాహాలు వంటి సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతి బా పూలే అని జిల్లా కలెక్టర్ సి.యం సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి సందర్భంగా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో మహాత్మా జ్యోతి బా పూలే చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ సి.యం సాయికాంత్ వర్మ , జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పూలే ఆలోచన విధానం నేటి విద్యావ్యవస్థ బలోపేతం చేయడానికి, బాలికా విద్య పట్ల ప్రత్యేక చర్యలు చేపట్టడానికి దోహదం చేశాయన్నారు. సమాజంలో దురాగతాలను రూపుమాపుటకు బాటలు వేసిన మహనీయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సేవకు సత్కారం భక్తి వైభవంలో సర్పంచ్ శిరీష చంటి దంపతులకు ఘన సన్మానం



పోడూరు ఏప్రిల్ 11 మనంన్యూస్ : పోడూరు మండలం జగన్నాధపురం గ్రామంలో శ్రీ రామాలయం మొదటి వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఆ గ్రామం భక్తి, ఆనందాలతో నిండిపోయింది. ఒకటో నెంబర్ పాఠశాల సమీపంలోని ఆలయ ప్రాంగణం జనసందోహంతో కళకళలాడగా, ప్రతి మూలలో భక్తి గానాలు, హారతుల సువాసనలు ప్రత్యేక ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించాయి. ఈ పవిత్ర సందర్భంలో గ్రామ సర్పంచ్ గా ఇటీవలే పదవీ విరమణ చేసిన గుడాల శిరీష-చంటి దంపతులను ఆలయ కమిటీ పెద్దలు, యువత కలిసి దుస్సాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అలాగే వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన అఖండ అన్నసమారాధన కార్యక్రమం గ్రామ ప్రజల హృదయాలను హత్తుకుంది. చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరు భక్తి భావంతో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించగా,అన్నదానం మహాదానం అనే మాటకు నిజమైన అర్థం కనిపించింది. సేవాభావంతో ముందుకు వచ్చిన యువత, కమిటీ సభ్యుల కృషి ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు భావోద్వేగంతో మాట్లాడుతూ, 2021 నుంచి 2026 వరకు సర్పంచ్గా గుడాల శిరీష-చంటి దంపతులు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. గ్రామంలో రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనలో వారు చూపిన పట్టుదల ప్రతి కుటుంబానికీ ఉపశమనం కలిగించిందని తెలిపారు. ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి పరిష్కారం చూపిన నాయకత్వం అరుదుగా కనిపిస్తుందని, అలాంటి సేవామూర్తులను సన్మానించడం గ్రామానికి గర్వకారణమని అన్నారు. యువత మాట్లాడుతూ,మాకు మార్గదర్శకులుగా నిలిచిన నాయకులు వీరే అని చెప్పడం అక్కడి వాతావరణాన్ని మరింత భావోద్వేగభరితంగా మార్చింది.

సన్మానం స్వీకరించిన సర్పంచ్ గుడాల శిరీష-చంటి దంపతులు కూడా హృదయపూర్వకంగా స్పందిస్తూ, గ్రామ ప్రజలు చూపుతున్న ప్రేమ, ఆదరణ తమకు అపారమైన బలం అని తెలిపారు.ఈ గౌరవం మా కృషికి మాత్రమే కాదు, మా మీద విశ్వాసం ఉంచిన ప్రతి గ్రామస్థుడి ఆశీస్సులకు ప్రతీక అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, యువత, మహిళలు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## యూనియన్ బ్యాంక్ ఎదురుగా చలివేంద్ర కేంద్రం ఏర్పాటు

- **ప్రజలు దాహార్తిని తీర్చేందుకు ముందుకొచ్చిన వారధి**
- **చలివేంద్రం అనేది దాహాన్ని తీర్చడమే కాదు**
- **మనుషుల్ని కలిపే మానవత్వం చిహ్నం**
- **వారధి ప్రెస్ క్లబ్**



కుక్కునూరు, ఏప్రిల్ 11(మనం న్యూస్)ః స్థానిక మండలం కేంద్రంలో ఈ మండే వేసవి దృష్ట్యా మండల ప్రజల దాహార్తిని తీర్చేందుకు వారధి ప్రెస్ క్లబ్ ముందుకొచ్చింది. జనసంచారం ఎక్కువగా ఉండే యూనియన్ బ్యాంకు ప్రాంగణంలో నీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. అక్కడ బ్యాంక్ సిబ్బంది ఖాతాదారులకు కనీసం మంచినీటి సౌకర్యం కూడా ఏర్పరచలేదు. ఆ విషయం వారధి ప్రెస్ క్లబ్ దృష్టికి రాగా వెంటనే స్పందించి అందుకు అనుగుణంగా శనివారం నాడు ఈ చలివేంద్రం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా వారధి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సమయమంతుల లక్ష్మణస్వామి మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాళ్లకు న్యాయం చేసే వారధి లాగా పని చేయాలనే ఉద్దేశంతోనే ప్రెస్ క్లబ్ కు వారధి ప్రెస్ క్లబ్ గా నామకరణం చేయడం జరిగిందని అని తెలిపారు. యూనియన్ ఉపాధ్యక్షులు నిమ్మల ప్రసాద్ మాట్లాడుతూ ఈ వేసవిలో ఎండలు తీవ్ర రూపం దాల్చడంతో అటు ప్రయాణికులు ఇటు ప్రజల దాహార్తి దృష్టా చలి వేంద్రం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ యూనియన్ భవిష్యత్తులో ఇలాంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. అలానే గౌరవ సలహాదారులు మంత్రి గోపాలకృష్ణ మాట్లాడుతూ ఎండాకాలంలో అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని,తలకు టోపీ, కళ్లకు అద్దాలు ధరించాలని తెలిపారు.వేసవిలో ఎక్కువగా పలుచని మజ్జిగ, నిమ్మరసం వంటి పానీయాలు తాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నిమ్మల ప్రసాద్, సెక్రటరీ షేక్ చాంద్ పాషా, గౌరవ అధ్యక్షులు టీ శ్రీనివాసరావు, డి మణికంఠ, గౌరవ సలహాదారులు మంత్రి గోపాలకృష్ణ, ట్రెజరర్ చిన్ని, జాయింట్ సెక్రెటరీ ఎస్ దుర్గాప్రసాద్, క్లబ్ సభ్యులు వి.విశ్వనాథం,పి వేణు, బి చైతన్య ,తదితరులు పాల్గొన్నారు.

# కాల్పుల విరమణ తర్వాత..
## భారత్‌కు తొలి ఎల్‌పీజీ ట్యాంకర్..!

ముంబయి, ఏప్రిల్ 11: గల్ఫ్ నుంచి భారీ ఎల్‌పీజీ లోడ్‌తో భారత్‌కు బయల్దేరిన మరో నౌక 'జగ్ విక్రమ్' హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత జలసంధిని దాటిన ఈ నౌక ఈ మధ్యాహ్నానికి గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లోకి ప్రవేశించింది. మరికొద్ది రోజుల్లో ఇది భారత్‌కు చేరుకోనుంది. అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ ప్రకటించిన తర్వాత హర్మూజ్‌ను దాటిన మొట్ట మొదటి నౌక ఇదే. ఈ గ్యాస్ ట్యాంకర్ 20,000 టన్నుల ఎల్‌పీజీని తీసుకురానుంది. జలసంధిని దాటడానికి అనుమతి కోసం జగ్ విక్రమ్ వారం రోజులకు పైగా గల్ఫ్ జలాల్లో ఎదురుచూసినట్లు షిప్పింగ్ డేటా నివేదికలు వెల్లడించాయి. ఈ ట్యాంకర్ ముంబయిలోని గ్రేట్ ఈస్టర్న్ షిప్పింగ్ కంపెనీ యాజమాన్యానికి చెందినదిగా తెలుస్తోంది. మరో 15 భారత రిజిస్టర్డ్ నౌకలు పర్షియన్ గల్ఫ్‌లోనే ఉన్నాయని.. త్వరలో అవి కూడా ఇదే మార్గం గుండా భారత్‌కు చేరుకునే అవకాశం ఉందని నివేదికలు పేర్కొన్నాయి. వాటిలో ఒక ఎల్‌పీజీ గ్యాస్ ట్యాంకర్, నాలుగు ముడి చమురు ట్యాంకర్లు, ఒక ఎల్‌ఎన్‌జీ ట్యాంకర్, ఒక రసాయన ఉత్పత్తుల ట్యాంకర్, మూడు కంటైనర్ నౌకలు, రెండు బల్క్ క్యారియర్లు, మూడు ఇతర నౌకలు ఉన్నట్లు తెలుస్తోంది



# 39 రోజుల్లో.. 39 విమానాలను కోల్పోయిన అమెరికా..!



వాషింగ్టన్, ఏప్రిల్ 11: ఇరాన్‌పై చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో అమెరికా సైన్యానికి భారీ నష్టం జరిగినట్లు తెలుస్తోంది. దాదాపు 39 రోజులు కొనసాగిన ఈ యుద్ధంలో అగ్రరాజ్యానికి చెందిన 39 విమానాలను ఇరాన్ ధ్వంసం చేసినట్లు సమాచారం. ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై అగ్రరాజ్యం విరుచుకుపడటంతో పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు చెలరేగాయి. ఇరాన్ ప్రతీకార దాడులతో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. ఐదు వారాలకు పైగా కొనసాగిన ఈ ఘర్షణల్లో.. యూఎస్‌కు చెందిన 39 విమానాలు ధ్వంసమైనట్లు తెలుస్తోంది. మరో 10 విమానాలు వివిధ స్థాయిల్లో దెబ్బతిన్నట్లు సమాచారం. మీడియా ప్రకారం కూలిన వాటిల్లో.. ఒక ఏ-10, నాలుగు ఎఫ్-15 స్ట్రైక్ ఈగిల్ యుద్ధవిమానాలు ఉన్నాయి. ఇరాన్ గగనతలంలో అమెరికా ఎఫ్-35 స్టెల్త్ యుద్ధవిమానం ఒకటి దెబ్బతింది. అగ్రరాజ్యం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఈ ఐదోతరం యుద్ధ విమానం పోరాటంలో శత్రు దాడికి గురికావడం ఇదే తొలిసారి.

సౌదీ అరేబియాలోని ఓ వైమానిక స్థావరంపై ఇరాన్ జరిపిన క్షిపణి దాడిలో.. ఐదు కేసీ-135 రీఫ్యూయలింగ్ విమానాలు దెబ్బతిన్నాయి. అయితే, వాటిల్లో కొన్నింటికి మరమ్మతులు చేశారు. సౌదీ వైమానిక స్థావరంపై జరిగిన దాడిలో అగ్రరాజ్యానికి చెందిన అత్యాధునిక 'బోయింగ్ ఈ-3 సెంట్రీ నిఘా విమానం కూడా తీవ్రంగా ధ్వంసమయ్యింది. ఇక, యూఎస్‌కు చెందిన నాలుగు ఫైటర్ జెట్లు కూడా కూలిపోయాయి. వీటిల్లో మూడు కువైట్లో జరిగిన 'ఫ్రెండ్లీ ఫైర్'లో భాగంగా కూలినట్లు యూఎస్ సెంటకామ్ పేర్కొంది. కువైట్లోని అమెరికా స్థావరంపై జరిగిన డ్రోన్ దాడిలో ఒక ఇఏ-47 చినూక్ హెలికాప్టర్ ధ్వంసమైందని ఇరాన్ మీడియా పేర్కొంది. ఇవికాక.. ఈ ఘర్షణల్లో అమెరికాకు చెందిన డ్రోన్ విభాగానికి భారీగా నష్టం జరిగింది. దాదాపు 24 రీపర్ డ్రోన్లు ధ్వంసమయ్యాయి.

# నర్మదలోకి 11,000 లీటర్ల పాలు

- పర్యావరణవేత్తల గగ్గోలు



భోపాల్, ఏప్రిల్ 11: మధ్యప్రదేశ్‌లోని సీహోర్ జిల్లా భైరూందా వద్ద 21 రోజులపాటు నిర్వహించిన ఓ ఆధ్యాత్మిక కార్యక్రమం అనంతరం 11,000 లీటర్ల పాలను నర్మదానదిలోకి వదలడంపై పర్యావరణవేత్తలు గగ్గోలు పెడుతున్నారు. నదిలోని నీటి స్వచ్ఛత కోసం ప్రార్థనలు చేశాక ట్యాంకర్లతో తెచ్చిన పాలను నర్మదకు సమర్పించినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఈ పాలు సేంద్రియ కాలుష్య కారకంగా మారి నీటిలో ఆక్సిజన్ క్షీణిస్తుందని నర్మద నీటిపై ఆధారపడిన స్థానికులు, జలచరాలు ఇబ్బందిపడే ప్రమాదముందని పర్యావరణవేత్త అజయ్ దూబె ఆందోళన వ్యక్తం చేశారు.

### వెనక్కి వచ్చి.. రాహుల్ గాంధీతో
## ప్రధాని నరేంద్ర మోడీ మాటామంతి



ఢిల్లీ , ఏప్రిల్ 11: పార్లమెంట్ ప్రాంగణంలో శనివారం ఉదయం ఓ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ఎప్పుడూ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకొనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ- కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో కొద్దిసేపు ముచ్చటించారు. ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

జ్యోతిబా పూలే 200వ జయంతి సందర్భంగా నివాళులర్పించేందుకు రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు నాయకులు పార్లమెంట్ ప్రాంగణంలోని ప్రేరణా స్థల్‌కు వచ్చారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభాపక్ష నేత జేపీనడ్డా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర నేతలను ప్రధాని మోడీ పలకరించి, ముందుకువెళ్లారు. మళ్లీ వెనక్కి వచ్చి రాహుల్ గాంధీతో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రస్తుతం పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒకదానిపై ఒకటి తీవ్ర విమర్శలు చేసుకుంటున్న ఈ సమయంలో వీరిమధ్య చోటుచేసుకున్న ఈ చిన్నపాటి సంభాషణ చర్చనీయాంశమైంది.

# ఇరాన్‌కు చైనా ఆయుధాల సరఫరా?

- అంతర్జాతీయ మీడియా కథనాలు



వాషింగ్టన్, ఏప్రిల్ 11: పశ్చిమాసియా ఘర్షణల్లో చైనా ఇరాన్‌కు రహస్యంగా సాయం చేస్తున్నట్లు ఇదివరకే పలు వార్తలు వచ్చాయి. ప్రస్తుతం అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చల నేపథ్యంలో చైనా టెహ్రాన్‌కు భారీగా ఆయుధాలు సరఫరా చేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మనిషి భుజం మీద పెట్టుకొని క్షిపణులను ప్రయోగించే షార్ట్ రేంజ్ మిసైల్ లాంచర్లను, ఇతర క్షిపణి వ్యవస్థలను టెహ్రాన్‌కు సరఫరా చేయడానికి బీజింగ్ ప్రణాళిక రచిస్తున్నట్లు తెలిపాయి. వారం రోజుల్లో ఇవి ఆ దేశానికి చేరే అవకాశం ఉందన్నాయి. తన పేరు బయటకురాకుండా ఉండేందుకు చైనా ఈ ఆయుధాలను ఇతర దేశాల మీదుగా పంపుతున్నట్లు పేర్కొన్నాయి. అంతేకాకుండా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అమెరికా యుద్ధనౌకలు, విమానాలు, ఇతర సైనిక స్థావరాల సమాచారాన్ని బీజింగ్.. ఇరాన్ కు చేరవేస్తోందని మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ వార్తలను వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం ఖండించింది. ఇవన్నీ తప్పుడు వార్తలని, తాము ఎవరికీ ఆయుధాలు ఇవ్వలేదని వెల్లడించింది. మరోవైపు ఇటీవల అమెరికా-ఇరాన్ మధ్య జరిగిన కాల్పుల విరమణ వెనక కూడా చైనా పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. 'చర్చల వెనక చైనా ఉంది' అని కాల్పుల విరమణ అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. అయితే అధికారిక ప్రకటనలో మాత్రం బీజింగ్ పేరును ఆయన ప్రస్తావించకపోవడం గమనార్హం.

# రాజకీయాల్లో రీటేక్స్ ఉండవు..
## కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం



చెన్నై, ఏప్రిల్ 11: తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. టీవీకే చీఫ్, నటుడు విజయ్ రాజకీయ ప్రవేశంపై కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలు యాక్టింగ్ చేసినంత సులువు కాదని, రీటేక్స్ ఉండవని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తమిళనాడులో నిర్వహించిన ఓ ర్యాలీలో ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

''రాజకీయాలు అంత సులభం కావు. నటుడు విజయ్ కొత్తగా రాజకీయ పార్టీ పెట్టారు. ఆయనకు ఈ రంగంలో అనుభవం లేదు. రాజకీయాల్లో 20 ఏళ్లుగా కొనసాగుతున్నా. కాంగ్రెస్ నేతృత్వంలో పలు కేంద్ర పదవులు చేపట్టాను. సినిమాల్లా రాజకీయాలు ఉండవు. సినిమా సెట్లో నటీనటులు చేసిన సీన్లు సరిగా రాకుంటే సరిదిద్దుకోవచ్చు. డైరెక్టర్లు మరో టేక్ తీస్తారు. కానీ రాజకీయాలు అలా కాదు. ఇక్కడ రీటేక్స్ ఆప్షన్ ఉండదు. ఒకే నిర్ణయం ఉంటుంది. దాన్నే కొనసాగించాలి. ప్రజల కోసమే పనిచేయాలి'' అని అన్నారు.

తమిళనాడులో శుక్రవారం టీవీకే నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆ పార్టీ చీఫ్ విజయ్ మాట్లాడకపోవడాన్ని చిదంబరం తప్పుపట్టారు. రాజకీయాలంటేనే మాట్లాడటమని, ప్రజలతో మమేకం కావాలని గుర్తుచేశారు. 'నేను ఏ సమయంలోనైనా ప్రజల చెంతకు వస్తాను. కారులో ఒంటరిగా ప్రయాణిస్తాను. వారికి సంబంధించిన ఏ అంశాన్నైనా చర్చించేందుకు సిద్ధంగా ఉంటాను' అని వెల్లడించారు.

# 2 నెలల గాలింపు.. 100 ఫోన్ల ట్రాకింగ్
## పోలీసులకు చిక్కిన 'డ్రగ్ క్వీన్'



ఢిల్లీ, ఏప్రిల్ 11: దేశ రాజధానిలో మాదక ద్రవ్యాల నెట్‌వర్క్‌ను నడుపుతూ 'డ్రగ్ క్వీన్'గా పేరుపొందిన కుసుమ్ అనే మహిళను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎన్నోఏళ్లుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంటున్న ఆమె ఆచూకీ కోసం పోలీసులు రెండు నెలల క్రితం సీక్రెట్ ఆపరేషన్ చేపట్టారు. వారాలతరబడి 200 సీసీటీవీ కెమెరాలు, 100 ఫోన్లను ట్రాక్ చేశారు. తాజాగా ఢిల్లీలో షాదారా ప్రాంతంలోని ఓ ఇంట్లో కుసుమ్ ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. నిందితురాలిపై 11 కేసులు, రూ.50వేల రివార్డు ఉన్నట్లు పేర్కొన్నారు.

### డ్రగ్స్ అమ్మే వ్యక్తి నుంచి డ్రగ్ క్వీన్‌గా...

గతంలో కుసుమ్ ఢిల్లీలోని సుల్తాన్‌పురిలో డ్రగ్స్ విక్రయిస్తూ గ్యాంగ్‌స్టర్‌లతో కలిసి పని చేసేది. క్రమంగా సొంత డ్రగ్ సిండికేట్‌ను ఏర్పాటుచేసుకొంది. ఢిల్లీలో హత్యలు, దోపిడీ, మాదకద్రవ్యాల దందాను చురుగ్గా నడిపిస్తోంది. అక్రమంగా కోట్ల రూపాయలు సంపాదించింది. పలు రాష్ట్రాలలోని మాదకద్రవ్యాల ముఠాలు ఆమె నేతృత్వంలోనే నడుస్తున్నాయి.

ఆమె ఇద్దరు కుమార్తెలు, సోదరుడు కూడా ఇదే సిండికేట్లో పని చేస్తున్నారు. ఎక్కడా తనకు వ్యతిరేకంగా ఆధారాలు లేకుండా జాగ్రత్త పడేది. ఆమెపై అనుమానం ఉన్నప్పటికీ.. అదుపులోకి తీసుకోవడం పోలీసులకు సాధ్యం కాలేదు. 2003 నుంచి పోలీసులు ఆమె కోసం గాలిస్తున్నారు. వారు దాడులు చేపట్టిన ప్రతిసారీ కుసుమ్ మాయమైపోయేది. ఫోన్‌ను ఉపయోగించకుండా.. కొత్త ప్రదేశాల్లో తలదాచుకుంటూ ఉండేది.

# '30 నిమిషాల్లో పేల్చేస్తాం'.. హార్మూజ్ వద్ద అమెరికా యుద్ధ నౌకకు ఇరాన్ వార్నింగ్



వాషింగ్టన్, ఏప్రిల్ 11: పాకిస్తాన్లో ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు జరుగుతున్న వేళ, హార్మూజ్ జలసంధి వద్ద అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. జలసంధిని దాటేందుకు ప్రయత్నించిన అమెరికా యుద్ధ నౌకను ఇరాన్ తీవ్రంగా హెచ్చరించింది. 'హార్మూజ్ దాటితే 30 నిమిషాల్లోనే పేల్చేస్తాం' అని ఇరాన్ సైనికాధికారులు వార్నింగ్ ఇవ్వడంతో అమెరికా నౌక వెనక్కి తగ్గిందని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి.

### జలసంధిని క్లియర్ చేస్తున్నాం: ట్రంప్

అయితే, ఇరాన్తో ఎలాంటి సమన్వయం లేకుండానే పలు అమెరికా నావికాదళ నౌకలు శనివారం జలసంధిని దాటాయి. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇలా జరగడం ఇదే తొలిసారి. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ స్పందిస్తూ.. ప్రపంచ దేశాల చమురు సరఫరాకు ఆటంకం కలగకుండా తామే చొరవ తీసుకుని హార్మూజ్ జలసంధిని క్లియర్ చేస్తున్నామని తెలిపారు. ఇరాన్ సహకారం ఉన్నా లేకున్నా జలసంధి త్వరలోనే పూర్తిస్థాయిలో తెరుచుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.

# ధనిక, పేద దేశాల మధ్య మరింత పెరుగుతున్న అంతరం



ఢిల్లీ, ఏప్రిల్ 11 : అంతర్జాతీయంగా ధనిక, పేద దేశాల మధ్య అంతరం ఇంకా పెరుగుతోందని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. ప్రపంచ ఆర్థిక సంస్థల్లో జరుగుతున్న మార్పులతో సహా, గతేడాది అనేక దేశాలు వాగ్దానం చేసిన కీలక సంస్కరణలు చాలా వరకు అమలు కాకపోవడంతో, ధనిక, పేద దేశాల మధ్య అంతరం మరింత ఎక్కువగా ఉందని తాజా నివేదికలో పేర్కొంది. ఈ సందర్భంగా 2030 నాటికి పేదలను అభివృద్ధిలోకి తీసుకురావాలనే 2015 నాటి ఐక్యరాజ్యసమితి లక్ష్యాలను నివేదిక ప్రస్తావించింది. దీనికోసం పని చేయాలని గతేడాది జరిగిన సమావేశంలోనూ అన్ని దేశాలు తీర్మానం చేశాయి.

### తొలిసారి పేద దేశాలకు తగ్గిన ఆర్థిక సాయం

ఈ సందర్భంగా ప్రపంచ వృద్ధిని పెంచేందుకు తమ సంస్థ చర్యలు సిద్ధం చేస్తోందని, అయితే ఇరాన్ యుద్ధం ఇప్పుడు ప్రపంచ ఆర్థిక దృక్పథానికి సవాలుగా మారిందని ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివా అన్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో జరుగుతున్న యుద్ధం వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాల సమస్యలు ఇంకా పెరుగుతున్నాయి. ఫలితంగా ఆయా దేశాలు ఆర్థిక వనరులను, పెట్టుబడులను సాధించడంలో వెనుకబడతాయి. అంతర్జాతీయ సహకారం తగ్గుముఖం పడుతుంది. ఈ పరిణామాల వల్ల 2025లో పేద దేశాల సహాయానికి కేటాయించే నిధులను 25 దేశాలు తగ్గించేశాయి. ఈ స్థాయిలో పేద దేశాలకు ఆర్థిక సాయం తగ్గడం ఇదే మొదటిసారి. ముఖ్యంగా అగ్రరాజ్యం అమెరికా 59 శాతం పేద దేశాలకు అందించే సాయం తగ్గించింది. ఈ ఏడాది కూడా ఈ ఆర్థిక సహాయం మరో 5.8 శాతం క్షీణించవచ్చని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ లీ జున్హువా అభిప్రాయపడ్డారు.

# హార్మూజ్ను దాటిన అమెరికా యుద్ధనౌకలు



పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభానికి ముగింపు పలికే లక్ష్యంతో అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు కొనసాగిస్తున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికాకు చెందిన రెండు యుద్ధనౌకలు హర్మూజ్ జలసంధిని దాటినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. ఇరాన్తో యుద్ధం మొదలైన తర్వాత అమెరికా నౌకలు హర్మూజ్ను దాటడం ఇదే తొలిసారి. ఈ జలసంధిని తెరిచే ప్రయత్నం చేస్తున్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

మరోవైపు, హర్మూజ్ను తెరిచే ప్రయత్నం చేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. చైనా, జపాన్, ఫ్రాన్స్ వంటి దేశాలకు సాయం చేస్తున్నామన్నారు. స్వతహాగా ఈ పనిచేసే ధైర్యం ఆయా దేశాలకు లేదని విమర్శించారు. అత్యంత కీలకమైన ఈ జలసంధిలో ఇరాన్ అమర్చిన మందుపాతరలతో (సీమైన్స్) ముప్పు ఉందన్నారు. అయినప్పటికీ, ఈ యుద్ధంలో ఇరాన్ భారీగా నష్టపోతోందని ఉద్ఘాటించారు.

# పాకిస్తాన్ మాత్రమే అటువంటి పాత్ర పోషిస్తుంది
## మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్

ఢిల్లీ, ఏప్రిల్ 11 : అమెరికా-ఇరాన్ల మధ్య పాకిస్థాన్ వేదికగా శాంతి చర్చలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాలపై కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ తనదైన శైలిలో స్పందించారు. ఈ విషయంలో భారత్.. పాకిస్తాన్ తో పోటీ పడుతున్నట్లు భావించడం లేదన్నారు. మధ్యవర్తిత్వం ఎవరు వహించారనేది ముఖ్యం కాదని, శాంతి నెలకొల్పడమే ప్రధాన అంశమన్నారు. ఈ సందర్భంగా పాక్ ప్రధాని ఇటీవల సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్టును ప్రస్తావిస్తూ.. అమెరికా, పాక్ సంబంధాల గురించి అందరికీ తెలిసిందేనని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. 'వాషింగ్టన్తో పాకిస్థాన్కు ఎటువంటి సంబంధం ఉందో మీకు తెలుసా? పాక్ ప్రధాని ఇటీవల పోస్టు చేసిన ట్వీట్ అమెరికా రూపొందించిందనే ఆరోపణలు ఉన్నాయి. ఆ హెడింగ్ చూస్తేనే అందరికీ అర్థమవుతుంది. అందులో వాడిన భాష కూడా అమెరికాదే. అందులో కొన్ని పదాలు ట్రంప్ ఉపయోగించేవే. వాషింగ్టన్ విషయంలో పాక్ పోషించిన పాత్రను వేరే ఏ దేశం కూడా పోషించలేదు'' అని థరూర్ పేర్కొన్నా ఇరాన్తో దాదాపు 900 కి.మీ సరిహద్దు పాకిస్థాన్కు ఉందని, ఒకవేళ సంక్షోభం మరింత ముదిరితే శరణార్థుల తాకిడి ఆ దేశానికి ఎక్కువగా ఉంటుందని థరూర్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మనతో పోలిస్తే పాకిస్థాన్ ఆశించే ప్రయోజనాలు వేరని పేర్కొన్నారు. చర్చల ఫలితమే భారత్ కు ముఖ్యమని, అవి ఎలా జరిగాయనే విషయం కాదన్నారు. మధ్యవర్తిత్వం ఎవరు వహిస్తారన్నది ముఖ్యం కాదన్నారు.

# నాపై తప్పుడు కేసులు పెట్టేందుకు యత్నం
## పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ



కోల్‌కతా, ఏప్రిల్ 11: భవానీపూర్ నుంచి తన అభ్యర్థిత్వాన్ని రద్దు చేయించడానికి భాజపా ప్రయత్నించిందని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ (ఇక ఛ్రుఘ్బు అబ్భుట్బ్బు) ఆరోపించారు.. తనపై తప్పుడు కేసులు పెట్టడానికి ఆ పార్టీ నేతలు ఈసీతో కలిసి కుట్ర పన్నారని అన్నారు. ఈ ప్రయత్నాలను తమ పార్టీ నేతలు భగ్నం చేశారన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడి ఎన్నికల్లో గెలిచే ధైర్యం లేక.. మోసపూరిత మార్గాల్లో ఓట్లు రాబట్టుకోవడానికి కుట్ర పన్నుతున్నారని అన్నారు. అందుకే 'సర్' పేరుతో వేల సంఖ్యలో ఓటర్ల పేర్లను తొలగించారని మమత ఆగ్రహం వ్యక్తం చేశారు. 90లక్షల మంది ఓటర్ల పేర్లను ఈసీ ఓటరు జాబితా నుంచి తొలగించిందని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ఈవీఎంలలో అవకతవకలకు పాల్పడడానికి కూడా ఈసీతో కలిసి, బీజేపీ ప్రణాళికలు రచిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల ప్రజాస్వామ్య హక్కులను హరించడానికే బెంగాల్లో యూనిఫామ్ సివిల్ కోడ్‌ను అమలు చేయాలని బీజేపీ చూస్తోందని మమత ఆరోపించారు. ఇది వెనుకబడిన వర్గాలకు వ్యతిరేకంగా ఉంటుందన్నారు. బెంగాల్లో యూసీసీని ఎన్నటికీ అమలు కానివ్వమన్నారు.

# గజ్వేల్ రింగ్ రోడ్డు పూర్తికి చర్యలు

- కొద్దిపాటి పనుల వల్ల నిరుపయోగంగా ఉంది
- రైతును ఒప్పించి సంగాపూర్ జంక్షన్ పూర్తికి చర్యలు
- రఘునందన్ రావు, మెదక్ ఎంపీ




గజ్వేల్, ఏప్రిల్ 11(మనంన్యూస్)ః వందల కోట్ల వ్యయంతో నిర్మించిన గజ్వేల్ రింగ్ రోడ్డు కొద్దిపాటి అసంపూర్తి పనుల వల్ల నిరుపయోగంగా ఉందని ఈ పనులను పూర్తి చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. గజ్వేల్ లో శనివారం ఆయన అసంపూర్తి రింగ్ రోడ్ పనులను తెలుసుకోవడానికి క్షేత్రస్థాయిలో స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ గజ్వేల్ పట్టణ అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యలను పరిగణలోకి తీసుకొని రింగురోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. చిన్న చిన్న అసంపూర్తి పనులు ఉండడంతో నిరుపయోగంగా మారిందని పేర్కొన్నారు. ముఖ్యంగా వర్గల్ గజ్వేల్ రోడ్డు సంఘాపూర్ జంక్షన్ అసంపూర్తి వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయని గజ్వేల్ కు ట్రాఫిక్ సమస్య కూడా తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. ఈ జంక్షన్ పూర్తిచేస్తే గజ్వేల్ పట్టణంలో భారీ వాహనాల రాకపోకలు రింగ్ రోడ్డు గుండా వెళ్తాయని పేర్కొన్నారు. దీన్ని పూర్తి కోసం సంబంధిత రైతు రామచంద్రంతో చర్చించి భూసేకరణ పూర్తి చేయడానికి చర్యలు చేపడతామన్నారు. ఇటీవల నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రిని గజ్వేల్ రింగ్ రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరడం జరిగిందని ఆయన సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలకు ఆదేశాలు జరిపిస్తానని పేర్కొన్నారన్నారు. రామచంద్రంతో స్థానిక రెవెన్యూ అధికారులు చర్చించి భూమికి సరైన పరిహారం అందే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఆయన అభిప్రాయం పరిగణలోకి తీసుకొని భూమికి భూమి లేదా న్యాయపరంగా అందవలసిన నగదు అందించడానికి చర్యలు చ పట్టాలని అధికారులను ఆదేశించారు. అయితే ఆయన ఒప్పుకోకపోతే రెవెన్యూ 123 సెక్షన్ ప్రకారం రైతు భూసేకరణ ఎలా సేకరించాలన్నది పరిగణలోకి తీసుకొని రింగ్ రోడ్డు పనుల పూర్తికి చర్యలు చేపడతామని అన్నారు. రఘునందన్ రావు రింగ్ రోడ్డు పెండింగ్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, కౌన్సిలర్ శ్రీనివాస్, సింగం సత్తయ్య, మనోహర్ యాదవ్, అశోక్ గౌడ్ వెంకటరెడ్డి ఎల్లురామిరెడ్డి, నలగామ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు




తిరుమలగిరి, ఏప్రిల్ 11 (మనం న్యూస్)ః మండల కేంద్రంలోని పులి అంబేద్కర్ చౌరస్తాలో జ్యోతిబాపూలే 199 జయంతిని సామాజిక తెలంగాణ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పూలే విగ్రహానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు పూలమానులు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను తన భార్య సావిత్రి సావిత్రికి చదువు నేర్పి ఉపాధ్యాయారాలని రైతులు, మహిల కార్మిసం రాత్రి పాఠశాలలు ప్రతి విద్యను బోధించి ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపాడని కొనియాడారు. జ్యోతిబాపూలే సాంఘిక విప్లవ పితామహుడు' అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సుంకరి జనార్ధన్, వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిలాల్, బత్తుల శ్రీను, కందుకూరి లక్ష్మయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సమానత్వం కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే

- జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

నల్లగొండ, ఏప్రిల్ 11 (మనం ప్రతినిధి)ః సమానత్వం, సామాజిక న్యాయం ,నాణ్యమైన విద్య కై కృషి చేసిన మహాత్మ జ్యోతిబాపూలే ఆశయాల స్ఫూర్తి భావితరాలకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ వద్ద నిర్వహించిన మహాత్మ జ్యోతిబా పూలే 'ద్వి శతాబ్ది' ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, ఆహుతులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాల వారి అభివృద్ధి కి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, ప్రత్యేకించి విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ లతోపాటు, నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని వసతి గృహాలలో ఇంకా సౌకర్యాలు అభివృద్ధి చేయాల్సి ఉందని ఆయన చెప్పారు. విద్యాభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున 200 కోట్ల రూపాయల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నదని, ఇందులో ఒకేసారి 2,600 పిల్లలు చదువుకోవచ్చని అన్నారు. అలాగే నియోజకవర్గానికి ఒక తెలంగాణ మోడల్ స్కూల్ ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు వెల్లడించారు. ఈ పాఠశాలలో విద్యార్థులు ఇంటి వద్ద నుండి బస్సులో తీసుకువెళ్లే సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని తెలిపారు. వెనుకబడిన తరగతుల వారికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతున్నదని, ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద జిల్లాలో 12 మందికి ఆర్థిక సహాయం అందించడం జరిగిందని, అలాగే కులాంతర వివాహం చేసుకున్న 21 మంది లబ్ధిదారులకు ఆర్థిక సహకారం అందించడం జరిగిందని చెప్పారు .అలాగే వెనుకబడిన తరగతుల సంఘాల ప్రతినిధులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని, విద్యార్థులు బాగా చదువుకోవాలని, మహాత్మ జ్యోతిబాపూలే ఆశయ సాధనకు కృషి చేయాలని, ప్రశ్నించే మనస్తత్వాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా ఆరోగ్య వారోత్సవాలను నిర్వహించడం జరుగుతున్నదని, ఇందులో భాగంగా శనివారం క్లాక్ టవర్ చౌరస్తానుండి నో డ్రగ్స్ క్యాంపెయిన్ కింద ర్యాలీ నిర్వహించినట్లు కలెక్టర్ వెల్లడించారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబాపూలే సంఘసంస్కర్త మాత్రమే కాదని ,మహిళా చదువు కోసం పోరాటం చేసిన వ్యక్తిఅని ,సమాజంలో అందరూ సమానమని, సమానంగా ఉండాలని ఆలోచించారని మహిళా విద్యకై కృషి చేసిన మహనీయుడని ,వారి జీవిత చరిత్రను విస్తృతంగా విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎమ్మెల్సీ నెలకుంటి సత్యం మాట్లాడుతూ సుమారు 200 సంవత్సరాలకు పూర్వం సమాజంలో పాతుకుపోయిన కులవివక్షతకు వ్యతిరేకంగా మహాత్మ జ్యోతిబాపూలే కృషి చేశారని ,కుల వ్యవస్థ నిర్మూలనకు దేశంలో అనేక ఉద్యమాలు జరిగాయని అన్నారు. ఆ రోజుల్లో చదువుకునేందుకు అవకాశం కూడా లేని వారికి ప్రత్యేకించి మహిళలకు విద్యను అందించేందుకు జ్యోతిబాపూలే కృషి చేశారని, సమాజ చైతన్యానికి విద్యనే ముఖ్యమని భావించారని అన్నారు. ఎన్నో ఉద్యమాలు జరిగినప్పటికీ దేశంలో ఇంకా కుల వ్యవస్థ కొనసాగుతున్నదని, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా మహాత్మ జ్యోతిబాపూలే ని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రస్తుతం కేటాయిస్తున్న బడ్జెట్ సరిపోదని. అధిక నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని ,అలాగే బిసి రిజర్వేషన్, మహిళల ఉపకోట కోసం పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. విశ్రాంత ఐఏఎస్ చోల్లేటి ప్రభాకర్ ,వున్న కైలాస్ నేత, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,



మరగౌనినవీన్ గౌడ్, అడిషనల్ ఎస్పీ రమేష్, జెడ్పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి ,బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు చెక్కిలం రామరాజు ,దుడుకు లక్ష్మీనారాయణ, పాలడుగు నాగార్జున, కొండూరు సత్యనారాయణ, నేలపట్ల సత్యానారాయణ, వెంకన్న గౌడ్, భాష్పాక హరి కిషన్, చొల్లేటి రమేష్ ,కేశబోయిన శేఖర్, మిర్యాల యాదగిరి, రాపోలు పరమే,ష్ చిక్కాల రాములు, కంది సూర్యనారాయణ, కే శివ, కొంపల్లి బిక్షపతి, ముంతాజ్, కరుణాకర్ గౌడ్, వాసుదేవ వెంకట నరసయ్య, పంకజ్ జాదవ్ తదితరులు మాట్లాడారు. మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి సంజీవ, స్థానిక తహసిల్దార్ పరశురాం ,ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు ,తదితరులు హాజరయ్యారు.

## ప్రజాస్వామ్య తలుపులు తెరిచిన రాజనీతిజ్ఞుడు పూలే

సూర్యాపేట, ఏప్రిల్ 11 (మనం ప్రతినిధి) ప్రజాస్వామ్య తలుపులు తెరిచిన రాజనీతిజ్ఞుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు గట్ల రమాశంకర్ అన్నారు. శనివారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని తెలంగాణ జన సమితి జిల్లా కార్యాలయంలో జరిగిన పూలే జయంతి వేడుకలకు హాజరై మాట్లాడుతూ....భారతీయ సమాజ వికాస గమనాన్ని జాతీయోద్యమం పూర్వాపరాల దృష్ట్యా పరిశీలించినపుడు, హిందూ మతాధిష్టిత సామాజిక నిర్మాణంలో అంతర్లీనంగా స్థిరపడిన వర్ణవ్యవస్థ, కులవివక్ష, సామాజిక అసమానతలపై సూత్రప్రాయంగా, ప్రయోగాత్మకంగా ప్రతిఘటించిన దూరదృష్టి గల రాజనీతిజ్ఞుడు పూలేఅన్నారు . పూలే దృక్పథం కేవలం సంస్కరణాత్మక స్థాయిలోనే కాకుండా, సమగ్ర సామాజిక పునర్నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్న విప్లవాత్మక భావజాలాన్ని ప్రతిబింబించింది అని స్పష్టం చేశారు.పాశ్చాత్య ప్రజాస్వామ్య సిద్ధాంతాలైన లిబర్టీ (స్వేచ్ఛ), ఈక్వాలిటీ (సమానత్వం), పేటర్నిటీ (సోదరభావం) వంటి మౌలిక సూత్రాలను భారతీయ సామాజిక సందర్భానికి అన్వయిస్తూ, పూలే ఒక సమాన హక్కుల ఆధారిత సమాజాన్ని నిర్మించాలనే సంకల్పంతో ఉద్యమించారుఅన్నారు. యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు నారబోయిన



కిరణ్ మాట్లాడుతూ పూలే ఆలోచనలు కేవలం సిద్ధాంతాత్మక ప్రకటనలుగా నిలిచిపోకుండా, పీడిత వర్గాల సామాజిక చైతన్యాన్ని మేల్కొల్పే ఉద్యమాల రూపంలో కార్యరూపం దాల్చాయి అని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, మానవతావాద సమానత్వ సిద్ధాంతం,కుల నిర్మూలన సిద్ధాంతం,వివేకాధారిత సంస్కరణవాదం వంటి జటిలమైన తాత్విక భావనలను తన ఉద్యమాలల్లో అంతర్లీనంగా నూరిపోసి, పూలే భారతీయ ప్రజాస్వామ్యానికి ఒక బలమైన ఆలోచనా పునాది వేశారు. ఆయన దృష్టిలో ప్రజాస్వామ్యం అనేది కేవలం రాజకీయ వ్యవస్థ మాత్రమే కాదు, అది ఒక సామాజిక నైతిక వ్యవస్థ, అందులో ప్రతి మనిషి గౌరవం, హక్కులు, అవకాశాలు సమానంగా పరిరక్షించబడాలి. ఈ విధంగా, పూలే ప్రజాస్వామ్యాన్ని సామాజిక విముక్తి సాధనంగాఅభివర్ణించి,భారతదేశంలో సమ సమాజ నిర్మాణానికి మార్గదర్శకుడిగా నిలిచారు. ఈ కార్యక్రమంలో జన సమితి ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బచ్చలకూరి గోపి విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు బొమ్మగాని వినయ్ గౌడ్ ఉపాధ్యక్షులు ఈశ్వర్ సింగ్ మైనార్టీ సెల్ పట్టణ కన్వీనర్ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

## 'మనం' కథనానికి స్పందన...

- ఎట్టకేలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

పెన్ పహాడ్, ఏప్రిల్ 11 (మనం న్యూస్)ః మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మోక్షం ఎప్పుడో... అనే కథనా ఈనెల ఏడో తారీఖున మనం తెలుగు దినపత్రికలో ప్రచురింపబడిన కథనానికి స్పందించిన ప్రభుత్వ యంత్రాంగం గత గురు, శుక్రవారాల్లో మండలంలోని రైతుల పండించిన పంటను కొనుగోలు చేయడం కోసం మొదటి రోజు అనాజిపురం మాచారం ధర్మాపురం గ్రామాల్లో ఇందిరా క్రాంతి పథకం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆదేశాల మేరకు ఏపీఎం దాసరి అంజయ్య, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏ ఐ సి సి సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, స్థానిక తహసిల్దార్ రాజశేఖర్ రెడ్డి మండల పార్టీ నాయకులతో కలిసి కొనుగోలు కేంద్రాల ప్రారంభించారు అదేవిధంగా మరుసటి రోజు అనంతరం, పెన్ పహాడ్ పిఎసిఎస్ కార్యాలయాల వద్ద డిసిఒ ప్రవీణ్ కుమార్ తో పాటు తహసిల్దార్ రాజశేఖర్ రెడ్డి మాజీ మార్కెట్ చైర్మన్ తూముల భుజంగరావు తో కలిసి అదేవిధంగా మహమ్మదాపురం సింగారెడ్డి పాలెం గ్రామాల్లో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తాసిల్దార్ రాజశేఖర్ రెడ్డి తో కలిసి ప్రారంభించడం జరిగింది




ఇప్పటికే రైతులు 60 నుంచి 70 శాతం వరి కోతలను పూర్తి చేసి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలు తరలించారు ఎండలు తీవ్రంగా ఉన్నందున వర్షాలు రాకముందే వాతావరణం మారకముందే ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేసి మిల్లర్లకు తరలించాలని రైతుల కోరుతున్నారు కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యాన్ని వెంట వెంటనే కాంటాలు వేస్తారా లేక గన్ని బ్యాగులు కొరత, ఎగుమతికి దిగుమతికి లారీలు నిర్వహణ, మిల్లర్ల సహకారం ఉంటుందో లేదో..వేచి చూడాల్సిందే...

## సామాజిక అసమానతను రూపుమాపిన వ్యక్తి పూలే

పాలకీడు ఏప్రిల్ 11 (మనం న్యూస్)ః మండల కేంద్రంలో సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే 199 జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడు గొర్రె శ్రీనివాస్ మాట్లాడుతూ... అంటరానితనాన్ని ఎండగట్టి సామాజిక అసమానతలు మీద అలుపెరగని పోరాటం చేసి అణగారిన వర్గాల విద్యాభివృద్ధి కోసం కృషిచేసిన గొప్ప సంఘసంస్కర్త మానవ హక్కులకై ఉద్యమించిన సామాజిక విప్లవకారుడు బాలికల విద్యాభివృద్ధికి పాటుపడిన ఆదర్శప్రాయుడని భావితరాలకు నిత్య స్ఫూర్తి ప్రదాత గా నిలిచిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఆయన అభివర్ణించాడు. ఈ కార్యక్రమంలో దూళిపాళ్ల ధనుంజయ నాయుడు, సుబ్బు గౌడ్, వెంకటయ్య, సతీష్, శ్రీనివాస్ ,నరసింహ, చంద్రయ్య, ఎల్లయ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.



## అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే



- మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు

కోదాడ, ఏప్రిల్ 11( మనం న్యూస్)ః అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని కోదాడ మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు అన్నారు. శనివారం కోదాడ మునిసిపల్ కార్యాలయం లో పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు. అనంతరం ఆమె మాట్లాడుతూ పూలే మహిళా విద్యకు,సామాజిక సమానత్వానికి బాటలు వేసిన మహనీయుడన్నారు. సంఘ సంస్కర్త గా నాడు సమాజం లో ఉన్న రుగ్మతలను రూపు మాపడానికి తన జీవితాన్ని త్యాగం చేసిన త్యాగ శీలి అన్నారు. పూలే అభ్యుదయ భావాల తోనే సమాజ చైతన్యం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమాదేవి, వైస్ చైర్మన్ మల్లీశ్వరి, కౌన్సిలర్ లు సిబ్బంది ఉన్నారు.

# చదువుతోనే జీవితంలో ఎదుగుదల




- పోలే దంపతులను ఆదర్శంగా తీసుకోవాలి
- సిద్దిపేటలో ఘనంగా పూలే జయంతి ఉత్సవాలు
- అబ్దుల్ అహ్మద్, జిల్లా అదనపు కలెక్టర్

సిద్దిపేట ఏప్రిల్ 11 మనం ప్రతినిధిః యువత, మహిళలు పూలే దంపతులను ఆదర్శంగా తీసుకొని తమలక్ష్యసాధనకు ముందుకు సాగాలని అబ్దుల్ అహ్మద్ పేర్కొన్నారు.జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శనివారం సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంశలో నిర్వహించిన మహాత్మ జ్యోతిబా పూలే 200వ జయంతి ఉత్సవాలకు జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్ ) అబ్దుల్ అహ్మద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా మాట్లాడుతూ ముందుగా మహాత్మ ఆయన 200 సంవత్సరాల క్రితం జన్మించిన జ్యోతిరావు పూలే జీవిత ప్రయాణం, సాధించిన విజయాలు, ఒడిదుడుకులు గూర్చి నేటి యువత తెలుసుకోవాలని సూచించారు. ఆయన యొక్క చరిత్రను చదివి నేటితరం ప్రజలకు దాని యొక్క ప్రాముఖ్యతను తెలపాలి. నేడు మనం కులం, మతం, జాతి, లింగ బేధాలు లేకుండా ఇలా జీవిస్తున్నాము అంటే రెండు వందల సంవత్సరాల క్రితం మహాత్మ జ్యోతిబాపూలే లాంటి వారు చేసిన త్యాగాల ఫలితంగానే అని తెలుసుకోవాలి. జీవితంలో ఎదగాలంటే అది చదువుతూనే సాధ్యమవుతుందని ఒక దృఢ సంకల్పం వారికి ఉండేది. ఎన్నో కష్టాలు, అవమానాలు పడుతూ చదువు కొనసాగించారు. తన భార్య సావిత్రిబాయి పూలేకు సైతం చదువు చెప్పించి బాలికల విద్యకు నాంది పలికారు. కుటుంబ సభ్యులు, సమాజం ప్రతి ఒక్కరూ తాను చేస్తున్న పనులకు అడ్డంపడిన తను దృఢ సంకల్పంతో అనుకున్న పనిని ఎన్ని ఒడ్డులు కొడుకులు ఎదురైన ఎదుర్కొని పూర్తి చేసి సాధించే తత్వం నేటితరం యువత జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే దంపతులను చూసి నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట మున్సిపల్ ఛైర్పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు, డీఆర్వో నాగరాజమ్మ, బీసీ వెల్ఫేర్ అధికారి సయ్యద్ రఫీ, నాయకులు పయ్యావుల రాములు, పోచబోయిన శ్రీహరి యాదవ్, మామిండ్ల ఐలయ్య, మురళీకృష్ణ, నవీన్ గౌడ్, ప్రశాంత్, పర్శరాములు, కోటగిరి ప్రభాకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుడు మహాత్మా జ్యోతి రావు పూలే

- టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి
- మహిళల విద్య కోసం కృషి చేసిన మహనీయుడు పూలే
- ఆయన ఆదర్శాలను అందరూ పాటించాలి
- కలెక్టర్ ప్రావీణ్య



సంగారెడ్డి, ఏప్రిల్ 11 (మనంప్రతినిధి)ః మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి వేడుకలు సంగారెడ్డి లో ఘనంగా జరిగాయి. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పక్కన ఉన్న జ్యోతి రావు పూలే విగ్రహానికి టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య లు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సంగారెడ్డి కొత్త బస్టాండ్ సమీపంలో బిసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతి రావు పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ సంతానం, సంపాదన ముఖ్యం కాదు సమాజమే తనకు ముఖ్యమని మహనీయుడు జ్యోతి రావు పూలే ఈ సమాజం లోని సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. ఈరోజు మహిళలు అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నరంటే అందుకు మహాత్మా జ్యోతి రావు పూలే చేసిన కృషే కారణమని, మహిళల విద్య కోసం ఆయన ఎంతగానో కృషి చేశారని ఆయన ఆశయాలను మనం అందరం ముందుకు తీసుకుపోవాలని



పిలుపునిచ్చారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ మహిళా విద్య కోసం మహాత్మా జ్యోతి రావు పూలే చేసిన కృషి ని ఈ సమాజం మరువవద్దన్నారు. వింతతు పునర్వివాహాలు ప్రోత్సహించి ఆనాటి సాంఘిక దురాచారాల కు వ్యతిరేకంగా పోరాడాడన్నారు. స్వయంగా తన భార్యకు విద్యను అభ్యసించడం తో పాటు మహిళ ల కోసం ప్రత్యేక విద్యాలయం ఏర్పాటు చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా సంతోష్, సదాశివపేట మున్సిపల్ చైర్ పర్సన్ మునిపల్లె అంజమ్మ సత్యనారాయణ, డిఆర్వో పాండు తదితరులు పాల్గొన్నారు.

# ఐపిఆర్ జెడి. డిఎస్ జగన్‌ని కలిసిన ట్రైబల్ జర్నలిస్ట్‌లు






వరంగల్, ఏప్రిల్ 11(మనంన్యూస్)ః వరంగల్ శివారులోని ధరావత్ సుజాత రాంచందర్ నాయక్ కుమారుడు కోడలు ఫంక్షన్ కు ఐ అండ్ పిఆర్ డిపార్ట్మెంట్ జాయింట్ డైరెక్టర్ డి ఎస్ జగన్ హాజరయ్యారు. సుజాత రాంచందర్ నాయక్ కుమారుడుకోడలుకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనను ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ నాయక్, రాష్ట్ర కార్యదర్శి లావుడ్య రాజు నాయక్, కోరిక సునీల్ కుమార్ ఆర్ ఐ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన మాజీఎంపీ



వరంగల్, ఏప్రిల్ 11(మనం న్యూస్)ః వరంగల్ జిల్లా ఉప్పర్ పల్లి క్రాస్ కళ్యాణ లక్ష్మి గార్డెన్స్ కన్వెన్షన్ లో ధరావత్ సుజాత రాంచందర్ నాయక్ కుమారుడు ఉదయ్ కుమార్ జాటోత్ భద్రమ్మ హమ్యా నాయక్ పుత్రిక తో వివాహ మహోత్సవం కు ముఖ్య నాయకులు హాజరై నూతన వధూవరులను మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్, బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి ఎస్ నాయక్, డి ఎస్ జగన్ నాయక్‌లు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. అలాగే మాజీ జెడ్పిటిసి గుగులోత్ వీరమ్మ గోపి సింగ్, ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అధ్యక్షులు బాదావత్ బాలాజీ నాయక్, లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్, సీనియర్ జర్నలిస్టు భూక్య శ్రవణ్ కుమార్, రెవెన్యూ డిపార్ట్మెంట్ ఆర్ ఐ పోరిక సునీల్ కుమార్, జై సింగ్ రాథోడ్, రాధా రాజు నాయక్, వీరు నాయక్, రతన్ సింగ్, తిరుపతి, యాకూబ్ నాయక్, వాలు నాయక్, రవినాథ్, బంధుమిత్రులు ముఖ్య నాయకులు వివిధ కుల సంఘాల నాయకులు రాజకీయ నాయకులు మొదలైన వారు పాల్గొని ఆశీర్వదించారు.

# డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక



మహాదేవపూర్, ఏప్రిల్ 11మనం న్యూస్ః మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుటకు సూరారం గ్రామంలోని కుల సంఘాలు అంబేద్కర్ వాదులు సమక్షంలో ఉత్సవ కమిటీని ఎన్నుకోవడం జరిగింది ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా భూపెల్లి రవితేజ, ఉపాధ్యక్షుడిగా కొయ్యల రాయబాపు , ప్రధాన కార్యదర్శిగా మల్లారపు రమేష్, కోశాధికారిగా కొత్తూరి రవి, సంయుక్త కార్యదర్శిగా దేవరపల్లి కేశవ్, సహా కార్యదర్శిగా ఆయిల అశోక్ ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఈ కొత్త కార్యవర్గంబాధ్యతలు స్వకరించింది అందరి సహకారంతో పెద్ద ఎత్తున వేడుక చేస్తామని వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో తూడిచెర్ల దుర్గయ్య, జిల్లెల్ల నాగరాజు, బందెల వెంకటేష్ సకినాల సంతోష్,తలారి రవి సాగర్, లేళ్ళ సాంబమూర్తి, ఎనగందుల సుందర్ మరియు గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగామహాత్మా జ్యోతిరావు పూలే జయంతి



మహాదేవపూర్ ఏప్రిల్ 11మనం న్యూస్ః జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే కూరగాయల మార్కెట్ వద్ద మహాదేవపూర్ గ్రామ సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు .ఈసందర్భంగా సర్పంచ్ హసీనా భాను అక్బర్ ఖాన్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే సమాజంలో సమానత్వం, విద్యా ప్రాధాన్యత, సామాజిక న్యాయం కోసం చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివని పేర్కొన్నారుముఖ్యంగా మహిళల విద్యకు ఆయన చేసిన కృషి మనందరికీ ఆదర్శమని, యువత ఆయన ఆలోచనలను అనుసరించాలని పిలుపునిచ్చారు. మహారాష్ట్ర రాష్ట్రంలోని సతారా జిల్లాలో 1827 వ సంవత్సరం 11వ తేదీ రోజున జ్యోతిరావు పూలే వేడుకబడిన కులం బిసి కులంలో జన్మించారు జ్యోతి రావు పూలు అమ్మినందుకు జ్యోతిరావు పూలే అని అన్నారు జ్యోతిరావు పూలే ను జ్యోతిబాపూలే అని కూడా అంటారు జ్యోతిరావు పూలే గారి తల్లి అయిన చిన్నగా ఉన్నప్పుడే మరణించింది మురారి ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించాడు, ఆ తర్వాత విద్యను మానేసి తన తండ్రికి వ్యవసాయంలో సహాయం చేశాడు ఒక ఉపాధ్యాయుడు జ్యోతిరావు పూలే తెలివితేటలను గమనించి విద్యను నేర్పించాలని తన తండ్రితో అన్నాడు, తన తండ్రి జ్యోతి రావు పూలే విద్యను కొనసాగించి విద్యావంతుని చేశారు,కార్యక్రమానికి ముఖ్య అతిథిగాహాజరైనజిల్లాగ్రంథాలయసంస్థ చైర్మన్ కోట రాజబాపు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే సిద్ధాంతాలు సమాజాన్ని ముందుకు నడిపే మార్గదర్శకాలు అని తెలిపారు. పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను గుర్తు చేస్తూ, ప్రతి ఒక్కరూ విద్య ద్వారా అభివృద్ధి సాధించాలని సూచించారు. అలాగే గ్రంథాలయాల ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆయనప్రాముఖ్యతనువివరించారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు విద్యను నేర్పించాలని నిరంతరం కృషి చేశారు జ్యోతిరావుపూలే ప్రత్యేకంగా అణగారిన దళిత మహిళలకు విద్యను నేర్పించాలని పట్టుదలతో ఆకాంక్షతో 1848వ సంవత్సరంలో మహారాష్ట్ర రాష్ట్రంలోని పూనే పట్టణంలో మొట్టమొదటి తొలి మహిళ పాఠశాలను ప్రారంభించారు తన సతీమతి సావిత్రిబాయి పూలే యావత్ భారతదేశం లోనే మొట్టమొదటి తొలి మహిళ ఉపాధ్యాయుల తీర్చిదిద్దిన ఘనత మహాత్మ జ్యోతిరావు పూలేదే బడుగు బలహీన అనగారిన మహిళల కోసం బడుగు,బలహీన వర్గాల ప్రజల కోసం ఎన్నో పాఠశాలను ఏర్పాటు చేసే విద్యావంతులుగా తీర్చిదిద్దిన గొప్ప మహనీయుడు జ్యోతిరావు పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుంగల శ్రీజ, పంచాయతీ కార్యదర్శి కల్పన, వార్డు సభ్యులు నల్లబుగా సమ్మయ్య , అశ్రర్ ఖురేషి, మహమ్మద్ బిన్ అలీ , ఎండి నయిమొద్దీన్, గడ్డం వెంకటేశ్వర స్వామి, మాజీ ఎంపిపి రాణిబాయ్, మాజీ ఎంపీటీసీ సుధాకర్, మాజీ సహకార సంఘం చైర్మన్ సల్ల తిరుపతయ్య ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు మరియు గ్రామపంచాయతీ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం




మహాదేవపూర్, ఏప్రిల్ 11 మనం న్యూస్ః మహాదేవపూర్ మండల కేంద్రంలోని పదవ తరగతి పరీక్షలు పూర్తి చేసుకోనున్న విద్యార్థులు తమ భవిష్యత్తు పై సరైన నిర్ణయం తీసుకోవాలనే ఉద్దేశంతో మహాదేవపూర్ ఎన్ ఎస్ యు ఐ టీమ్ ఆధ్వర్యంలో స్థానిక గ్రీన్ వుడ్ కాన్సెప్ట్ స్కూల్ లో ప్రత్యేక కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి, విద్యార్థులకు మార్గదర్శక కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ యుఐ సోషల్ మీడియా ఇన్చార్జ్ బిల్లా కార్తీక్ మాట్లాడుతూ, పదవ తరగతి అనేది విద్యార్థి జీవితంలో ఒక కీలకమైన మలుపు అని, ఈ సమయంలో తీసుకునే నిర్ణయం వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఇతరుల ఒత్తిడికి లోనుకాకుండా తమ ఆసక్తికి అనుగుణంగా ఇంటర్మీడియట్ ఎంపీసీ , బైపీసీ , సి ఈ సి, హెచ్.సి.సి పాలిటెక్నిక్, ఐటిఐ లేదా ఒకేషనల్ కోర్సులను ఎంచుకోవాలని వారు సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వివిధ కోర్సులపై ఉన్న అవగాహన లోపాన్ని తొలగించేందుకు ఈ కరపత్రం ఎంతగానో ఉపయోగపడుతుందని, ఇందులో ఉన్నత చదువులతో పాటు తక్కువ సమయంలో ఉపాధినిచ్చే కోర్సుల వివరాలను కూడా పొందుపరిచామని వివరించారు. అడ్మిషన్ల ప్రక్రియలో గానీ, సరైన కళాశాలను ఎంచుకోవడంలో గానీ విద్యార్థులకు ఏవైనా సందేహాలు ఉంటే తమ హెల్పర్ టీమ్ను సంప్రదించవచ్చని, విద్యార్థుల అభ్యున్నతే తమ లక్ష్యమని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ యుఐ టౌన్ ప్రెసిడెంట్ శ్రవణ్ కుమార్ ఎన్ఎస్ యు ఐ సోషల్ మీడియా ఇన్చార్జ్ బిల్లా కార్తీక్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన గ్రీన్ వుడ్ పాఠశాల ప్రిన్సిపాల్ చీర్ల శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# హిందూ ధర్మ రక్షణకు పాటుపడదాం శ్రీశ్రీ పరబ్రహ్మా నందగిరి స్వామీజీ

మహాదేవపూర్, ఏప్రిల్ 11మనం న్యూస్ః మహదేవపూర్ మండల కేంద్రంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ ను స్థాపించి ఈ సంవత్సరానికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి గ్రామంలో హిందూ ధర్మ సమ్మేళనం పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన హిందూ ధర్మ సమ్మేళనానికి ముఖ్య అతిథి గా శ్రీశ్రీశ్రీ పరబ్రహ్మానందగిరి స్వామీజీ పరంధామ ఆశ్రమం కరీంనగర్ విచ్చేసి అనుగ్రభాషణం చేశారు. స్వామీజీ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు అందరం పాటుపడాలని పాశ్చాత్తాపోకడల వల్ల హిందూ సమాజం విడిపోయి ధర్మ పరిరక్షణకు ముందుకు రావడం లేదని మనమందరం ధర్మ పరిరక్షణలో భాగంగా కుటుంబ నియంత్రణ పాటించకుండా ఒక కుటుంబం నలుగురికి తక్కువ కాకుండా సంతాన భాగ్యం కలిగి ఉండాలని ఇదే ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు పునాది అని అన్నారు.

ధర్మ పరిరక్షణలో భాగంగా మనమందరం ఐక్యమత్యంగా ఉండి ఈ సువిశాల భారతదేశాన్ని ఒక్క తాటిపై తీసుకువచ్చి మన సనాతనధర్మాన్ని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ సమ్మేళన సమితి అధ్యక్షులు సముద్రాల తిరుపతి, గంట తిరుమల్ ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కోశాధికారి,జ్యోతి సేవికా సమితి భూపాలపల్లి, విశ్వహిందూ పరిషత్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు దేవరావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# శ్రీరామ్ దళ్ జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ



నర్సంపేట, ఏప్రిల్ 11 (మనం న్యూస్)ః నర్సంపేట నియోజకవర్గ పరిధి శ్రీరామ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్ మేళా కోసం పట్టణంలోని కెఎస్ఆర్ కాన్సెప్ట్ స్కూల్లో జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ జిల్లా అధ్యక్షులు కొరిటాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి భూసాని రమేష్ మీడియాతో మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం సంస్థ యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు.రాష్ట్ర అధ్యక్షుడు నంద్యాల వినయ్ రెడ్డి మార్గదర్శకత్వంలో ఈ జాబ్ మేళాను నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు. కోశాధికారి మచ్చిక రవితేజ కార్యక్రమంలో యువతకు ప్రోత్సాహం అందించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, యువతీ యువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ కన్నబోయిన రమేష్, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు ఊరేటి శివకుమార్, నర్సంపేట మండల అధ్యక్షులు అజ్మీర రాజ నాయక్, దుగ్గొండి మండల అధ్యక్షుడు జాను అజయ్,నర్సంపేట నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ పొనుగోటి త్రినేష్ రావు, నిమ్మగడ్డ నాగార్జునతో పాటు ఇతర కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే 199 జయంతి



మల్హర్, ఏప్రిల్ 11(మనం న్యూస్)ః కొయ్యూరులో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ కమిటీ చైర్మన్ విజయగిరి సమ్మయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు కొయ్యూరు గ్రామ సర్పంచ్ కొండ రాజమ్మ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అయిత రాజిరెడ్డి మాజీ సర్పంచ్ జంపయ్య హాజరై మాట్లాడుతూ ఐటీ శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు సహకారంతో మహాత్మ జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే విగ్రహాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు మాహ త్మ జ్యోతిరావు పూలే సమాజంలో సమానత్వం, విద్యా ప్రాధాన్యత, సామాజిక న్యాయం కోసం చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివని పేర్కొన్నారు ముఖ్యంగా మహిళల విద్యకు ఆయన చేసిన కృషి మనందరికీ ఆదర్శమని, యువత ఆయన ఆలోచనలను అనుసరించాలని పిలుపునిచ్చారు. జ్యోతిరావు పూలే సిద్ధాంతాలు సమాజాన్ని ముందుకు నడిపే మార్గదర్శకాలు అని తెలిపారు. పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను గుర్తు చేస్తూ, ప్రతి ఒక్కరూ విద్య ద్వారా అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లకావత్ సవేందర్ పావురాల ఓదెలు మెట్టు రామన్న మమత రజిత శ్రీనివాస్ రెడ్డి చారి కటకం నరేష్ తిరుమల్ పాల్గొన్నారు.

# ఘనంగా జ్యోతిబా పూలే 199వ జయంతి




దుగ్గొండి, ఏప్రిల్ 11 (మనం న్యూస్)ః మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల గిర్నిబావి నందు మహాత్మ జ్యోతిబా పూలే 199వ,జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ప్రిన్సిపాల్ ఓదేల మల్లయ్య, ఉపాధ్యాయులు మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన గావించి ఘనమైన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మల్లయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి మహాత్మ జ్యోతిబా పూలే చెప్పిన చదువే ఆయుధంగా మలుచుకొని పేదరికాన్ని, అంటరానితనాన్ని, కుల వివక్షతను, మూఢనమ్మకాలను రూపుమాపి అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేయడం జరిగింది. కె.వరుణ్ మహాత్మ జ్యోతిబాపూలే, పి.మణిత్ కుమార్ సావిత్రిబాయి పూలే వేషధారణలో కనిపించి అందర్నీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ సతీష్, డిప్యూటీ వార్డెన్ సమత మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో పాత నేరస్తుడి అరెస్ట్

- నేరస్తుడి నుండి బంగారం వెండి బైకులు స్వాధీనం
- పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్



ఓదెల ఏప్రిల్ 11,(మనం న్యూస్)ః పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం శానగొండలో శుక్రవారం సాయంత్రం పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా ఒక వ్యక్తి మోటర్ సైకిల్ పై కనిపించగా ఆపి వాహన పత్రాలు అడగగా అట్టి వ్యక్తి సరైన సమాధానం చెప్పకపోవడం తో అనుమానం వచ్చి వెంటనే అతని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకొని విచారించగా అతని పేరు గుంటి శ్రావణ్ అని వెంటనే పోలీస్ స్టేషన్ తరలించి విచారించగా గతంలో చేసిన దొంగతనాల నేరాలను ఒప్పుకున్నాడు.నిందితుడు పొత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గల జీలకుంట ఎల్లమ్మ టెంపుల్ లో జరిగి దొంగతనం,గుండ్లపల్లి,బాయమ్మపల్లి, పొత్కపల్లి గ్రామాలలో రాత్రిపూట ఇండ్లలో, దేవాలయాల్లో,ద్విచక్ర వాహనాల దొంగతనాలు చేశాడు. నిందితుడు కాచిగూడ,కుషాయిగూడ, దండేపల్లి పోలీస్ స్టేషన్ ల పరిధిల్లో ఇదే తరహాలో దొంగతనాలకు పాల్పడ్డాడు. రికవరీ చేసిన సొమ్ములను సీజ్ చేసి, నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుని శనివారం రిమాండ్కు తరలించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి ఎస్సై రమేష్ మాట్లాడుతూ నిందితుడి దగ్గర నుంచి 5 గ్రాముల బంగారం (2 బంగారం నుప్టియల్స్ ,1 ముక్కుపుడక ),4 తులాల సిల్వర్ ఫ్లో రింగ్స్, 10 తులాల వెండి రా ముక్కలు,మూడు మోటార్ సైకిల్స్ ను రికవరీ చేసినట్లు తెలిపారు.రాబోయేది వేసవికాలం కాబట్టి సెలవుల నిమిత్తం ఊర్లకు వెళ్లే వారు తమ విలువైన బంగారు ఆభరణాలను తమతో తీసుకువెళ్లడం లేదా బ్యాంక్ లాకర్లలో భద్రపరచడం చేసుకోవాలని సూచించారు. అంతేకాక ఊర్లోకి వెళ్లే ముందు పోలీస్ స్టేషన్‌కుసమాచారం ఇవ్వాలన్నారు.

# మోతాదు ప్రకారమే ఔషధాలు వినియోగించాలి



ములుగు, ఏప్రిల్ 11, మనం ప్రతినిధిః మానవ శరీరం నిర్వీర్యం కాకుండా ఉండాలంటే మోతాదు ప్రకారం, డాక్టర్ సూచనల ప్రకారం మాత్రమే ఔషధాలు వాడాలని డ్రగ్ ఇన్స్పెక్టర్ కోమల్ల దేవేందర్ రెడ్డి అన్నారు. శనివారం 99 రోజుల 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా శనివారం హెల్త్ వీక్ 6వ రోజు సందర్భంగా తెలంగాణ ఔషధ నియంత్రణ శాఖ, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో ఔషధాల దుర్వినియోగం, మత్తు పదార్థాల నివారణపై భారీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ముందుగా ములుగు ప్రభుత్వ ఆసుపత్రి నుండి అంబేద్కర్ విగ్రహం మీదుగా కలెక్టరేట్ వరకు నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులతో కలిసి భారీ ర్యాలీని నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అవగాహన కల్పించారు.సరైన డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీ బయోటిక్స్ వాడకూడదని, దీనివల్ల యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ ఏర్పడి భవిష్యత్తులో మందులు పనిచేయని స్థితి వస్తుందని డ్రగ్ ఇన్స్పెక్టర్ హెచ్చరించారు. నకిలీ మందుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మందుల నాణ్యతను తనిఖీ చేయడానికి ప్యాకింగ్ ఉన్న ఖఖ ఇూఛ్ఛీలను స్కాన్ చేయాలని సూచించారు. ఏదైనా ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నంబర్: 1800-599-6969 కు సమాచారం ఇవ్వాలని కోరారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. వీటి సరఫరా విక్రయాలపై సమాచారం ఉంటే 1908 టోల్ ఫ్రీ నంబర్కు పిర్యాదు చేయాలన్నారు.జి జి హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మత్తుకు బానిసైన వారి కోసం ములుగు ప్రభుత్వ ఆసుపత్రిలో 10 బెడ్లతో కూడిన డ్రగ్ అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగ్ మెడికల్ విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు అధికారుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గోపాలరావు, డాక్టర్ జగదీశ్వర్, హాస్పిటల్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ములుగు జిల్లా మెడికల్ అసోసియేషన్ సభ్యులు, మెడికల్ షాపు యజమానులు, ఫార్మసిస్టు మరియు నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



ఒకరేమో టీమ్ఇండియా పేస్ సంచలనం. అతడు బంతి చేపడితే స్టార్ బ్యాటర్లే ఖంగుతింటారు. అయినా 15 ఏళ్ల కుర్రాడి ముందు ఆ 'బూమ్ బూమ్' బౌలింగ్ పనికిరాలేదు.

మరొకరు ఆస్ట్రేలియా టాప్ బౌలర్. సీనియర్ బ్యాటర్లే అతడి బంతులు ఆడేందుకు ఆపసోపాలు పడేవారు. కానీ, మన 15 ఏళ్ల యువ సంచలనం ముందు పసిబౌలర్ గా మారిపోయాడు.

ఇక ఐపీఎల్లో 200+ వికెట్లు తీసిన 'స్వింగ్' మాస్టర్ కూ తప్పలేదు భంగపాటు. పవర్ ప్లేలో కచ్చితంగా వికెట్ అందించే ఆ బౌలర్ ను కనీసం లెక్కలో కూడా వేసుకోలేదు ఈ 15 ఏళ్ల బుల్లోడు.

# వైభవ్ బాదితే..
## స్టార్లూ స్టన్ అవ్వాల్సిందే!

పైన మన ఉపోద్ఘాతమంతా ఐపీఎల్ లోనే కాదు యావత్ క్రికెట్ ప్రపంచంలోనే సంచలనంగా మారిన వైభవ్ సూర్యవంశీ గురించి కాగా.. ఆ ముగ్గురు పేసర్లు జస్ ప్రీత్ బుమ్రా, జోష్ హేజిల్ వుడ్, భువనేశ్వర్ కుమార్. వైభవ్ ఖాతాలో వీరే కాదండోయ్.. మిగతా జట్లలోని టాప్ బౌలర్లూ బాధితులే. తనకు బౌలర్ తో పనిలేదు.. బంతిని మాత్రమే లక్ష్యంగా చేసుకుంటానని చెబుతోన్న వైభవ్ సత్తా ఏంటో ఇప్పటికిప్పుడే బయటకొచ్చిందేమీ కాదు. గత సీజన్లోనే సెంచరీతో క్రికెట్ అభిమానుల కంట్లో పడిన ఈ బుల్లోడు.. ఇటీవల కాలంలో చెలరేగిపోతున్నాడు. జాతీయజట్టులోకి వచ్చేందుకు తలుపులను బలంగానే బాదేస్తున్నాడు.

గతేడాది ఐపీఎల్ లో వైభవ్ ఆట చూశాక.. ఏదో గాలివాటం ప్రదర్శన అంటూ కొట్టిపడేసినవారూ లేకపోలేదు. కానీ దేశవాళీతోపాటు అండర్-19 ఎమర్జింగ్ ఆసియా కప్ లో వైభవ్ ప్రదర్శన అద్భుతమనే చెప్పాలి. సరేలే.. అక్కడున్నవారంతా వైభవ్ మాదిరిగా పిల్లలే కదా అని కామెంట్లు వచ్చాయి. ఎప్పుడైతే ఐపీఎల్ 2026 సీజన్ లో అడుగుపెట్టాడో.. ఇక్కడ చూపించమనండి అతడి సత్తా ఏంటో అని సోషల్ మీడియాలో సవాళ్లు విసిరారు. ఇప్పటికి రాజస్థాన్ నాలుగు మ్యాచులు ఆడింది. అన్నింటా విజయం సాధించింది. చెన్నై సూపర్ కింగ్స్ తో పరుగుల జోరు మొదలుపెట్టిన వైభవ్.. మ్యాట్ హెన్రీ వంటి అగ్రశ్రేణి బౌలర్ పై ఆధిపత్యం ప్రదర్శించాడు. ఇక గుజరాత్ తో అయితే సిరాజ్, రబాడ, ప్రసిద్ధ్ కృష్ణనూ వదల్లేదు. వీరంతా ఒకెత్తు అయితే.. ముంబయితో మ్యాచ్ లో జస్ ప్రీత్ బుమ్రా వేసిన తొలి బంతినే సిక్స్ గా మలిచాడు వైభవ్. అరే.. బాబూ వాళ్లేమీ గల్లీ బౌలర్లు కాదు.. ప్రపంచంలోనే టాప్ బౌలర్లు.. అలాంటివారికి కాస్త రెస్పెక్ట్ ఇవ్వు అనే ఫ్యాన్స్ కు తన బ్యాట్ తోనే సమాధానం ఇచ్చాడు ఈ 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ. ఇక జోష్ హేజిల్ వుడ్, భువనేశ్వర్ కుమార్ సంగతి సరేసరి. వారికీ చుక్కలు చూపించాడు. ఈ సీజన్ లో 266 స్ట్రైక్రేట్ తో నాలుగు మ్యాచుల్లో 200 పరుగులు రాబట్టాడు.

వైభవ్ ను చూస్తుంటే క్రికెట్ దిగ్గజం 'సచిన్' గుర్తుకొస్తారనడంలో సందేహం లేదు. సచిన్ కూడా కేవలం 16 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్ లోకి అడుగుపెట్టి.. సంచలన రికార్డులు నమోదు చేశాడు. ఇప్పుడు వైభవ్ ఆటను చూసిన అభిమానులూ అతడికి త్వరగా జాతీయజట్టులో అవకాశం ఇవ్వాలని డిమాండ్లు చేస్తున్నారు. ఫ్యాన్స్ మాత్రమే కాదండోయ్.. మాజీ క్రికెటర్లదీ ఇదే సూచన. ఇలాంటి సమయంలోనే వైభవ్ చాలా జాగ్రత్తగా ఉండాలి. ఇతర విషయాలపై దృష్టిపెట్టకూడదు. ఆట పైనే ఏకాగ్రత పెట్టాలి. అప్పుడు మరో 'సచిన్'ను చూసే అవకాశం అభిమానులకు ఉంటుంది. కొన్ని మ్యాచుల్లో విఫలమైనా సరే.. అతడిపై ఒత్తిడి తీసుకురాకుండా అవకాశాలు ఇవ్వాలి. లేకపోతే మరో పృథ్వీ షాలా మిగిలిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదని క్రికెట్ విశ్లేషకుల అంచనా.



# అదరగొట్టిన పంజాబ్ బ్యాటర్లు.. సన్రైజర్స్‌కు తప్పని ఓటమి

ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ మూడో విజయం సాధించింది. శనివారం సన్ రైజర్స్ హైదరాబాద్ తో జరిగిన మ్యాచ్ లో పంజాబ్ 6 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. ఈ టార్గెట్ ని పంజాబ్ 4 వికెట్లు కోల్పోయి 7 బంతులు మిగిలుండగానే ఛేదించింది. ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్య (57; 20 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్ లు), ప్రభ్ సిమ్రన్ సింగ్ (51; 25 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సు) అర్ధ శతకాలు బాది పంజాబ్ కు శుభారంభం అందించారు. నాలుగో స్థానంలో వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (69*; 33 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్ లు) మెరుపు ఇన్నింగ్స్ తో అలరించాడు. కూపర్ కనోలీ (11), నేహల్ వధేరా (14), శశాంక్ సింగ్ (16*) పరుగులు చేశారు. సన్రైజర్స్ బౌలర్లలో శివాంగ్ కుమార్ 3, హర్ష్ దూబె ఒక వికెట్ పడగొట్టారు. నాలుగు మ్యాచ్ ల్లో హైదరాబాద్ కు ఇది మూడో ఓటమి.

సన్ రైజర్స్ బ్యాటర్లలో ఓపెనర్ అభిషేక్ శర్మ (74; 28 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సు) విధ్వంసం సృష్టించాడు. ఇతను 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ట్రావిస్ హెడ్ (38; 23 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. వీరిద్దరి ధాటికి హైదరాబాద్ 8 ఓవర్లకే 120 పరుగులు చేసింది. తర్వాత ఒకే ఓవర్ లో అభిషేక్, హెడ్ పెవిలియన్ చేరారు. ఇషాన్ కిషన్ (27), హెన్రిచ్ క్లాసెన్ (39), అనికేత్ వర్మ (18) పరుగులు చేశారు. ఆఖర్లో పంజాబ్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. దీంతో కనీసం 250+ స్కోరు చేస్తారనుకుంటే సాధ్యపడలేదు. పంజాబ్ బౌలర్లలో అర్షదీప్ సింగ్ 2, శశాంక్ సింగ్ 2 వికెట్లు, బార్ట్ లెట్ ఒక వికెట్ పడగొట్టారు.

# ఫైనల్‌కు దూసుకెళ్లిన ఆయుష్శెట్టి



చెన్నైలోని నింగ్బో వేదికగా జరుగుతోన్న ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ లో భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి సంచలనం సృష్టించాడు. సెమీస్ లో నంబర్ వన్ ప్లేయర్ కున్లావుత్ వితిద్సర్న్ (థాయ్ లాండ్)ను ఓడించి ఆయుష్ ఫైనల్ కు దూసుకెళ్లాడు. తొలి సెట్ లో ఓడిపోయినా.. పట్టువదలకుండా విజేతగా నిలవడం గమనార్హం. హోరాహోరీగా సాగిన పోరులో 10-21, 21-19, 21-17 తేడాతో ఆయుష్ గెలిచాడు.



# సంక్రాంతి బరిలో బాలయ్య

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ తన నెక్స్ట్ చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద సందడి చేసేందుకు సిద్ధమవుతున్నాడు. ప్రస్తుతం ఆయన గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తన 111వ సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నాడు. ఈ భారీ మాస్ ఎంటర్ టైనర్ ను రికార్డు సమయంలో పూర్తి చేసి, ఈ ఏడాది దసరా కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ తర్వాత బాలయ్య మరిన్ని క్రేజీ సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు.

బాలకృష్ణ తన చిత్రాల కోసం వివేక్ ఆత్రేయ మరియు విజయ్ కనకమేడల వంటి దర్శకులతో పని చేయనున్నాడు. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో రూపొందనున్న సినిమా భారీ బడ్జెట్ తో, లాంగ్ షూటింగ్ జరుపుకోనుంది. విశేషమేమిటంటే, ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా నిర్మించనున్నారు. ఈ సినిమా అధికారిక ప్రారంభోత్సవం దసరా పండుగ సందర్భంగా జరగనుండగా, షూటింగ్ మాత్రం ఆ తర్వాత ప్రారంభం కానుంది.

మరోవైపు, 'నాంది' ఫేమ్ విజయ్ కనకమేడల చెప్పిన పవర్ ఫుల్ కాప్ డ్రామా బాలయ్యను ఎంతగానో ఆకట్టుకుంది. ఎస్ఎల్వీ సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి బరిలో నిలపాలని బాలకృష్ణ లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఇందుకోసం ఈ ఏడాది వేసవి తర్వాత షూటింగ్ మొదలుపెట్టి, అటు గోపీచంద్ మలినేని సినిమా, ఇటు విజయ్ సినిమా షూటింగ్ లలో బాలయ్య పాల్గొననున్నాడు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించి నటీనటుల ఎంపిక ప్రక్రియ వేగంగా జరుగుతోంది, త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రానుంది.

# ప్రదీప్ రంగనాథన్ ముందే ఊహించాడా!



వరుస సూపర్ హిట్స్ అందులోని వరుస 100 కోట్ల సినిమాలతో అదరగొట్టిన కోలీవుడ్ యంగ్ హీరో ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటించిన లేటెస్ట్ సినిమానే ఎల్ ఐ కే(లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ). ఒక ఫ్యూచరిస్టిక్ లవ్ స్టోరీగా దర్శకుడు విగ్నేష్ శివన్ ప్లాన్ చేసిన ఈ సినిమా పలు వాయిదాలు తర్వాత వచ్చి ఒకింత డిజప్పాయింట్ టాక్ సొంతం చేసుకుంది.

ప్రదీప్ గత సినిమా డ్యూడ్ కి అయినా కొంచెం మిక్స్డ్ టాక్ వచ్చినప్పటికీ బాక్సాఫీస్ వద్ద 100కోట్లు రాబట్టింది కానీ ఇప్పుడు ఎల్ ఐ కె పరిస్థితి మాత్రం అందులో సగం కూడా కనిపించడం లేదు. అయితే ఇది ప్రదీప్ ముందే ఊహించినట్టే ఉన్నాడని చెప్పొచ్చు. ఆ మధ్య ప్రమోషన్స్ లో కూడా సినిమాపై అంత నమ్మకంగా 100 కోట్లు కొడతా అన్నట్టు మాట్లాడలేదు.

ప్రేక్షకులకి తన సినిమా నచ్చితే చాలు అన్నట్టే చెప్పుకొచ్చాడు. సో లైక్ ని ముందే లైట్ తీసుకున్నాడు కాబోలు.. ఈ సినిమాకి మినిమం ఓపెనింగ్స్ కూడా తెలుగులో రానట్టే టాక్. సో ఇదే తనకి ఫస్ట్ ఫ్లాప్ గా మిగిలిపోతుందేమో చూడాలి.

# అప్పుడు రెండు రోజులు నిద్రపోలేదు: కయాదు లోహర్

'పవళ మల్లి' సాంగ్ తో యువతను విశేషంగా ఆకట్టుకున్నారు నటి కయాదు లోహర్, సంగీత దర్శకుడు సాయి అభయంకర్. గత నెలలో విడుదలైన ఈ పాట సూపర్ హిట్ కావడంపై తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో కయాదు స్పందించారు. ఈ సాంగ్ లో తాను ఎలా నటించాల్సి వచ్చిందో చెప్పారు. ఈ పాట కోసం తాను రెండు రోజులు నిద్రపోలేదన్నారు.

''పవళ మల్లి'లో అనుకోకుండా భాగమయ్యా. ఓసారి అర్ధరాత్రి 2 గంటల సమయంలో సంగీత దర్శకుడు సాయి నుంచి ఫోన్ వచ్చింది. ఆ టైమ్ లో ఫోన్ చేసేసరికి కంగారుపడ్డా. ఏమైందని అడిగితే.. తానొక పాట కంపోజ్ చేశానని చాలా బాగా వచ్చిందన్నాడు. ఆ పాటలో భాగం కావాలని కోరాడు. ఆ తర్వాత నేనూ ఆ పాట విన్నా. నాకు బాగా నచ్చింది. వెంటనే ఓకే చెప్పా. ఎంజాయ్ చేస్తూ సాంగ్ చేశాం. దీని కోసం రెండు రోజులపాటు నిద్రలేకుండా రిహార్సల్స్ చేశాం. ప్రేక్షకులు మా సాంగ్ ను ఫుల్ ఎంజాయ్ చేశారు. అందుకు సంతోషంగా అనిపించింది'' అని కయాదు లోహర్ చెప్పారు. సాయి అభయంకర్, శ్రుతిహాసన్ దీనిని ఆలపించారు. మార్చిలో దీనిని యూట్యూబ్ లో విడుదల చేయగా ఇప్పటివరకూ 8 కోట్లకు పైగా వ్యూస్ వచ్చాయి.

అనంతరం కయాదు తన తదుపరి చిత్రాల గురించి మాట్లాడారు. ముఖ్యంగా 'ప్యారడైజ్'లో భాగం కావడంపై ఆనందం వ్యక్తం చేశారు. ''నానితో 'ది ప్యారడైజ్' చేస్తున్నా. అది స్పెషల్ ప్రాజెక్ట్. అందులో నా పాత్ర చాలా భిన్నంగా ఉంటుంది. ఇప్పటివరకూ అలాంటి పాత్ర నేను చేయలేదు'' అని తెలిపారు. ప్రస్తుతం ఆమె తెలుగు, తమిళం మలయాళంలో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఆమె కథానాయికగా నటించిన 'పల్లిచట్టంబి' శుక్రవారం విడుదలైంది.

# 'ది ప్యారడైజ్'లో కయాదు లుక్

న్యాచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'ది పారడైజ్' పై అంచనాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇప్పటికే విడుదలైన 'ఆయా షేర్' సాంగ్ సోషల్ మీడియాలో భారీ రెస్పాన్స్ అందుకోగా, తాజాగా ఈ చిత్ర హీరోయిన్ కాయదు లోహర్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆమె ఫస్ట్ లుక్ ను విడుదల చేశారు.

ఈ సినిమాలో ఆమె 'సుబ్బు' అనే పాత్రలో కనిపిస్తుండగా, పోస్టర్ లోని ఆమె లుక్ చూస్తుంటే హీరోకి భిన్నంగా ఒక రిచ్ ఫ్యామిలీకి చెందిన అమ్మాయిగా నటిస్తున్నట్లు అర్థమవుతోంది. ఈ భారీ యాక్షన్ డ్రామాలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు విలన్ గా నటిస్తున్నారు. వీరితో పాటు రాఘవ్ జుయల్, బాబు మోహన్ మరియు సంపూర్ణేష్ బాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



ఈ చిత్రానికి రాక్స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తున్నాడు. ఎస్.ఎల్.వి సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం పాన్-ఇండియా లెవల్లో తెరకెక్కుతోంది. ఆగస్టు 21, 2026న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా థియేటర్లలోకి రానుంది.



# పాపం హరీష్..
## ఎట్టకేలకు ఉస్తాద్ ఫెయిల్యూర్ ఒప్పుకున్న డైరెక్టర్..!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా దర్శకుడు హరీష్ శంకర్ రూపొందించిన భారీ చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయిన సంగతి తెలిసిందే. ఈ సినిమా విడుదల తర్వాత కూడా హరీష్ శంకర్ సోషల్ మీడియాలో సినిమాను గట్టిగా వెనకేసుకొచ్చాడు. అయితే, ప్రేక్షకుల నుండి వస్తున్న నెగటివ్ ఫీడ్ బ్యాక్ ను ఆయన అంగీకరించడం లేదని అప్పట్లో భారీగా విమర్శలు వచ్చాయి. తాజాగా నటుడు తిరువీర్ నటించిన 'పాపం ప్రతాప్' మూవీ ఈవెంట్ కు హాజరైన హరీష్, స్టేజ్ మీద ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. యాంకర్ తనను 'పాపం హరీష్' అని పిలవగానే, ఉస్తాద్ భగత్ సింగ్ సరిగ్గా ఆడలేదనే ఉద్దేశంతోనే అలా అన్నారేమో అని తాను అనుకున్నట్లు నిజాయితీగా ఒప్పుకున్నాడు. ఆ తర్వాత అందరినీ అలా పిలవడం చూసి, అది ప్రమోషన్ లో భాగమని అర్థం చేసుకున్నానని చెబుతూనే, సినిమా ఫలితంపై తన మనసులో ఉన్న మాటను బయటపెట్టాడు. ఎట్టకేలకు హరీష్ శంకర్ తన సినిమా ఫలితాన్ని అంగీకరించడం ఫ్యాన్స్ కు కాస్త ఊరటనిస్తోంది. అగ్రెసివ్ ప్రమోషన్ల కంటే కంటెంట్ పై దృష్టి పెడితే హరీష్ మళ్ళీ తన ఫామ్ లోకి రావడం ఖాయమని ఫ్యాన్స్ అంటున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.